thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 26 కరీంనగర్ ఆదివారం, 6 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్.. కోళ్లఫారాల్లో పెరుగుతున్న గుడ్ల నిల్వలు

చెన్నై: నామక్కల్ కోళ్ల ఫారాల్లో 2 కోట్ల గుడ్లు నిల్వ ఉండడంతో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నామక్కల్ మండల పరిధిలో నామక్కల్, ఈరోడ్, తిరుప్పూర్, పల్లడం తదితర ప్రాంతాల్లో 6 కోట్లకు పైగా కోళ్లను పెంచుతున్నారు. ఆ కోళ్లు ప్రతిరోజు 5 కోట్ల గుడ్లు పెడుతుంటాయి. ఈ గుడ్లను రాష్ట్ర ప్రభుత్వ పౌష్టికాహార పథకంలో వినియోగిస్తుండగా, పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ విస్తరణ, ఎండల కారణంగా ప్రజలు కోడిగుడ్ల వినియోగం తగ్గించారు. దీంతో, కోళ్ల ఫాంలలో గుడ్లు నిల్వలు పెరుగుతున్నాయి. డిమాండ్ తగ్గడంతో ఐదు రోజుల్లో గుడ్డుపై సుమారు 1.10 పైసలు తగ్గించి ప్రస్తుతం ఫాం ధర 3.80 పైసలుగా ఉంది. ప్రస్తుతం పాంలలో 2 కోట్ల గుడ్లు నిల్వ ఉన్నాయని, మరో రెండు రోజుల్లో ఇవి పాడయ్యే అవకాశముందని, అలాగే, నిల్వలు కూడా పెరిగే అవకాశముందని ఫాం యజమానులు వాపోతున్నారు.




## శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు భద్రాచలం ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి దర్శనం కోసం ఆలయం నుంచి గోదావరి నది తీరం వరకు.. సుమారు కిలోమీటర్ మేర భక్తులు క్యూ కట్టారు. స్వామివారి దర్శనానికి నాలుగు గంటల వరకు సమయం పడుతోందని ఆలయ వర్గాలు తెలిపాయి. క్యూ లైన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక దర్శనాలు నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు.



## హెచ్‌సీయూ ఉదంతాన్ని ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలి

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరైంది కాదని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి అండగా నిలిచిన పార్టీలకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. హెచ్‌సీయూ ఉదంతాన్ని ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలన్నారు. "భారాస ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టింది. రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దితే నిలబెట్టుకోవడం ఈ ప్రభుత్వానికి చేతకాలేదు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక ప్రతిష్ఠను ఈ ప్రభుత్వం దిగజార్చింది. హెచ్‌సీయూ విషయంలో మరోసారి రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా చేశారు" అని కేసీఆర్ విమర్శించారు.

## శ్రీరామనవమి రోజున ఆ ఇంట్లో ముఖ్యమంత్రి రేవంత్ లంచ్





సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించారు. జిల్లా కేంద్రంలోని రెండో వార్డులో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ కూడా అక్కడే డిన్నర్ చేశారు. అనంతరం మంత్రులు, కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అతి త్వరలో 30 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేయబోతున్నట్లు ప్రకటించారు. త్రివర్ణంలో బీపీఎల్ కార్డులు ఉండబోతున్నాయని అన్నారు. గ్రీన్ కలర్‌లో ఏపీఎల్ కార్డులు ఉంటాయని చెప్పారు. వీటి ద్వారా రాష్ట్రంలోని 1.10 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులంతా స్థానిక రేషన్ షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఇళ్లలో భోజనం చేయాలని సూచించారు. శ్రీరామనవమి పండుగరోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలంలో పర్యటిస్తారని.. అదేరోజు సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తారని చెప్పారు. రేషన్ దుకాణాలకు సన్న బియ్యం రవాణా, పంపిణీని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన ఆహార భద్రత రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తిచేయాలన్నారు.

# డీసీసీలు ఇక పవర్‌ఫుల్!

## పార్టీ జిల్లా అధ్యక్షులకు ప్రాధాన్యం

### నామినేటెడ్ పదవులు, టికెట్ల కేటాయింపు ప్రక్రియలో భాగస్వామ్యం





హైదరాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లు ఇకపై బలోపేతం కానున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షులకు అధిక ప్రాధాన్యత లభించనుంది. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలు స్థానిక సంస్థలు, అసెంబ్లీ, లోక్‌సభ టికెట్ల కేటాయింపులోనూ డీసీసీ అధ్యక్షులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. ఈ మేరకు ఆమె చేసిన ప్రతిపాదనకు ఏఐసీసీ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.

లోక్‌సభ టికెట్ల కేటాయింపు కోసం ఏఐసీసీ ఏర్పాటు చేసే సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) తరహాలోనే రాష్ట్ర స్థాయిలో టికెట్ల కేటాయింపు కోసం ఏర్పాటు చేసే కమిటీల్లో డీసీసీ అధ్యక్షులను నియమించాలని ఆమె ప్రతిపాదించినట్టు తెలుస్తోంది.

**సిఫారసులు, లాబీయింగ్‌కు చెల్లుచీటీ..** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సంస్థాగతంగా భారీ మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు ప్రధాన నాయకుల సిఫారసు, లాబీయింగ్ ప్రాతిపదికన జరుగుతున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామక ప్రక్రియ ఇకపై పూర్తిగా మారిపోనుంది. మీనాక్షి నటరాజన్ మార్కు డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో కనిపించనుందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

పార్టీలో జిల్లా, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులు కీలకమైనందున పీసీసీ అధ్యక్షుడి పర్యవేక్షణలో ఈ మూడు స్థాయిల్లోని పదవులను పకడ్బందీగా భర్తీ చేయాలని ఆమె యోచి స్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా డీసీసీ అధ్యక్షుల నియామకంలో సిఫారసులకు కాకుండా స్థానిక నాయకత్వం అభిప్రాయాలకు ప్రాధాన్యతనివ్వాలని పార్టీ ఇన్‌చార్జి భావిస్తున్నారు. అందులో భాగంగా డీసీసీ అధ్యక్ష పదవుల కోసం జిల్లాకు మూడు పేర్లతో ప్యానెల్ తయారు చేయాలని, ఆ మూడు పేర్లపై స్థానిక నాయకుల నుంచి అభిప్రాయసేకరణ జరిపి, ఎవరికి ఎక్కువ మొగ్గు కనిపిస్తే వారిని డీసీసీ అధ్యక్షులుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రస్తుత కసరత్తు నేపథ్యంలో జిల్లా అధ్యక్షుల నియామకానికి కొంత సమయం పడుతుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

## మీనాక్షి నటరాజన్ ప్రతిపాదనలకు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్

**త్వరలో టీపీసీసీ కార్యవర్గం!** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీపీసీసీ కార్యవర్గం కూడా త్వరలోనే వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతానికి పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, 20 మంది వరకు ఉపాధ్యక్షులను నియమిస్తారని, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యదర్శులు, అధికార ప్రతినిధులు తదితర పదవులు ఆ తర్వాత ప్రకటిస్తారని సమాచారం. వాస్తవానికి దీపాదాస్ మున్షీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడే పీసీసీ కార్యవర్గంపై కసరత్తు జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు మున్షీతో భేటీ అయి టీపీసీసీ కార్యవర్గం కోసం కొంత కసరత్తు చేశారు. అయితే మీనాక్షి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఈ జాబితాను పూర్తిగా పక్కన పెట్టారని, పార్టీలో సీనియార్టీ, గతంలో నిర్వహించిన పదవుల ప్రాతిపదికన ఆమె జిల్లాల వారీగా జాబితాను తయారు చేస్తున్నట్టు సమాచారం. నెలాఖరుకు కొత్త కార్యవర్గాన్ని ప్రకటిస్తారని తెలుస్తోంది.

**మంత్రివర్గ విస్తరణకూ మోక్షం?...** రాష్ట్రంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణ అంశాన్ని కూడా పరిష్కరించాలని ఏఐసీసీ నిర్ణయించింది. ఇందుకోసం పలుమార్లు రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపిన ఢిల్లీ పెద్దలు ఓ అభిప్రాయానికి వచ్చారని, సామాజిక కోణంలో ఐదు లేదా ఆరు బెర్తులు భర్తీ చేసే విధంగా త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ వస్తుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. అంతా సవ్యంగా జరిగితే నెలాఖరులోపు మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల జాబితాకు కూడా క్లియరెన్స్ ఇప్పించేందుకు మీనాక్షి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఆయనకు లేదు సాటి... పోటీ...!

## మోడీ రిటైర్ కారు...నాలుగోసారి రెడీ !!



నరేంద్ర మోడీ. ఈ దేశాన్ని గత పదకొండేళ్లుగా నిరాటంకంగా పాలిస్తున్న నాయకుడు. పదేళ్ళకు పైబడి ఈ దేశాన్ని పాలించిన వారిలో మొదటి ఇద్దరూ పండిట్ నెహ్రూ, ఇందిరాగాంధీ అయితే మూడవ వారు కచ్చితంగా నరేంద్ర మోడీయే. ఈ దేశాన్ని వారిద్దరి తరువాత అత్యధిక కాలం పాలించిన క్రెడిట్ మోడీదే. ఇక ఈ మూడవ టెర్మ్ ఆయన పూర్తి చేసుకుంటే వారి పక్కకు వచ్చేస్తారు. అటల్ బిహారీ వాజ్ పేయి వంటి నాయకుడు సాధించలేనిది లాల్ కృష్ణ అద్వానీ ప్రధానిగా కూడా కాలేనిది నరేంద్ర మోడీ ఈ విధంగా సాధించారు. 2013 దాకా జాతీయ రాజకీయ తెర మీద మోడీ లేరు. కానీ ఆయన వచ్చాక పోటీకి మరెవరూ మిగలలేదు. మరి అంతటి రాజకీయ చాణక్యుడు, రాజనీతి కోవిదుడు అయిన నరేంద్ర మోడీ అలా ఊరకే రిటైర్ అయిపోతారు అని ఎవరైనా అనుకుంటే అది పప్పులోనే కాదు తప్పులోనూ కాలేసినట్లే. మోడీ అక్కడ ఉన్నది అన్నది గుర్తు పెట్టుకోవాల్సిందే ఎవరైనా అని అంటున్నారు. నిజానికి మోడీ ప్రధానిగా ఉండడం ఎటూ ఆయన ప్రత్యర్థులకు ఇండియా కూటమి భాగస్వాములకు ఇష్టం ఉండదు. ఇది సహజమైనది. కానీ ఎన్డీయే మిత్రులలో కొన్ని పార్టీలకు కూడా మోడీ రిటైర్ అయిపోవాలనే ఉందా అంటే ఉందీ అని అంటారు. కారణం మోడీ లాంటి నేతతో వారికి బయటకు చెప్పుకున్నంత ఈజీ ట్రావెలింగ్ అయితే కాదు అన్నది తెలిసే అంటున్నారు. అయితే ఇలా వీళ్ళెవరికీ ఇష్టం లేదని మోడీ అర్ధాంతరంగా దిగిపోవాలా అంటే అబ్బే అది అసలు కుదిరే వ్యవహారమే కాదు అని అంటున్నారు. ఎందుకంటే మోడీ గత ఏడాది జూన్ 9న మూడోసారి ప్రధాని అయ్యారు. ఇంకా ఏడాది కూడా కాలేదు. పోనీ సెప్టెంబర్ కి అవుతుంది అనుకున్నా నిండా నాలుగేళ్ళ పదవిని ఉంచుకుని ఆయన ఎందుకు దిగిపోతారు అని అంటున్నారు. మోడీ గద్దె దిగాలీ అంటే బీజేపీలోనే ముసలం పుట్టాలి. అంటే అక్కడే తిరుగుబాటు రావాలి. కానీ అది జరుగుతుందా అంటే అసంభవం అనే చెప్పాలని అంటున్నారు. పోనీ బీజేపీని రెండుగా చీల్చే పరిస్థితి ఉందా అంటే అది అసాధ్యం అని కూడా అంటున్నారు. మరి అలా కాకపోతే మోడీ ఎలా గద్దె దిగుతారు అంటే అసలు ఆయన దిగే సమస్యే లేదు అని అంటున్నారు. ఇలా మోడీ ఇప్పటికిపుడు దిగిపోవాలని బలంగా కోరుకునే ప్రత్యర్థి పార్టీలలో మహారాష్ట్రకు చెందిన ఉద్ధవ్ థాక్రే శివసేన కూడా ఉంది. ఆ పార్టీ నాయకుడు సంజయ్ రౌత్ ఇపుడు మోడీ గద్దె దిగడం గురించి ప్రస్తావిస్తున్నారు. అలా దిగిపోవడానికి ఆయనకు 75 ఏళ్లు నిండితే చాలు అని అందరికీ తెలిసిన ఒక బహిరంగ రహస్యం చెబుతున్నారు. కానీ అలా మోడీ దిగిపోయే చాన్స్ ఉందా అంటే నూటికి వేయి శాతం లేనే లేదు అని అంటున్నారు. ఇంతకీ ఆయన చెబుతున్నది బీజేపీలో ఒక రూల్ ఉందని దాని ప్రకారమే మోడీ గద్దె దిగుతారని. ఒకసారి ఆ రూల్ చూసుకుంటే కనుక 75 ఏళ్ళు నిండిన వారు పదవి నుంచి దిగిపోవాల్సిందే అని. ఆ రూల్ బీజేపీలో ఉంది కానీ అది అందరికీ రూల్ కాదు. పైగా దానిని అమలు చేయమని అడిగే వారు ఎవరు ఉంటారు అక్కడ అన్నది మరో ప్రశ్న. మోడీని మించిన శక్తివంతమైన నాయకులు ఉంటే అపుడు రూల్ బుక్ తీయవచ్చు. కానీ మోడీతో అల్లుకున్న బీజేపీలో ఆయన్ని కాదని ఏ రూల్ అయినా అమలు చేయగలరా అన్నదే కదా పాయింట్. ఇక చూస్తే కనుక ఈ రూల్ అన్నది ఒక సాధారణ నిబంధన గానే చూస్తున్నారు. అది మోడీ లాంటి శక్తివంతులకు అసలు వర్తించదు అని అంటున్నారు. మోడీ 2022లో తాను మూడోసారి ప్రధాని అవాలని కోరుకున్నారు. అలా అయ్యారు. ఇక మోడీ హెల్త్ విషయం చూస్తే ఆయనతో పాతికేళ్ళ కుర్రాళ్ళు కూడా పోటీ పడలేరు. అంత పర్ఫెక్ట్ ఫిట్ నెస్ తో ఆయన ఉంటారు. మోడీకి ప్రజాకర్షణ లేదా అంటే కొండంత ఉంది. ఆయన ఇమేజ్ అంతర్జాతీయంగా నానాటికీ పెరుగుతూ పోతోంది. ఇన్ని రకాలైన అనుకూలతలు ఉన్న మోడీ నాలుగోసారి కూడా ప్రధానిగా రెడీ అన్న సీన్ ఉంటే పాపం ప్రత్యర్థి పార్టీలు మోడీ దిగిపోతారు అని స్వయంతృప్తి ప్రకటనలు చేసుకుంటూ అందులోనే ఆనందం వెతుక్కుంటున్నాయా అంటే అదే అక్షరాలా నిజం అని అంటున్నారు. ఇక బీజేపీ విషయానికి వస్తే ఎవరైనా ప్రధాని కావాలని అనుకున్నా ఆ సీటు ఇప్పట్లో అయితే ఖాళీ అయ్యేది లేదు. మోడీ తానుగా పదవీ విరమణ చేసిన తరువాతనే ఆశావహులు రేసులోకి రావాల్సిందే తప్ప ఇప్పటికైతే కలలుగానే వాటిని చూడాలని అంటున్నారు. మోడీ అంతటి మేరు పర్వతాన్ని మధ్యలో దించేసి తాము ప్రధాని అవాలనుకోడం ఎంతటి అసాధ్యమో ఆ ఆశావహులకు కూడా బహుశా తెలుసు. అందుకే మోడీ ఇప్పట్లో రిటైర్ కారు. ఆ మాటకు వస్తే ఎపుడు రిటైర్ అవుతారూ అంటే అది ఆయన చేతుల్లోనే ఉంది తప్ప ఎవరి వల్ల కాదని తేలుతున్న సత్యం. సో మోడీ 2029లో కూడా ప్రధానిగా ప్రమాణం చేసే ముహూర్తం కోసం అంతా వేచి చూడదమే ఉత్తమమేమో.




# తెలంగాణలో భారీగా లొంగిపోతున్న మావోయిస్టులు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 5: భద్రాద్రి ములుగు జిల్లాలో భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 86 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములుగు జిల్లా పోలీసుల సమక్షంలో సరెండర్ అయ్యారు. వీరిలో 66 మంది పురుషులు, 20 మంది మహిళా మావోయిస్టులు కలిపి మొత్తం 86 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఒక్కొక్కరికి తక్షణ సహాయం కింద 25 వేల రూపాయలను అందించారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా 86 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని.. కొత్తగూడెం పోలీసు అధికారులు వారితో ఫ్రెండ్లీగా మాట్లాడి వారిని ఒప్పించారని, నమ్మకం ఏర్పడ్డాకే వీరంతా లొంగిపోయారని తెలిపారు. ప్రభుత్వం తరపున సహాయం కూడా అందించినట్లు ఐజీ చంద్రశేఖర్ తెలిపారు. కాగా.. ఇంత భారీగా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోవడం మావోలకు గట్టి ఎదురుదెబ్బ అనే చెప్పవచ్చు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూతకు ఆకర్షితులై జనజీవన స్రవంతిలో కలవాలని లొంగిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఛత్తీగఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీలకు కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. వచ్చే మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టు పార్టీలను పూర్తిగా కూకటి వేళ్లతో సహా పెకిలించి వేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించినట్లుగా మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లలో భారీగా మావోయిస్టుల మృత్యువాత పడ్డారు. ఈ ఎన్‌కౌంటర్ల దెబ్బకు అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. ఈరోజు భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. వీరంతా కీలకమైన ప్రాంతాల్లో పనిచేసిన వారే అని పోలీసులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున మావోల లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలకు గట్టి దెబ్బే అని చెప్పుకోవచ్చు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మొత్తం వార్ జోన్ నడుస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో అగ్రనేతలను కోల్పోతున్నారు

మావోలు. కేంద్ర కమిటీల్లో ఉన్న వారంతా వయోభారంతో ఉన్న పరిస్థితి. ఇలాంటి సందర్భంగా కేంద్ర బలగాలతో పోరాడే శక్తి లేక, తమ విలువైన జీవితాలను కుటుంబాలతో కలపాలని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూతలో భాగంగా పోలీసుల ఎదుట మావోయిస్టులు లొంగిపోయారు.




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా పలు మార్కెట్లు కుదేలయ్యాయి. అగ్రరాజ్య మార్కెట్లు కూడా భారీగా పతనమయ్యాయి. మరోవైపు ఈ ఆర్థిక అనిశ్చితులతో మాంద్యం తప్పదనే భయాలూ వెంటాడుతున్నాయి. ఈ పరిణామాలపై అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. టారిఫ్‌లపై తన నిర్ణయాన్ని మరోసారి సమర్థించుకున్న ఆయన.. అమెరికా సుసంపన్నం కావడానికి ఇదే సరైన సమయమని వ్యాఖ్యానించారు. మార్కెట్ల పతనంపై ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ పెట్టారు. “అమెరికాలోకి చాలామంది ఇన్వెస్టర్లు వస్తున్నారు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. దీనిపై నా విధానాల్లో ఎలాంటి మార్పు ఉండబోదు. మునుపెన్నడూ లేనివిధంగా ధనవంతులు కావడానికి ఇదే గొప్ప సమయం” అని ట్రంప్ రాసుకొచ్చారు. “పెద్ద పెద్ద వ్యాపారులు ఈ టారిఫ్‌లతో ఎలాంటి ఆందోళన చెందట్లేదు. ఎందుకంటే వారు ఇక్కడే ఉంటారని వారికి తెలుసు. మన ఆర్థికవ్యవస్థను మరింత బలోపేతం చేసే అంశంపై వారు దృష్టిపెట్టారు. ఇదే చాలా ముఖ్యం” అని ట్రంప్ మరో పోస్ట్‌లో వెల్లడించారు. భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ సుంకాల మోత మోగించిన సంగతి తెలిసిందే. దీంతో గురువారం నాటి ట్రేడింగ్‌లో భారీగా క్షీణించిన అమెరికా మార్కెట్లు శుక్రవారం కూడా మరింత పతనమయ్యాయి. డోజోన్స్ 5.5శాతం, ఎస్అండ్‌పీ 500 సూచీ 5.97 మేర నష్టపోయాయి. ఈ రెండు రోజుల్లో అమెరికా మార్కెట్ విలువ ఏకంగా 5 ట్రిలియన్ డాలర్ల మేర తరిగిపోయింది.

ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయని ఇప్పటికే పలువురు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.




## యువతులతో డ్రగ్స్ డెలివరీ.. ముఠా వివరాలు వెల్లడించిన సందీప్ శాండిల్య

హైదరాబాద్: విదేశాలకు అక్రమంగా డబ్బును బదిలీ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును ఈ ముఠా విదేశాలకు తరలిస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు నైజీరియన్లను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు. గత 3 నెలలకు పైగా ఈ ముఠాపై నిఘా పెట్టినట్లు చెప్పారు. డ్రగ్స్ తీసుకున్నాక నగదు చెల్లింపులు జరుపుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వీటిని డెలివరీ చేసేందుకు అమ్మాయిలను ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో తెలిసిందని పేర్కొన్నారు. టోలీచౌకి ప్రాంతంలో డ్రగ్స్ డెలివరీ చేసిన యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేసినట్లు వివరించారు. ముఠా సభ్యులు ఆ యువతికి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు. “గత 5 సంవత్సరాలుగా డ్రగ్స్ ద్వారా నైజీరియాకు వెళ్లిన డబ్బుల వివరాలు సేకరించాం. భారత్‌తో పాటు అమెరికాలో నైజీరియన్లు డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. డ్రగ్స్ కావాలని కస్టమర్లు డబ్బులు చెల్లించే లావాదేవీల ద్వారా నిందితులను పట్టుకున్నాం. కస్టమర్లు డబ్బులు చెల్లించేందుకు 15 మంది యువతుల బ్యాంక్ ఖాతాలు ఇచ్చారు. 5 సంవత్సరాల్లో డ్రగ్స్ కోసం భారత్–అమెరికా–నైజీరియన్ల మధ్య కోట్ల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు తేల్చాం. అమెరికా నుంచి డబ్బులు నేరుగా నైజీరియాకు వెళ్లకుండా.. మొదట భారత్‌కు పంపిస్తారు. ఇక్కడి నుంచి హవాలా మార్గంలో నైజీరియాకు తీసుకెళ్తారు. డ్రగ్స్ మొత్తం విదేశాల్లోనే తయారు అవుతున్నాయి. మన దేశంలో చాలా తక్కువ తయారవుతున్నట్లు గుర్తించాం. ఫారెక్స్ ఏజెంట్ల సహకారంతో నైజీరియన్లు డబ్బులను విదేశాలకు తరలిస్తున్నారు.” అని సందీప్ శాండిల్య చెప్పారు.




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోన్న బియ్యానికి కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.

ప్రధాని మోదీ ఫొటో ఉన్న ఫ్లెక్సీలు పెడితే చింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత చెప్పినా.. అవి మోదీ బియ్యమే అని అన్నారు. “ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో భాజపా కార్యకర్తలు ప్రధాని మోదీ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ పెడితే.. పోలీసుల సాయంతో చింపేయిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకోండి.. మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, ప్రధాని ఫొటో పెట్టండి. ఎందుకంటే బియ్యానికి డబ్బులిచ్చేది కేంద్రమే కాబట్టి. కాంగ్రెస్ ప్రభుత్వం కాస్త విజ్ఞతతో వ్యవహరించాలి.

బియ్యం విషయంలో రాష్ట్రం వాటా ఏమైనా ఉంటే చెప్పండి. మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. భారాస అధికారంలో ఉన్నప్పటినుంచీ లబ్ధిదారులకు సన్నబియ్యం ఇవ్వాలని భాజపా డిమాండ్ చేస్తూనే ఉంది. ఇన్నేళ్లకు ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడం మొదలుపెట్టారు” అని బండి సంజయ్ అన్నారు.

# ఎంఐఎం కోటలు బద్దలు కొడతాం




హైదరాబాద్, ఏప్రిల్ 5: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు తమదే అని రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఏబీఎన్–ఆంధ్రజ్యోతితో కిషన్ రెడ్డి మాట్లాడుతూ... తమకు సంఖ్యా బలం లేదని అందరూ అంటున్నారని.. కానీ అభివృద్ధిని కాంక్షిచే వారు బీజేపీకే ఓటు వేయబోతున్నారని చెప్పారు. ఇక అధికారంలో ఎవరు ఉన్నా మజ్లిస్‌కు హైదరాబాద్ రాసి ఇవ్వడం అలవాటుగా మారిందన్నారు. అందులో భాగంగానే ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఎవరు ఉంటే వాళ్లతో అంటకాగి హైదరాబాద్‌ను దోచుకోవడం ఎంఐఎంకు పరిపాటి అయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి ఎంఐఎం కోటలు బద్దలు కొడతామని స్పష్టం చేశారు. సంఖ్యా బలం ఉంటే బీజేపీనే గెలిచేదని.. సంఖ్యా బలం లేదు కాబట్టే ఓటింగ్ జరుగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో 120 మంది ఓటర్లు ఆచితూచి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా, హిందువులకు, హిందూ దేవుళ్లకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చే పార్టీ మజ్లిస్ పార్టీ అంటూ మండిపడ్డారు. గతంలో హైదరాబాద్‌లో అనేక సార్లు మతకలహాలు ప్రేరింపించిందన్నారు. అలాంటి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ చేయకుండా ఉండటం రాజకీయ కుట్రే అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కూడా ఎంఐఎంకు బానిసత్వంతో ఉండే పార్టీలని వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీని పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ కనుసైగలో ఈ రెండు పార్టీలు నడుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండూ కూడా ఎంఐఎం పార్టీ అడుగులకు మడుగులు ఒత్తుతూ పెంచి పోషిస్తున్నాయన్నారు. మజ్లిస్‌కు ఓటేస్తే ప్రజలెవరూ కూడా క్షమించరని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఈసారి కచ్చితంగా హైదరాబాద్ నగరంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని.. మేయర్ పీఠం మీద కూర్చోబోయేది భారతీయ జనతా పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలకు, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధం లేదని అన్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి మజ్లిస్ పార్టీని ఓడించాలని... బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. పార్టీలో అంతర్గత విబేధాలు ఉండటం సహజమని చెప్పుకొచ్చారు. అలాంటివి ఏవైనా ఉంటే పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్: వివాదాస్పదమైన హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల కేసులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై అధికారులను ఆదేశించారు. చెట్లను నరికివేయడంతో అక్కడి వన్యప్రాణులు చెల్లాచెదురయ్యాయంటూ కొందరు ఏఐ వీడియోలు సృష్టించడాన్ని సీఎం తీవ్రంగా పరిగణించారు. దీనిపై విచారణకు ఆదేశించేలా కోర్టును కోరాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో 25ఏళ్లలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారని, ఎన్నడూ వన్యప్రాణులు, పర్యావరణానికి సంబంధించిన వివాదాలు రాలేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏఐ ఫేక్ వీడియోలతో గందరగోళం సృష్టించారని వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. ఏఐ ఫేక్ కంటెంట్‌ను పసిగట్టే ఫోరెన్సిక్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌టూల్స్‌ను సమకూర్చుకోవాలన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, టీజీఐఐసీ ఎండీ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ

హైదరాబాద్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబును.. భాజపా ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును ఈటల రాజేందర్ కలిశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, రోడ్లు సరిగా లేవని, చెరువులు మురికి కూపాలుగా మారాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైడ్రా పేరిట డబ్బులు వసూలు చేస్తున్న బ్లాక్‌మెయిలర్లపై దృష్టి సారించాలని కోరారు. చిన్న దేవాలయాలను కూడా దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నగరానికి నాలుగు వైపులా డంప్ యార్డులు ఉండాలని.. చెత్తంతా బాలాజీనగర్‌కు పంపిస్తే అక్కడి ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. అభివృద్ధి



పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని శ్రీధర్‌బాబును కోరారు. సమస్యల పరిష్కారంపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారని ఈటల రాజేందర్ తెలిపారు.

# బోయిన్‌పల్లిలో ఆరుగురు కుటుంబసభ్యుల అదృశ్యం కేసులో పురోగతి

హైదరాబాద్: బోయిన్‌పల్లిలో ఆరుగురు కుటుంబసభ్యులు అదృశ్యమైన ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. వారంతా ఎంజీబీఎస్ నుంచి విజయవాడ వెళ్లినట్లు సీసీ ఫుటేజ్‌లో పోలీసులు గుర్తించారు. తమ మధ్య ఎలాంటి తగాదాలు లేవని కుటుంబసభ్యుడు నరేశ్ తెలిపాడు. అయితే, అందరి ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తుండటంతో ఆందోళనగా ఉందన్నాడు. వారంతా తీర్థయాత్రకు వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపాడు. న్యూ బోయిన్‌పల్లి ఏడుగుళ్ల సమీపంలో నివాసం ఉండే మహేశ్, ఉమా దంపతులు, వారి ముగ్గురు పిల్లలతోపాటు సంధ్య అనే మరో కుటుంబ సభ్యురాలు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మహేశ్ స్థానిక నీటి సరఫరా కేంద్రంలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. వీరి ఇంటికి సంధ్య గురువారం ఉదయం వెళ్లింది. మహేశ్, ఉమా.. వారి పిల్లలు రిషి, చైతు, శివన్‌లతో పాటు సంధ్య ఒకేసారి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఉమా సోదరుడు భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ ఆరుగురు ఆటో బుక్ చేసుకొని బోయిన్‌పల్లి నుంచి ఎంజీబీఎస్ స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడినుంచి విజయవాడ వెళ్లినట్లు గుర్తించి.. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

# రామానాయుడు స్టూడియోకు కలెక్టర్ నోటీసులు

విశాఖ: విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోకు నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండు వారాల సమయం ఇస్తామని, వారి వివరణ తర్వాత చర్యలు ఉంటాయని అన్నారు. “రామానాయుడు స్టూడియోకు చిత్ర నిర్మాణ పరిశ్రమ, స్టూడియో నిర్మాణం కోసం ప్రభుత్వం 34 ఎకరాలకు పైగా భూమిని కేటాయించింది. అందులో 15.17 ఎకరాలు హౌసింగ్ లేఅవుట్ కోసం మార్పు చేయాలని స్టూడియో యాజమాన్యం కోరింది. అది నిబంధనలకు విరుద్ధమని.. నోటీసులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది” అని కలెక్టర్ వివరించారు. రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూముల వ్యవహారంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. నివాస స్థలాలుగా మార్పు చేయాలని తలపెట్టిన 15.17 ఎకరాల భూ కేటాయింపు రద్దు చేయాలని నిర్ణయించింది. నిర్దేశించిన ప్రయోజనం కోసం ఇచ్చిన భూమిని అప్రయోజనం కోసం వినియోగిస్తే రద్దు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు. సిసోదియా ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ తాజాగా నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తెలుగు వారి భాగస్వామ్యం

## - ఏప్రిల్ 6...ఉప్పు చట్టాలను ఉల్లంఘించిన దినం



తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం. భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరేకించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యాగ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసుకున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆధునిక హైదరాబాద్ వాస్తు శిల్పి 7వ నిజాం

## - ఏప్రిల్ 6... చివరి నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ జయంతి


మీర్ ఉస్మాన్ అలీఖాన్...భాగ్యనగరంలో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఉన్న పాలకుడు. కొందరు ఆయనను ద్వేషించినా, మరి కొందరు ప్రేమించినా, ఆయన హైదరాబాద్ అభివృద్ధికి చేసిన కృషిని అందరూ అభినందించక తప్పదు. కొందరు ఆయన్ను సంకుచిత మనస్తత్వం గలిగిన, కొందరు మతతత్వం గలిగిన పాలకునిగా, మరికొందరు అతన్ని దుర్మార్గుడు అని భావించినా, ఆధునిక హైదరాబాద్ వాస్తుశిల్పిగా, నిర్మాతగా ఆయన జ్ఞాపకం ఉండక మానదు. ప్రణాళికా బద్ధమైన నగరాన్ని అభివృద్ధి చేయడంలో తన దృష్టిని అమోఘం. కృషి అనన్య సామాన్యం. హైదరాబాద్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కట్టెదుట కనిపించే ఆయన పోషించిన పాత్రను ఎవ్వరూ కాదన లేని వాస్తవం. ఉస్మాన్ ఆలీ ఖాన్ (ఏప్రిల్ 6, 1886 – ఫిబ్రవరి 24, 1967) మహబూబ్ ఆలీ ఖాన్ రెండవ కుమారుడు. క్రీ.శ. 1911లో నిజాం మరణించడంతో ఏడవ అసఫ్ జా బిరుదుతో నైజాం పదవిని అలంకరించాడు. ఈయనే అసఫ్ జాహీ పాలకులలో చివరివాడు. పూర్తి పేరు " ఫతే జంగ్ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసఫ్ ఝా. టైమ్ పత్రిక 1937 సంవత్సరం నిజాంను ప్రపంచంలోని అత్యంత ధనవంతునిగా ప్రచురించింది. 1947 ఆగస్టు 15న భారత దేశం స్వాతంత్ర్యం పొందిన అనంతరం హైదరాబాదును స్వతంత్ర రాజ్యం చేయడానికి నిజాం ప్రయత్నించగా, నిజాంతో అనేక సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం చివరకు సెప్టెంబరు 13, 1948న ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్య జరిపి హైదరాబాదు సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేసింది. 1956లో జరిగిన భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వలన నిజాం రాజ ప్రముఖ్ పదవి కోల్పోయాడు. ఆయన 1967 సంవత్సర ఫిబ్రవరి 24 తేదీన మరణించాడు. జమిందార్లు, చిన్న గడీదారులు, దొరలు, తాబేదారులు, నిజాం నవాబుకు కప్పం చెలించే వారు కప్పం ద్వారా వచ్చిన ఆదాయంతో ఎన్నో కట్టడాలు నిజాం నవాబులు నిర్మించారు. అలా నిర్మించిన వాటిల్లో పేర్కొన తగినవి... చిరాన్ ప్యాలెస్... హైదరాబాదు లోని కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ వనంలో 1940లో నిర్మించబడిన చిరాన్ ప్యాలెస్, 400 ఎకరాల్లో విస్తరించి ఉంది. తెలంగాణ హైకోర్టు...1920, ఏప్రిల్ 20న తెలంగాణ హైకోర్టు ప్రారంభించ బడింది. రాజ్‌భవన్... సోమాజీగూడ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భవనం ఈ రాజ్‌భవన్. ఇది రాష్ట్ర గవర్నరు అధికారిక నివాసంగా ఉపయోగ పడుతుంది. ఆజా ఖానా ఎ జెహ్రా... మూసీ నది తీరంలో ఆజా ఖానా ఎ జెహ్రా అనే ప్రార్ధన మందిరం ఉంది. నిజాం సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 1918 వ సంవత్సరంలో స్థాపించబడింది.



ఇది భారతదేశంలో అతిపెద్ద విశ్వవిద్యాలయాలలో ఒకటిగ్. ప్రాథమిక విద్య తప్పనిసరి చేసింది, పేదలకు ఉచితంగా విద్య అందించారు. సిర్పూరు పేపరు మిల్స్, బోధన్ చక్కెర ఫాక్టరీ, అజంజాహీ నూలు మిల్లులు, చార్మినార్ సిగరెట్ ఫాక్టరీ మొదలైన కర్మాగారాలు నెలకొల్ప బడినవి. నిజాం స్టేట్ రైల్వే నెలకొల్ప బడింది. 1965 లో, నిజాం భారత్ చైనా యుద్ధం 1962 సమయంలో 5000 కిలోల బంగారంన్ని యుద్ధ నిధికి అందించాడు. నిజాం హిందువులు, ముస్లింలను తన రెండు కళ్ళుగా భావించి, అనేక దేవాలయాల పురోగతి కోసం అనేక సార్లు బంగారు, డబ్బుని విరాళంగా ఇచ్చాడు. నిజాం రాష్ట్ర రికార్డును పరిశీలిస్తే, మీర్ ఉస్మాన్ అలీఖాన్ 82,825 లను యద్గిర్గుట్ట్ ఆలయానికి, 50,000 రూపాయల భద్రాచలం ఆలయం, 80 వేల రూపాయలకు తిరుపతి వెంకటేశ్వర ఆలయానికి దానం చేశాడని తెలుస్తున్నది. 1932 సంవత్సరంలో, భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (పూణే), హిందూ "మహాభారతం" సంకలనం మరియు ప్రచురణకు, అలాగే "నిజాం గెస్ట్ హౌస్" గా పిలువబడే అతిథికి 50,000 రూపాయలు అందించినట్లు పేర్కొన బడింది. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1967 ఫిబ్రవరి 24 న కింగ్ కోఠి ప్యాలెస్లో మరణించాడు. నిజాం అంత్యక్రియల ఘట్టం భారత చరిత్రలోనే అతి పెద్దదిగా, 10 మిలియన్ ప్రజలు నిజాం ఊరేగింపులో పాల్గొన్నట్లు భావించ బడుతున్నది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# డీఎన్ఏ నిర్మాణ ఆవిష్కర్త జేమ్స్ డేవీ వాట్సన్

## - జీవశాస్త్ర విప్లవానికి పునాది వేసిన జేమ్స్ వాట్సన్ - ఏప్రిల్ 6.. జేమ్స్ డేవీ వాట్సన్ జయంతి



జీవశాస్త్ర చరిత్రను శాశ్వతంగా మార్చిన శాస్త్రవేత్తల్లో ముందు వరుసలో నిలిచేవాడు జేమ్స్ డేవీ వాట్సన్. డీఎన్ఏ నిర్మాణాన్ని ఆవిష్కరించి, జన్యు శాస్త్రంలో నవ చైతన్యానికి బాట వేసిన ఆయన శాస్త్రీయ దృష్టి, అధ్యయన నిబద్ధత, పరిశోధనలలో చూపిన మేధా ప్రతిభ శాస్త్ర లోకాన్ని ఆశ్చర్య చకిత మయ్యేలా చేశాయి. జేమ్స్ డేవీ వాట్సన్ 1928 ఏప్రిల్ 6న అమెరికాలోని ఇల్లినాయ్ రాష్ట్రం, షికాగో నగరంలోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. చిన్ననాటి నుంచే అసాధారణ మేధస్సుతో మెరిసిన అతను రేడియో క్విజ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బాల మేధావిగా గుర్తింపు పొందాడు. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే షికాగో విశ్వ విద్యాలయంలో ప్రవేశించి జంతు శాస్త్రంలో పట్టభద్రుడు అయ్యాడు. అనంతరం శాస్త్రవేత్త ఎర్విన్ శ్రోడింజర్ రాసిన "%ఔష్ఫ్ అం ాఊటవ%?" అనే పుస్తకాన్ని చదివిన తరువాత అతనిలో జన్యుశాస్త్రంపై ఆకర్షణ పెరిగింది. ఫలితంగా ఇండియానా విశ్వ విద్యాలయంలో చేరి, కేవలం 22 ఏళ్లకే జీవశాస్త్రంలో డాక్టరేట్‌ను పొందాడు. 1951లో వాట్సన్ బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో ఉన్న కావెండిష్ లాబొరేటరీలో పరిశోధకుడిగా చేరాడు. అక్కడ బ్రిటిష్ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ క్రిక్‌ను కలుసుకుని, ఇద్దరూ కలసి జీవకణాల్లోని గూఢ రహస్యాన్ని వీడేందుకు కృషి ప్రారంభించారు %-% అదే డీఎన్ఏ నిర్మాణాన్ని గుర్తించడమే. 1953లో వీరిద్దరూ డీఎన్ఏ అణువు నిర్మాణాన్ని ం డబుల్ హెలిక్స్ నమూనాగా ప్రతిపాదించారు. ఇది ఒక మెలి తిరిగిన నిచ్చెనను పోలి ఉంటుంది. ఈ నమూనా ద్వారా జీవ పదార్థంలో జన్యు సమాచారం ఎలా నిల్వ ఉంటుందో, ఎలా ప్రతిరూపించ బడుతుందో స్పష్టత వచ్చింది. ఈ ఆవిష్కరణ జీవశాస్త్రంలో ఓ మైలురాయిగా నిలిచింది. ఈ అద్భుత ఆవిష్కరణకు గుర్తింపుగా జేమ్స్ వాట్సన్, ఫ్రాన్సిస్ క్రిక్, మారిస్ విల్కిన్స్ 1962లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందారు. రోసాలిండ్రాంక్లిన్ ఎక్స్–రే డేటా ఉపయోగించ బడినప్పటికీ, ఆమెను ఈ బహుమతికి అనర్హురాలిగా గుర్తించడం పెద్ద వివాదంగా మారింది. డీఎన్ఏ నిర్మాణం గుర్తించిన తర్వాత వాట్సన్ కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో పనిచేశాడు. 1968లో ఆయన రచించిన The Double Helix పుస్తకం శాస్త్రీయ రంగంలో సంచలనం రేపింది. డీ ఎన్ ఏ ఆవిష్కరణ వెనుక ఉన్న వ్యక్తిగత కథ, పోటీ, భావోద్వేగాలు ఈ పుస్తకంలో వ్యక్తమయ్యాయి. వాట్సన్ పరిశోధనలు ఆధునిక బయో టెక్నాలజీకి దారితీశాయి. జీన్ క్లోనింగ్, జీన్ బ్యాంకులు, జెనెటిక్ ఇంజినీరింగ్, నూతన ఔషధాల తయారీ, రోగ నిర్ధారణ పద్ధతులు వీటికి ఆయన కృషి పునాది వేసింది. ఆయన సారథ్యంలో క్యాన్సర్‌కు కారణమైన "ఆంకోజీన్" అనే జీన్‌ను గుర్తించడం అత్యంత కీలక ఘట్టం. 1968లో వాట్సన్ కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ ల్యాబొరేటరీ డైరెక్టర్‌గా నియమితు డయ్యాడు. ఇది జెనెటిక్ పరిశోధనకు ప్రధాన కేంద్రంగా మారింది. 1988లో ఆయన "హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్" కి మొదటి డైరెక్టర్‌గా నియమితు డయ్యాడు. ఈ ప్రాజెక్ట్‌కి లక్ష్యం ం మానవ జన్యు క్రమాన్ని పూర్తిగా మ్యాప్ చేయడం. వాట్సన్ శాస్త్ర విజ్ఞానానికి పెద్ద కృషి చేసినప్పటికీ, కొన్ని వివాదాస్పద వ్యాఖ్యల వల్ల ఆయన పరువు నశించింది. జాతి, మేధస్సు, లింగ పరమైన అభిప్రాయాలు శాస్త్ర సమాజం నుండి తీవ్రంగా విమర్శలు పొందాయి. కొన్ని పదవులనూ ఆయన కోల్పోయారు. ఇవి అతని ఘనమైన శాస్త్ర కీర్తిపై కొంతమేర మచ్చలు మిగిల్చాయి. జేమ్స్ డేవీ వాట్సన్ – ఒక శాస్త్రవేత్త, ఆవిష్కర్త, రచయిత. డీ ఎన్ ఏ నిర్మాణం ఆవిష్కరణ ద్వారా ప్రపంచం జీవ పదార్థం యొక్క మూల భూతమైన గమనాన్ని అర్థం చేసుకుంది. ఆయన కృషి వల్ల ఆధునిక జీవశాస్త్రానికి పునాది పడింది. అయితే వ్యక్తిగత అభిప్రాయాల వల్ల కొంతకాలంలో వివాదాలకు లోనైనా, శాస్త్రీయ ప్రపంచంలో ఆయన చేసిన రచనలు, పరిశోధనలు, ప్రేరణ యుగయుగాల వరకు నిలిచి పోతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




అంచనాలను మించి భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. న్యూదిల్లీ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. సుంకాల మోత మోగించారు. అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 26% సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోకి కొన్ని రంగాలపై కీలక ప్రభావం పడనుందని విశ్లేష కులు భావిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ, ఫార్మా ఉత్పత్తులపై ఎఫెక్ట్ ఉండనున్నట్లు పేర్కొంటున్నారు. మరి ఆ రంగాలు ఏంటంటే..?

**వ్యవసాయం, డెయిరీ, సీఫుడ్..** గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ విశ్లేషణ ప్రకారం.. ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమతులపై అత్యధిక ప్రభావం ఉండనున్నట్లు తెలుస్తోంది. భారత రొయ్యలు, ఇతర సీఫుడ్ ఉత్పత్తులకు యూఎస్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అగ్రరాజ్య మార్కెట్లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో గిరాకీ ఆశించిన మేర ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం. రంగాల వారీగా ఉత్పత్తులపై సుంకాలు భిన్నంగా ఉంటాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో మన డెయిరీ ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరనున్నాయి. దీంతో అగ్రరాజ్యంలో మన వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు కూడా పెరుగుతాయి. భారత్ నుంచి అమెరికాకు 181.49 మిలియన్ డాలర్ల డెయిరీ ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది. టెక్స్‌టైల్స్, బంగారం..భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. తాజా పెంపుతో వీటిపై సుంకం 13.32 శాతానికి చేరనుంది. దీంతో అమెరికాలో ఆభరణాల ధరలు పెరగనున్నాయి. ఇక, జౌళి పరిశ్రమ పైనా అధిక ప్రభావమే పడనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. మనం చేసే మొత్తం టెక్స్‌టైల్ ఎగుమతుల్లో 28 శాతం అమెరికాకే వెళ్తున్నాయి.

**చెప్పులపైనా..** పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం ఉండనుంది. మన దేశం నుంచి 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు యూఎస్‌కు ఎగమతి అవుతున్నాయి. వీటిపై అమెరికా–భారత్ మధ్య సుంకాల వ్యత్యాసం 15.56 శాతంగా ఉంది. దీంతో అగ్రరాజ్య మార్కెట్లో మన చెప్పుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దీంతో కస్టమర్లు ఇతర దేశాల ఉత్పత్తులను ప్రత్యామ్నాయంగా ఎంచుకునే అవకాశం ఉంది.

**ఎలక్ట్రానిక్స్...** ఎలక్ట్రానిక్స్, టెలికాం రంగాన్ని చూస్తే.. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

ఇప్పుడు సుంకాల పెంపుతో యూఎస్ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ఇక, బాయిలర్లు, టర్బైన్స్, కంప్యూటర్ల వంటి ధరలు కూడా ప్రియమవుతాయి.




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై సుంకాలతో విరుచుకు పడ్డారు. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టంచేశారు. ట్రంప్ ప్రకటన తో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా సహా అన్ని ప్రధాన మార్కెట్లు పతనమవుతున్నాయి.

**ఆసియా మార్కెట్లు షేక్..** ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఆసియా మార్కెట్లపై తీవ్రంగా పడింది. గురువారం ఉదయం జపాన్ నిక్కీ ఏకంగా 3.4 శాతానికి పైగా కుంగింది. ఈ దేశంపై అమెరికా అధ్యక్షుడు 24శాతం సుంకాలు విధించారు. ఇక, దక్షిణకొరియా కోస్పీ 1.9శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ సూచీ 1.8శాతం మేర నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. భారత మార్కెట్లు కూడా గురువారం నష్టాలతో ప్రారంభమయ్యే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

**అమెరికా మార్కెట్ల పరిస్థితి ఇలా..** ట్రంప్ ప్రకటనకు ముందు అమెరికా మార్కెట్లు స్వల్ప లాభాలు దక్కించుకున్నాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.7శాతం, డోజోన్స్ 0.6శాతం, నాస్‌డాక్ 0.9శాతం మేర లాభపడ్డాయి. అయితే, టారిఫ్‌లపై నిర్ణయం వెల్లడించగా.. అమెరికా ఫ్యూచర్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఎస్అండ్‌పీ 500 ఫ్యూచర్స్ సూచీ 3 శాతం మేర పడిపోయింది. ఫ్యూచర్స్‌లో డోజోన్స్ 2 శాతం, నాస్‌డాక్ 4శాతం మేర కుంగాయి. దీంతో గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) నాటి ట్రేడింగ్‌లో అక్కడి మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకుంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**కొత్త రికార్డుకు పసిడి..** టారిఫ్‌ల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా ప్రపంచ మార్కెట్లు తీవ్ర ఊగిసలాడుతున్నాయి. దీంతో బంగారం లో పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. దీంతో పసిడి ధర ఆకాశాన్నంటుతోంది. తాజాగా మరింత పెరిగి కొత్త రికార్డును తాకింది. అమెరికా మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 0.4 శాతం పెరిగి 3,145.93 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఒక దశలో 3,167.57 డాలర్ల వద్ద సరికొత్త గరిష్ఠాన్ని తాకింది. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్సు ధర 0.1శాతం పెరిగి 3,170.70 వద్ద కొనసాగుతోంది. మరోవైపు గురువారం చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. బ్రెండ్ ఫ్యూచర్స్ ధర 2.63 శాతం తగ్గి బ్యారెల్‌కు 72.98 డాలర్లుగా ఉంది. క్రూడ్ ఫ్యూచర్స్ కూడా 2.76శాతం తగ్గి 69.73 డాలర్లకు పడింది. ఇక, గురువారం నాటి మార్కెట్లో భారత రూపాయి విలువ 10–15 పైసలు క్షీణించే అవకాశాలు ఉన్నాయి.

చురకలు

## సంపాదకీయం

### 'మేక్ ఇన్ ఇండియా'కు బ్రేక్? ట్రంప్ టారిఫ్‌తో యాపిల్ ప్లాన్స్ తలకిందులు!

చివరకు అందరూ ఊహించిందే జరిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు రెసిప్రోకల్ టారిఫ్‌లను ప్రకటించారు. భారత్‌తో సహా పలు దేశాలపై ఆయన టారిఫ్‌లు విధించారు. భారత్‌పై ఏకంగా 26 శాతం టారిఫ్‌ను ట్రంప్ ప్రకటించారు. అయితే ఇది ప్రపంచవ్యాప్తంగా ట్రేడ్ వార్ మరింత ముదిరేలా చేసే ప్రమాదం ఉంది. ఈ నిర్ణయంతో అనేక కంపెనీలు షాక్‌కు గురయ్యాయి. వాటిలో యాపిల్ కూడా ఒకటి. ఐఫోన్ అమ్మకాలు ఎలా ప్రభావితం కానున్నాయి? యాపిల్ 'మేక్ ఇన్ ఇండియా' ప్లాన్ ఎలా ముందుకు సాగుతుంది? ఈ కథనంలో తెలుసుకుందాం. టారిఫ్‌ల భారాన్ని కంపెనీ నేరుగా వినియోగదారులకు బదిలీ చేస్తే, ఐఫోన్ ధరలు 30 నుండి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం కూడా చాలా వరకు ఐఫోన్‌లు చైనాలోనే తయారవుతున్నాయి. ఈ ఐఫోన్‌లపై గతంలో 54 శాతం టారిఫ్ ఉండేది. ఇప్పుడు దానిని పెంచితే, అవి చాలా ఖరీదైనవిగా మారతాయి. దీంతో వినియోగదారులు వాటిని కొనడానికి వెనుకడుగు వేసే అవకాశం ఉంది. ట్రంప్ ఈ నిర్ణయం తర్వాత యాపిల్ షేర్లు 9.3 శాతం వరకు పడిపోయాయి. మార్చి 2020 తర్వాత ఇది యాపిల్‌కు అత్యంత విషమ సమయం. ప్రపంచ ఐఫోన్ తయారీ కేంద్రంగా ఎదగాలనే భారతదేశ ఆశలకు ఇది పెద్ద అడ్డంకిగా మారవచ్చు. యాపిల్ ఇటీవల తన ఐఫోన్ ఉత్పత్తిలో 15 శాతాన్ని భారత్‌కు తరలించింది. అయితే అమెరికా 26% టారిఫ్ విధించింది. అయినప్పటికీ, ఈ రేటు చైనా షాకింగ్ 54%, వియత్నాం 46% కంటే తక్కువగా ఉంది. అమెరికా భారతదేశపు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి, మొత్తం ఉత్పత్తి ఎగుమతుల్లో 18% వాటా దానిదే. 26% టారిఫ్ ఎలక్ట్రానిక్స్ రవాణాను దెబ్బతీయవచ్చు. లాభాలను తగ్గించవచ్చు. భారత్ వేగంగా యాపిల్‌కు రెండవ అతిపెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోంది. ఇది ఐఫోన్ అసెంబ్లీలో 10-15% వాటాను కలిగి ఉంది. ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి తయారీదారుల ద్వారా, యాపిల్ భారతదేశం ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం నుండి గణనీయమైన ప్రయోజనం పొందింది. అయినప్పటికీ, ఇప్పుడు భారతదేశం నుండి ఎగుమతులపై 26% టారిఫ్ భారం పడనుంది. యాపిల్ భారతదేశంలో తన ఉనికిని క్రమంగా పెంచుకుంటోంది. 2025 నాటికి ఐఫోన్ ఉత్పత్తిలో 25% భారతదేశానికి తరలించాలని యాపిల్ ఇప్పటికే యోచిస్తోంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అమెరికాతో బైలటరల్ ట్రేడ్ అగ్రిమెంట్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా, భారతదేశ వాదనను బలోపేతం చేయడానికి యాపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి కంపెనీల మద్దతును కోరవచ్చు. పీఎల్ఐ పథకం కింద, ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ తయారీని ప్రోత్సహించడానికి దాదాపు రూ. 8,700 కోట్లు పంపిణీ చేసింది. అందులో 75% కంటే ఎక్కువ సబ్సిడీ యాపిల్ భాగస్వాములకు లభించింది.

కానీ భారతదేశం నుండి యాపిల్ ఉత్పత్తి మొత్తం పరిమాణంలో 10-15% మాత్రమే ఉంది. కంపెనీ 2025 నాటికి 25% లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇప్పుడు ఈ టారిఫ్ తర్వాత ఆ లక్ష్యం ప్రమాదంలో పడింది.

## చారిత్రక మహా పురుషుడు... శ్రీరామ చంద్రుడు



భారతావని ప్రసవించిన మహా పురుషులలో అవతార పురుషుడు శ్రీరామచంద్రుడు అత్యంత ప్రాచీన చారిత్రక పురుష నాయకుడు. శ్రీరామచంద్రుని చారిత్రక పురుషునిగా పాశ్చాత్య పరిశోధకులు కూడా నిర్ధారించారు. భారతీయ కాలమాన ప్రకారం రాముడు జన్మించినది వైవస్వత మన్వంతరమున పంచమ త్రేతాయుగ నాలుగవ భాగ మున ఎనభై వేల సంవత్సరానికి సరియగు విళంబి సంవత్సర చైత్ర శుద్ధ నవమి బుధవారం అని శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకట సుందరాచార్య స్వామి వచించారు. పురాణాల ఆధారంగా మహాభారత యుద్ధం నాటికి శ్రీరాముడు అతి ప్రాచీనుడు. మను చక్రవర్తి వంశావళిలో రాముడు 65వ పురుషుడని, ఆయన వంశస్తుడు శ్రీకృష్ణునికి సమకాలికుడైన బృహద్బలుడు మను వంశమున 94వ వాడని సుప్రసిద్ధ పాశ్చాత్య చారిత్రిక పరిశోధకుడు పరిటేరు నిర్ణయించాడు. వాల్మీకి రామాయణమును అనుసరించి రాముని జనన కాలం క్రీ.పూ.2055వ సంవత్సరంగా ఎల్.డి.స్వామికన్ను పిళ్ళై నిర్ధారించగా, ఎం.ఆర్. సంపత్కు మార సమర్ధించారు. పాశ్చాత్య చరిత్రకారులైన డబ్ల్యు.డబ్ల్యు.హంటర్, కానింగ్ ఆర్నాల్డ్ వంటి వారు, రామాయణ చరిత్ర క్రీ.పూ.1000 సంవత్సరాల ప్రాంత మని పేర్కొన్నారు. ప్రాచీన రుగ్వేద మంత్రమున (ం.93.14) శ్రీరామ పవిత్ర నామం స్మరించ బడింది. మహా విష్ణువు ఎత్తిన 10 అవతారాలలో ఏడవది రామావ తారం. శ్రీరాముడు కోసలాధీశుడైన దశరథునికి, కౌసల్య గర్భమున చైత్ర శుద్ధ నవమి పునర్వసు 4వ పాదమున కర్కాటక లగ్నంలో మద్యాహ్న సమయాన జన్మించాడు. అందుకే చైత్ర శుద్ధ నవమి శ్రీరామ జయంతి దినమైంది. ఇది వసంత నవరాత్రులకు చివరిదినం. రాముడు పుట్టి నది నవమికాగా, అంతకు ముందు అనగా రాముడు గర్భంలో ఉన్న చివరి తొమ్మిది దినాలు చేసే మత విధులు, పూజాదికాలు గర్భ నవరాత్రులుగా ఆరాధ నీయం, ఆచరణీయంగా ఉన్నాయి. ఆగస్త్య సంహితలో అష్టమి గురుపూజ, నవమి ప్రతిమా కల్పన, దశమి ప్రతిమా దానంగా మూడునాళ్ళ పండగగా చెప్పబడింది. నవమి ఉపవాసం, రాత్రి పురాణ శ్రవణం, జాగరణ, మరు నాడు సంతర్పణ చేయాలని ఉంది. పునర్వసు నక్షత్ర యుక్త నవమి పుణ్యకాలమని భావిస్తారు. అష్టమితో కూడిన నవమిని రామపూజ కూడదని విష్ణుభక్తులకు అగస్త్య సంహిత సూచిస్తున్నది. అందుకే మిగులు నవమి నాడు వైష్ణవులు రామ జయంతిని జరపడం పాటిస్తారు. శ్రీరామ నవమి నాటి కార్యకలాపాలు మద్యాహ్నం 12గంటలకు చేయాలని వ్రత గ్రంథాలు సూచిస్తున్నాయి. రామ జననం, కల్యాణం జరిపే రామ నవమి కాకుండా రామ సంబంధ పండగలలో ఒకటి రామలక్ష్మణ ద్వాదశిగా జరుపుకునే జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి, రెండవది జానకీ జయం తిగా జరుపుకునే ఫాల్గుణ శుద్ధ అష్టమి. జనకునికి యజ్ఞ శాలకై భూమిని దున్నుతుండగా నాగటి చాలుకు తగిలిన బంగారు పెట్టెలో భూజాత దొరికినది ఫాల్గుణ శుక్ల అష్ట మిగా భావిస్తారు. శ్రీకృష్ణునిలా కాక, రాముని జన్మదినో త్సవం కన్నా కళ్యాణోత్సవానికి విశిష్టత ఉంది. రామ జన్మకు కారణమైన రావణవధ ద్వారా లోకకళ్యాణం. సీతాదే వితో కూడిన రాముని వల్లే లోక కళ్యాణం సాధ్యమైంది. రాముని ఆంధ్రుల దౌహిత్రునిగా భావిస్తారు. కోసలాదేశ రాజు కూతురు కౌసల్య. దక్షిణ కోసల అంటే పూర్వాంధ్ర దేశ ఉత్తర భాగం. కౌసల్య ఆంధ్రుల ఆడపడచు అనీ, వన వాసాన్ని రాముడు తల్లి పుట్టింటి దేశపుటడవులలో గడిపా రని వాదం ఉంది. వనవాస రాఘవునికి ఆతిథ్యమిచ్చిన తెలుగు నేలపై ఆయన జన్మదినమైన శ్రీరామనవమి, కళ్యాణ దినంగా ఘనంగా జరుపుకోవడం సనాతన సాంప్రదాయంగా వస్తున్నది. శ్రీరాముని జన్మసమయం గురించి పరిశోధన చేసేందుకు పుష్కర్ భట్నాగర్, అమెరికా నుంచి 'ప్లానెటోరియం' అనే సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి, ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో ఏ రోజున గ్రహగతులు ఎలా ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేశారు. శ్రీరాముడు పుట్టిన సమయంలో గ్రహాల స్థితి వాల్మీకి బాలకాండలో వర్ణించారు. ఈ సమాచారాన్నంతా సాఫ్ట్‌వేర్ సాయంతో క్రోడీకరించిన పుష్కర్ భట్నాగర్‌కు సదరు జన్మ సంవత్సరం తేలింది. చాంద్రమానం ప్రకారం ఆ రోజు చైత్రశుద్ధ నవమి అని తేలడంతో, ఆయన వాదనకు బలం చేకూరి, రామాయణంలో ఉటంకించిన గ్రహస్థితులను బట్టి... రాములవారు అరణ్యావాసం చేసిన సమయం (5089 బి.సి), హనుమంతుడు సీతను లంకలో కలుసుకున్న సంవత్సరం (5076 బి.సి) తదితర కాలాలను కూడా నిర్ణయించామన్నారు భట్నాగర్. పురాణాలను, జ్యోతిష్యాన్ని, ఖగోళ శాస్త్రాలను అనుసంధాన పరుస్తూ, కొందరు పరిశోధన చేసి, శ్రీరాముడు పుట్టింది క్రీ.పూ 5114 సంవత్సరం, జనవరి 10 మధ్యాహ్నం 12:05 గంటలు అని తేల్చారు. ఏది ఏమైనా, వాస్తవాలు ఏవైనా, శ్రీరామ చంద్రుడు చారిత్రక పురుషునిగా భావించబడుతూ, పితృ వాక్య ఆచరణాసక్తునిగా, ఆదర్శ చక్రవర్తిగా, రామరాజ్య స్థాపకునిగా, ప్రజారంజక పాలకునిగా, ఈ నాటికీ పూజింప బడుతుండడం, ఆ మహా పురుషుని నవరాత్రులు, జన్మ, కళ్యాణోత్సవాలు, ఈ నాటికీ నిర్వహించ బడుతుండడం విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## లక్షలాది మందికి స్ఫూర్తి దాయకం... ఉప్పు సత్యాగ్రహం - ఏప్రిల్ 6...ఉప్పు చట్టాలను ఉల్లంఘించిన దినం

తొమ్మిది దశాబ్ధాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం. 1930 ఏప్రిల్ 6 న, ఉదయం 6:30 గంటలకు గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించినప్పుడు, ఇది కోట్లాది భారతీయులు బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనడానికి స్ఫూర్తి నిచ్చింది. ఉప్పు సత్యాగ్రహ ప్రచారం గాంధీ ప్రవచించిన సత్యాగ్రహ సూత్రాలపై ఆధార పడింది. 1930 ప్రారంభంలో, బ్రిటిషు పాలన నుండి భారత సార్వభౌమత్వాన్ని, స్వయం పాలననూ సాధించుకోవటానికి భారత జాతీయ కాంగ్రెస్, తన ప్రధాన వ్యూహంగా సత్యాగ్రహాన్ని ఎంచుకుంది. ప్రచారాన్ని నిర్వహించడానికి గాంధీని నియమించింది. 1882 బ్రిటిషు ఉప్పు చట్టాన్ని గాంధీ తమ సత్యాగ్రహ మొదటి లక్ష్యంగా ఎంచుకున్నారు. ఉప్పు చట్టాలను భారీగా ఉల్లంఘించడానికి గాంధీ ఏప్రిల్ 6 ను ఎంచుకోవడానికి ఒక ప్రధాన కారణముంది. 1919 లో రౌలాట్ చట్టానికి వ్యతిరేకంగా జాతీయ సమ్మె తలపెట్టిన "నేషనల్ వీక్"లో మొదటి రోజు. గాంధీ, తన ప్రార్థన సమావేశాలలోనూ పత్రికలతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ, ప్రకటనలు ఇస్తూ ప్రపంచ వ్యాప్తంగా మీడియాను ఈ మార్చ్ కోసం సిద్ధం చేశాడు. మార్చ్‌కు ముందు రోజు సాయంత్రపు ప్రార్థనలో గాంధీ చెప్పేది వినడానికి వేలాది మంది భారతీయులు సబర్మతికి చేరుకున్నారు. అమెరికన్ పత్రిక, ది నేషన్ ఇలా రాసింది: "గాంధీ ఇచ్చే పోరాట ప్రకటన వినడానికి 60,000 మంది ప్రజలు నది ఒడ్డున గుమిగూడారు. ఈ పోరాటపు పిలుపు బహుశా ఇప్పటివరకు ఇచ్చిన పిలుపులన్నిటి లోకీ విలక్షణమైనది". భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. దీన్ని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ కూడా పిలుస్తారు. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ తీరం లోని దండి వద్ద ఉప్పు తయారు చేసాడు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగపడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించాడు. దండి సత్యాగ్రహంలో మహాత్ముని తో కలిపి 80మంది పాల్గొన్నారు.

1. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ, గుజరాత్, 2. ప్యారేలాల్ నయ్యర్, పంజాబ్, 3. ఛగన్‌లాల్ నాథ్థుభాయ్ జోషి ,గుజరాత్, 4. పండిత నారాయణ్ మోరేశ్వర్ ఖరే మహారాష్ట్ర, 5. గంపత్‌రావ్ గోడ్సే మహారాష్ట్ర, 6.ప్రథ్వీరాజ్ లక్ష్మీదాస్ అషర్ గుజరాత్, 7.మహవీర్ గిరి 8. బాల్ దత్తాత్రేయ కాలేల్కర్ మహారాష్ట్ర, 9.జయంతి నాథూభాయ్ పరెఖ్ గుజరాత్,10.రసిక్ దేశాయ్ గుజరాత్, 11. విఠల్ లీలాధర్ థక్కర్ గుజరాత్, 12. హరఖ్జీ రాంజీభాయ్ గుజరాత్ 13 .తన్సుఖ్ ప్రన్షంకర్ భట్ట్ గుజరాత్, 14. కాంతీలాల్ హరిలాల్ గంధి గుజరాత్, 15. ఛోటూభాయ్ ఖుషల్భాయ్ పటేల్ గుజరాత్, 16. వాల్జీభాయ్ గోవింద్‌జీ దేశాయ్ గుజరాత్,17. వన్మాలాల్ బలభాయ్ ఝువేరి గుజరాత్, 18.అబ్బాస్ వర్తేజీ గుజరాత్, 19. పుంజాభాయ్ షా కూడా గుజరాత్, 20. మాధవ్‌జీ భాయ్ థక్కర్ గుజరాత్, 21. నరంజీభాయ్ గుజరాత్, 22 .మగన్‌భాయ్ వోర గుజరాత్, 23. దుంగార్సీభాయ్‌గుజరాత్, 24.సోమాలాల్ ప్రాగ్జీభాయ్ పటేల్‌గుజరాత్, 25.హస్ముఖ్‌రాం జకాబార్ గుజరాత్, 26. దౌడ్‌భాయ్ గుజరాత్, 27 .రాంజీభాయ్ వంకర్ గుజరాత్, 28. దినకర్‌రాయ్ పాండ్యగుజరాత్, 29.ద్వారకానాథ్ మహారాష్ట్ర, 30. గజానన్ ఖరే మహారాష్ట్ర, 31. జెథాలాల్ రూపారెల్ కచ్ గుజరాత్, 32. గోవింద్ హర్కరేమహారాష్ట్ర, 33. పాండురంగ్ మహారాష్ట్ర, 34 .వినాయక్ రావ్ ఆప్తే మహారాష్ట్ర, 35. రాంతీర్థ్ రాయ్ యునైటెడ్ ప్రావిన్సెస్, 36.భానుశంకర్ దవేగుజరాత్, 37. మున్షిలాల్, 38. రాఘవన్ కేరళ,39. రవ్జీభాయ్ నాథలాల్ పటేల్ గుజరాత్, 40 .షివభాయ్ గౌఖల్భాయ్ పటేల్ గుజరాత్, 41. శంకర్భాయ్ భీకాభాయ్ పటేల్ గుజరాత్, 42. జష్భాయ్ ఇష్వర్భాయ్ పటేల్ గుజరాత్, 43. సుమంగళ్ ప్రకాశ్ 44 .థేవర్ తుండియిల్ టైటస్ కేరళ, 45. కృష్ణ నాయర్ కేరళ, 46 .తపన్ నైర్ కేరళ, 47. హరిదాస్ వర్జీవందాస్ గాంధీ గుజరాత్, 48. చిమన్లాల్ నర్సిలాల్ షహ గుజరాత్, 49. షంకరన్ కేరళ, 50. సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రదేశ్,51. రామనిక్లాల్ మగన్లాల్ మొది గుజరాత్, 52. మదన్ మోహన్ చతుర్వేది రాజస్థాన్,53. హరిలాల్ మహింతుర మహారాష్ట్ర, 54. మోతీబస్ దాస్ ఒడిశా, 55. హరిదాస్ మజుందార్ గుజరాత్, 56.ఆనంద్ హింగోరిని సింధ్, 57. మహదేవ్ మార్తాండ్ కర్ణాటక, 58. జయంతిప్రసాద్ యునైటెడ్ ప్రావిన్సెస్, 59. హరిప్రసాద్ యునైటెడ్ ప్రావిన్సెస్,60. అనుగ్రహ నారాయణ్ సిన్హా బీహార్,61.కేశవ్ చిత్రే మహారాష్ట్ర, 62 .అంబలాల్ శంకర్భాయ్ పటేల్ గుజరాత్, 63. విష్ణు పంత్ మహారాష్ట్ర, 64. ప్రేంరాజ్ పంజాబ్, 65.దుర్గేష్ చంద్ర దాస్ బెంగాల్,66. మాధవ్‌లాల్ షా గుజరాత్, 67 .జ్యోతిరాం 68. సూరజ్‌భాన్ పంజాబ్, 69. భైరవ్ దత్త్, 70 .లాల్జీ పర్మర్ గుజరాత్,71. రత్నజీ బోరీ గుజరాత్,72 .విష్ణు శర్మ మహారాష్ట్ర,73. చింతామణి శాస్త్రి మహారాష్ట్ర, 74 .నారాయణ్ దత్త్, రాజస్థాన్,75 .మనిలాల్ మోహందాస్ గాంధీ గుజరాత్, 76 .సురెంద్ర, 77 .హరి కృష్ణ మొహొని మహారాష్ట్ర, 78 .పురతన్ బుచ్ గుజరాత్, 79 .ఖరగ్ బహదూర్ సింఘ్ గిరి నేపాల్ సంస్థానం, 80 .శ్రీ జగత్ నారాయణ్ ఉత్తర ప్రదేశ్. ప్రసిద్ధ దండి యాత్రలో పాల్గొన్న ఈ సత్యాగ్రహులను గౌరవిస్తూ ఐఐటి బొంబాయి ఆవరణలో ఒక స్మారక చిహ్నాన్ని రూపొందించారు. ఏప్రిల్ 6 ఉదయం, ప్రార్థన తరువాత, గాంధీ ఉప్పు బురదను పైకి లేపి, "దీనితో, నేను బ్రిటిషు సామ్రాజ్యపు పునాదులను కదిలిస్తున్నాను" అని ప్రకటించాడు. తరువాత ఆయన దానిని సముద్రపు నీటిలో ఉడకబెట్టి, బ్రిటిషు చట్టాన్ని ధిక్కరిస్తూ ఉప్పును తయారు చేశాడు. తన వేలాది మంది అనుచరులను కూడా అదేవిధంగా సముద్ర తీరం వెంబడి "ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ" ఉప్పును తయారు చేయమని చెప్పాడు. గ్రామస్థులను కూడా ఉప్పును తయారు చేయమని చెప్పమని కూడా వారిని కోరాడు. ఇలా 79మందితో మహాత్ముడు ఈ కార్యక్రమం ప్రాంభించగా, సాధారణంగా గాంధీ కార్యక్రమాలలో జనసమూహాన్ని తగ్గించి రాసే అధికారిక ప్రభుత్వ వార్తాపత్రిక ది స్టేట్స్‌మన్, సబర్మతి - అహ్మదాబాద్ రహదారిపై 1,00,000 మంది ప్రజలు ఉన్నారని పేర్కొనడం గమనార్హం.



**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## ఏప్రిల్ 6...భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినం

నాలుగున్నర దశాబ్దాల క్రితం ఇదే రోజున అంటే ... 1980 లోక్‌సభ ఎన్నికల ముందు భారతీయ జనతా పార్టీ పేరుతో ఎప్రిల్ 6న కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యాన్ని పరిశీలిస్తే... 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేశాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఏర్పాటు చేసిన ఈ పార్టీకి ఎన్నికల చిహ్నంగా దీపం గుర్తు లభించింది. 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఈ పార్టీకి 3 లోక్‌సభ స్థానాలు లభించాయి. అందులో ఒక స్థానం పార్టీ స్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ విజయం సాధించింది. 1967 తరువాత ఈ పార్టీ బలపడింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఆధారపడిన పార్టీ కావడంతో ఈ పార్టీ హిందూ జాతీయవాద లక్షణాలను కలిగిఉంది. ఈ పార్టీలో ప్రముఖ స్థానాలను కలిగిన నాయకులు కూడా ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలే. 1964లో ఏర్పడిన విశ్వ హిందూ పరిషత్తు ఈ పార్టీకి సన్నిహితంగా ఉంది. జవహర్ లాల్ నెహ్రూ కాలంలో ఆయన సోషలిస్టు భావనలకు విసుగు చెందిన పలు భారతీయ జాతీయ కాంగ్రెస్ నేతలు ఈ పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పార్టీ ఉనికి నిలుపుకుంది. 1975లో దేశంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించడంతో విపక్షాలకు చెందిన పలు నేతలను ఎలాంటి కారణం లేకుండానే జైళ్ళకు తరలించారు. అదే కాలంలో భారతీయ జనసంఘ్ ప్రముఖ నేతలు కూడా జైలుజీవితం గడిపారు. 1977లో అత్యవసర పరిస్థితిని తొలిగించి ఎన్నికలు జరుపడంతో దేశంలో మారిన రాజకీయ సమీకరణాల వలన భారతీయ జనసంఘ్‌తో పాటు భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్ (ఓ), సోషలిస్ట్ పార్టీలు కలిసి ఉమ్మడిగా జనతా పార్టీని ఏర్పాటు చేసు కున్నాయి. 1951లో శ్యాంప్రసాద్ ముఖర్జీ చే స్థాపించబడిన జనసంఘ్ 1977లో జనతా పార్టీలో విలీనం చేయబడింది. ఎన్నికలలో ఈ పార్టీ విజయం సాధించడంతో భారతదేశంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా జనతా ప్రభుత్వం పేరు సంపాదించింది. మురార్జీ దేశాయ్ నేతృత్వం వహించిన జనతా ప్రభుత్వంలో పూర్వపు జనసంఘ్ నేతలైన అటల్ బిహారీ వాజపేయికి విదేశాంగ మంత్రిత్వ శాఖ లభించగా, లాల్ కృష్ణ అద్వానీకి సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ లభించింది. జనతా ప్రభుత్వం విచ్ఛిన్నం కావడంతో 1980 లోక్‌సభ ఎన్నికల ముందు జనసంఘ నేతలు జనతా పార్టీ నుండి బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీ పేరుతో ఎప్రిల్ 6న కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ భారత దేశంలో ప్రముఖ జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటి. రాజకీయ కురు పితామహుడు అటల్ బిహారీ వాజపేయి భారతీయ జనతా పార్టీకి తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో ప్రారంభించిన ఈ పార్టీ దేశములోని హిందూ అధిక సంఖ్యాక వర్గం యొక్క మత సాంఘిక, సాంస్కృతిక విలువల పరిరక్షణను ధ్యేయంగా చెప్పుకుంటుంది. సాంప్రదాయ సాంఘిక నియమాలు, దృఢమైన జాతీయ రక్షణ దీని భావ జాలాలు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధానపాత్ర పోషిస్తున్న సంఘ్ పరివార్ కుటుంబానికి చెందిన వివిధ రకాల హిందూ జాతీయవాద సంస్థలు భారతీయ జనతా పార్టీకి కార్యకర్తల స్థాయిలో గట్టి మద్దతు ఇస్తున్నాయి. 1989 తరువాత ఈ పార్టీ బలపడింది. అటల్ బిహారీ వాజపేయి 3 సార్లు ప్రధానమంత్రి పదవిని కూడా చేపట్టినారు. భాజపా, అనేక ఇతర పార్టీల మద్దతుతో 1999 నుండి 2004 వరకు భారతదేశ ప్రభుత్వము భారత కేంద్ర ప్రభుత్వాన్ని పాలించింది. దాని సీనియర్ నాయకులైన అటల్ బిహారీ వాజపేయి ప్రధాని గాను, లాల్ కృష్ణ అద్వానీ ఉప ప్రధాన మంత్రి గానూ పనిచేశారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో ప్రధాన పార్టీ అయిన భాజపా, భారత పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షముగా 2014 మే వరకు కొనసాగింది. సార్వత్రిక ఎన్నికలలో లోక్ సభ లోని 543 స్థానాలకు మునుపెన్నడూ లేనన్ని 281 స్థానాలు గెలుచుకున్న భాజపా (మిత్ర పక్షాలతో కలిసి జాతీయ ప్రజాస్వామ్య కూటమికి 337 స్థానాలు) నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారం చేబట్టింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లోక్ సభ ఎన్నికల్లో 303 స్థానాల్లో విజయం సాధించింది. నరేంద్ర మోడీ నాయకత్వంలో మళ్లీ అధికారం చేపట్టింది. 2024 జూన్ 4, 5 తేదీలలో ప్రకటించ బడిన ఎన్నికల ఫలితాలలో 543 స్థానాలలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ కూటమి 293 స్థానాలతో మెజారిటీ సాధించగా, ఇందులో బీజేపీ పార్టీ స్వంతంగా గెలుచుకున్న 240 సీట్లు ఉన్నాయి. అలా ప్రస్తుతం మూడవసారి నరేంద్ర మోడీ ప్రధానిగా కేంద్ర ప్రభుత్వంగా కొనసాగుతున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# చికెన్ వ్యర్థాలతో కాసుల వేట



సిరిసిల్ల: జిల్లాలోని చికెన్ సెంటర్ల నుంచి వెలువడుతున్న వ్యర్థాల సేకరణ పక్కదారి పడుతోంది. అక్రమార్జనకు అలవాటుపడిన గుత్తేదారులు చేపల చెరువులకు తరలిస్తున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇలాంటి వ్యర్థాలు తిని పెరిగే చేపలను తింటే ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. పర్యావరణ కలుషితం.. ప్రాణాలకు హాని కలిగించే చికెన్ వ్యర్థాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం 2019 నుంచి పురపాలికల్లో టెండర్ల విధానం తీసుకొచ్చింది. సేకరించిన వ్యర్థాలను శుద్ధిచేసి పిల్లెట్స్ తయారీ పరిశ్రమలకు విక్రయించేలా ప్రణాళికలు చేశారు. హక్కులు పొందిన గుత్తేదారులు వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

**రూ.కోట్లలో ఆదాయం**

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో ఏటా టెండర్ల ద్వారా గుత్తేదారులు వ్యర్థాల సేకరణకు ముందుకొస్తారు. రెండు పురపాలికల్లో కలిపి సుమారు 320 కోడిమాంస విక్రయ దుకాణాలు ఉన్నాయి. రెండు పట్టణాల్లో నిత్యం రెండు టన్నుల మేరకు వ్యర్థాలు వెలువడతాయి. ఆదివారం, కొన్ని ప్రత్యేక రోజుల్లో భారీ విక్రయాలతో ఇంకా ఎక్కువే ఉంటుంది. గత నెలలో జరిగిన టెండర్లలో సిరిసిల్లలో రూ.21 లక్షలు, వేములవాడలో రూ.1.10 లక్షలకు ఒకే సంస్థ సేకరణ హక్కులు దక్కించుకుంది. చికెన్ దుకాణ దారులు ప్రతినెలా రూ.300 పురపాలికకు చెల్లిస్తున్నారు. పురపాలికలకు ఆదాయం సమకూరుతున్నది రూ.లక్షల్లోనే.. కానీ చేపల చెరువులకు విక్రయించడం ద్వారా గుత్తేదారులకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది.

**జీపీఎస్ ట్రాకర్ లేక**

జిల్లాలో నిత్యం టన్నుకుపైగా చికెన్ వ్యర్థాలు పోగవుతాయి. సేకరణ హక్కులు పొందిన గుత్తేదారు సంస్థ వీటిని పిల్లెట్స తయారీ పరిశ్రమకు తరలిస్తున్నట్లు అంగీకార పత్రాలు సమర్పించారు. వాస్తవానికి జరిగేది హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతాల్లోని క్యాట్ ఫిష్‌లు పెంచే చెరువులకు చికెన్ వ్యర్థాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యర్థాలను తొలుత డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ పూర్తి వివరాలు నమోదు చేయాలి. వ్యర్థాలు తరలించే వాహనాలకు జీపీఎస్ అమర్చాలి. దీంతో పాటు పిల్లెట్స తయారీ పరిశ్రమలో దింపే సమయంలో ఫొటోలు తీసి పురపాలకశాఖ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు పూర్తి వివరాలు పంపాలి. ఇవేవీ అమలు కావడంలేదు. జిల్లా సరిహద్దులు దాటాక ఒక నిర్మానుష్య ప్రాంతంలో నిలిపి వ్యర్థాలను వేరు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమార్జనకు అలవాటు పడిన పలువురు గుత్తేదార్లు వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు.

**అధికారులేమంటున్నారంటే**జిల్లాలో చికెన్ వ్యర్థాల సేకరణ, చెరువులకు విక్రయించడంపై సిరిసిల్ల, వేములవాడ పురపాలికల పర్యావరణ ఇంజినీర్ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌ల దృష్టికి తీసుకువెళ్లగా.. జిల్లాలో సేకరించిన కోళ్ల వ్యర్థాలను శుద్ధి చేసి పిల్లెట్స తయారు చేసే పరిశ్రమకు తరలిస్తామని సేకరణ హక్కులు పొందిన గుత్తేదారు సంస్థలు సూచించినట్లు తెలిపా రు. వ్యర్థాలను బయటకు తరలించినట్లు తెలిసినా.. ఫిర్యాదులొచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని... విచారణ నిర్వహించి టెండరు రద్దు చేస్తామని తెలిపారు.

# పడకేసిన పల్లె పాలన

జగిత్యాల : పల్లెలపై అధికారుల పట్టింపు లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పారిశుద్ధ్యం గాడితప్పుతోంది. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో జాప్యంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా జీవిస్తున్నారు. పల్లెల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాక పంచాయతీలలో నిధులు లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. పంచాయతీ కార్యదర్శులు ఉన్న నిధులతో చిన్న చిన్న పనులు చేస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు ఏడాదికిపైగా ప్రభుత్వం నుంచి నిధులు రాక జిల్లాలోని పల్లెల్లో అభివృద్ధి కానరావటంలేదు. పెద్ద గ్రామ పంచాయతీలకు నిధులు మెండుగా ఉండగా చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పల్లెలకు ప్రత్యేకాధికారులు వెళ్లకపోవటంతో పారిశుద్ధ్యం లోపించింది. పారిశుద్ధ్య కార్మికులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి



వేతనాలు కూడా రావటంలేదు. వేతనాలు రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏప్రిల్ నెలలోనైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచులైనా తమ సమస్యలు పట్టించుకుంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

**విధుల్లో చేరని జిల్లా పంచాయతీ అధికారి**

పల్లె పాలనను పట్టించుకోవటంలేదనటానికి మరో నిదర్శనం జిల్లా పంచాయతీ అధికారి లేకపోవటం. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ బదిలీ అయిన తర్వాత డీఆర్‌డీవో ఏపీడీ మదన్‌మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రెండు విధులు నిర్వహించటం ఇబ్బందిగా మారింది. నిజామాబాద్ డీఎల్‌పీవోగా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు. రెండోసారి సైతం విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చేరకపోవటంతో పూర్తి బాధ్యతలు లేక పాలన పూర్తిగా కుంటుపడింది.

# చిల్లర సమస్యలు ఉండవిక..!

వలిగొండ : ఆర్టీసీ ప్రయాణికులకు బస్సులో చిల్లర సమస్య అధికంగా ఉంది. టికెట్‌కు సరిపడ డబ్బులు ఇవ్వాలని కండక్టర్లు అడుగుతున్నా చిల్లర లేక నోట్లు ఇస్తుంటారు. దీంతో అటు ప్రయాణికులు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారి మధ్య వాగ్వాదాలకు దారి తీస్తోంది. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ డిజిటల్ చెల్లింపులను అమల్లోకి తీసుకురానుంది. బస్సులో ఎలక్ట్రానిక్ టికెట్ ఇష్యూ (ఈ–టిమ్)ను ప్రవేశపెడుతోంది. ఫోన్–పే, గూగుల్ పే, స్వైపింగ్ ద్వారా టికెట్ తీసుకునే సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో డిజిటల్ చెల్లింపులు నిత్యకృత్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కూడా ఈ విధానంపై కొన్ని నెలలుగా కసరత్తులు మొదలు పెట్టింది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ చెల్లింపులు అమల్లోకి తీసుకురాగా ఇది విజయవంతమైంది. అన్నీ చోట్ల ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బస్సులతో పాటు టికెట్ రిజర్వేషన్ కేంద్రాలు, టికెట్ బుకింగ్ ఏజెన్సీల వద్ద ప్రవేశపెట్టనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరిగుట్ట డిపోకు 70 ఈ–టీమ్ మిషన్లు రావడంతో కండక్టర్లకు త్వరలో శిక్షణ తీసుకోనున్నారు.

త్వరలో అందుబాటులోకి సేవలు:మురళీకృష్ణ, డిపో మేనేజర్, యాదగిరిగుట్టయాదగిరిగుట్ట డిపోకు ఈ–టిమ్స్ మిషన్లు 70 వచ్చాయి, మరికొన్ని రావాల్సి ఉంది. యంత్రాల పని తీరు పరిశీలించి కండక్టర్లకు శిక్షణ ఇవ్వనున్నాం. త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

# చెరువుల వద్ద.. చేపల కొలనులు

చేగుంట : ప్రతి గ్రామంలో కొలనులు ఏర్పాటు చేసి చేపల పెంపకానికి చేయూత నివ్వాలని కేంద్రం ప్రభుత్వం సంకల్పించింది. ఉపాధి పథకంలో ప్రతి గ్రామంలో చెరువు శిఖంలో వీటి నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించగా, కొన్ని చోట్ల పనులు మొదలయ్యాయి. దీనివల్ల కూలీలకు పనులు, శిఖం భూముల పరిరక్షణ, మత్స్యకారులకు మరింత ఆదాయం సమకూరాలన్నదే లక్ష్యం. జిల్లాకు ప్రస్తుతం 85 చేపల కొలనులు మంజూరుకాగా, 59 చోట్ల పనులు ప్రారంభమయ్యాయి, చేగుంట, నార్సింగి, హవేలీఘనపూర్, కొల్చారం, పాపన్నపేట, చిన్నశంకరంపేట, శివ్వంపేట, టేక్మాల్, మెదక్, నర్సాపూర్ మండలాల్లో కొనసాగుతున్నాయి. నార్సింగి మండలంలో నార్సింగి, సంకాపూర్, భీంరావుపల్లి, నర్సంపల్లిలో నిర్మాణాలను ముమ్మరం చేశారు. ఒక్కో కొలనుకు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.

అత్యధిక పనిదినాలు కల్పించేలా..: ఆర్థిక సంవత్సరం 2025–26లో ఉపాధి పథకంలో కొత్తగా మరిన్ని పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ పనులను పరిశీలించి చేపల కొలనులు ఏర్పాటు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో గ్రామంలో 3,300 పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో కొలను 14 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో నిర్మిస్తున్నారు. ఎంపిక చేసిన చెరువు శిఖంలో నాలుగు కొలనులు నిర్మిస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాటిలో నీరు నిల్వ ఉండటంవల్ల చేపలు పెంచుకునేందుకు దోహదపడుతుంది. శిఖం భూముల పరిరక్షణకు: ప్రస్తుతం మత్స్యశాఖ రాయితీతో చేప పిల్లలను నీటి వనరుల్లో పెంచుతున్నారు. వీటికి వంద నుంచి మూడు వందల మీటర్ల దూరంలో కొలనులు నిర్మిస్తున్నారు. కూలీలకు ఉపాధి, చెరువుల శిఖం భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా పనుల రూపకల్పన చేశారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక, రాయితీ చేపపిల్లలను కూడా వీటిలో వదిలేలా ఏర్పాటు చేస్తున్నారు. **ఎన్ని ప్రతిపాదనలు వచ్చినా అనుమతి : శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో** గ్రామాల నుంచి చేపల కొలనుల నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లా వ్యాప్తంగా మొదటగా కొన్నింటికి ప్రతిపాదనలు రావడంతో పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం వరకు పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపట్టి మత్స్యసంపదను పెంపొందించాలన్నది లక్ష్యం. శిఖం భూములను రక్షించేందుకు కూడా ఇది దోహదపడుతుంది. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రతిపాదనలు పంపించాలి.

# అక్రమాలు వెల్లడయ్యేనా!



పెద్దపల్లి: భారత పత్తి సంస్థ(సీసీఐ) పత్తి కొనుగోళ్లలో టీఆర్‌ల(తాత్కాలిక రిజిస్ట్రేషన్ల) జారీ వ్యవహారంలో వ్యవసాయ శాఖ ప్రమేయంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అనర్హులకు ధ్రువీకరణలు ఇచ్చారనే అభియోగంపై మార్కెటింగ్ శాఖ చర్యలు తీసుకున్న ఒకటిన్నర నెలల తర్వాత వ్యవసాయ శాఖ స్పందించడం గమనార్హం. స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు అధికారులు విజిలెన్స్ విచారణకు ఉపక్రమించారు. ఇతర జిల్లాలకు చెందిన రైతులకు టీఆర్‌లు జారీ చేశారనే అభియోగంపై పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పృథ్వీరాజ్ సస్పెన్షన్‌కు గురైన విషయం విదితమే. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ కూడా అంతర్గత విచారణకు ఆదేశించడంతో సిబ్బంది అప్రమత్తమవుతున్నారు.

**మిగిలిన పత్తి ఎటు పోయిందో?**

పట్టాదారు పాసుపుస్తకం లేని రైతులు, కౌలు రైతులు పండించిన పత్తిని సీసీఐకి విక్రయించేందుకు వ్యవసాయ విస్తరణాధికారి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసేందుకు మార్కెట్ కార్యదర్శికి ప్రత్యేక లాగిన్ ఉంటుంది.

ఇలా జిల్లాలో 840 తాత్కాలిక రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్కో అక్రమ టీఆర్ ద్వారా 100 క్వింటాళ్ల వరకు సీసీఐకి విక్రయించినట్లు ఆరోపణలున్నాయి.

వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం టీఆర్‌ల ద్వారా 54,960 క్వింటాళ్ల పత్తిని విక్రయించేందుకు అవకాశముంది.

జిల్లాలో 52,578 ఎకరాల పట్టా భూములు, 4 వేల ఎకరాల ఎన్‌డీఎస్(వివిధ ప్రభుత్వ అవసరాలకు సేకరించిన భూముల్లోని ఖాళీ స్థలాల్లో) భూముల్లో పత్తి సాగు చేశారు.

అధికారుల అంచనా ప్రకారం మొత్తం 6.72 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాలి. కాగా 3.21 లక్షల క్వింటాళ్లు మాత్రమే విక్రయించారు. ఇందులో టీఆర్ రైతుల పత్తి కూడా కలిసి ఉంది.

మరో 3 లక్షల క్వింటాళ్ల పత్తి ఎక్కడ ఉంది? రైతులు ఇతర జిల్లాల్లో విక్రయించారా? దళారులే రైతుల పేరిట మళ్లించారా? రైతులు మద్దతు ధరకు ఎందుకు విక్రయించలేదు? గ్రామాల్లో అధిక ధరలు చెల్లించినట్లు తప్పుడు తూకాలతో రైతులను మోసగించారా? వంటి అంశాలు విచారణలో వెల్లడవుతాయి.

**ధరలు తగ్గిన ప్రతిసారీ వివాదాస్పదమే!**

వచ్చే సీజన్ నుంచి పత్తికి మద్దతు ధరకు బదులు మార్కెట్ సరళిని బట్టి ధర లోటు చెల్లింపు విధానం అమలుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి పెద్దపల్లి మార్కెట్‌లో ఈ విధానంలో ప్రయోగాత్మకంగా సీసీఐ కొనుగోళ్లు చేయాలని భావించిన అధికారులు చివరి నిమిషంలో వాయిదా వేశారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గిన ప్రతిసారీ సీసీఐ కొనుగోళ్లు వివాదాస్పదమవుతున్నాయి. తాజాగా మార్కెటింగ్ శాఖ పరిధిలోని టీఆర్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై వ్యవసాయ శాఖ జోక్యం చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితులను సవరించే బాధ్యత పాలకులపైనే ఉంది.

# చేపల కొలను.. 'ఉపాధి'కి అదను



ఖమ్మం :అన్యాక్రాంతమవుతున్న చెరువుల శిఖం భూములను రక్షించటంతో పాటు మత్స్యకారులకు ఆదాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపల కొలను(ఫిష్‌పాండ్)లు నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కో కొలను కింద 3,300 పనిదినాలు కల్పించి, ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.333 చొప్పున మొత్తం రూ.10లక్షలను కూలీలకు వేతనంగా ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించింది. నీటిపారుదల, రెవెన్యూ, మత్స్యశాఖల సమన్వయంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు వీటిని నిర్మించనున్నాయి. ఒక్కో కొలనును 14 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో నిర్మిస్తారు.

**అక్రమాలకు అడ్డుకట్ట** ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 1,646 చెరువులకు ఏటా సుమారు 5.50కోట్ల చేపపిల్లలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఈప్రక్రియలో గతంలో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. టెండర్లు దక్కించుకున్న సరఫరాదారులు బరువు, సైజు తక్కువగా కలిగిన పిల్లలను అందించటంతో ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేక నష్టాలు ఎదుర్కొంటున్నట్లు మత్స్యకార సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. టెండర్ దక్కించుకున్న గుత్తేదారులూ చేపపిల్లల పంపిణీలో జాప్యం ప్రదర్శించటంతో చెరువుల్లోకి చేపపిల్లలు సకాలంలో చేరక మత్స్యకారులకు తీరని నష్టాలు వస్తున్నాయి. చెరువు శిఖాల్లో చేపల కొలనులు నిర్మించటం వల్ల విత్తన చేపపిల్లలను అక్కడే పెంచి సకాలంలో చెరువుల్లోకి చేర్చటానికి అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

**చేకూరే ప్రయోజనాలు**

చేపల చెరువుల తవ్వకంతో గ్రామీణులకు ఉపాధి లభిస్తుంది. స్థానికంగా చేపల ఉత్పత్తిని పెంచి, ఆహారభద్రతను మెరుగుపరుస్తుంది. మత్స్యకారులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుంది.

వర్షం నీటిని నిల్వ చేయటానికి సహాయపడతాయి. భూగర్భజలాల స్థాయిని పెంచటం, వ్యవసాయానికి నీటి లభ్యతను మెరుగుపరచటానికి ఉపయోగపడతాయి.

చేపల విక్రయం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మార్కెట్‌లో చేపల సరాఫరా పెరిగి, చిన్న వ్యాపారులకు మేలు కలుగుతుంది.చేపల కొలనుల నుంచి తీసిన మట్టిని వ్యవసాయ భూముల్లో వాడవచ్చు. తద్వారా భూసారం పెరుగుతుంది.చేపల కొలనులు పర్యావరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. పక్షులు, కీటకాలు, ఇతర జీవులకు ఆవాసాలుగా మారుతాయి.ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువు శిఖం భూముల్లో చేపల కొలనులు ఏర్పాటు చేసుకోవచ్చు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఒక చెరువులో చేపల కొలను తవ్వటానికి అనుమతులిచ్చాం. శిఖం భూములను సమర్థంగా ఉపయోగించుకో వటంతో పాటు స్థిరమైన అభివృద్ధికి ఇవి దోహదపడతాయి.రవి, డీఆర్‌డీఏ, అదనపు పీడీ, భద్రాద్రి కొత్తగూడెం

# అప్పులు కుప్పలుగా..!

సూర్యాపేట చివ్వెంల మండల పరిధిలోని ఓ గ్రామ పంచాయతీలో నెల వారీగా చేపట్టే అత్యవసర పనులకు సంబంధించి నిధులు మంజూరు కాక అప్పులు తెచ్చి మరీ ఖర్చు చేయాల్సిన దుస్థితి. అధిక వడ్డీలకు అప్పు తెచ్చి పాలన సాగించాల్సి వస్తోందని ఆ గ్రామ కార్యదర్శి వాపోతున్నారు. సర్పంచుల పాలన పూర్తై సంవత్సరం ముగిసింది. దీంతో అప్పటి నుంచి ప్రత్యేక అధికారులకు పాలన బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే వారికి వారి బాధ్యతలతో పాటు కొత్తగా పంచాయతీల పాలన అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు కొరవడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల మంజూరు చేయాల్సిన నిధుల విడుదల కావడం లేదు. పది నెలల నుంచి జిల్లాకు సుమారు రూ.23 కోట్ల నిధులు రావాల్సి ఉంది. దీంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు



అప్పులు తెచ్చి పాలన కొనసాగిస్తున్నారు.

వేసవి కాలంలో తీవ్ర నీటి సమస్య నెలకొనే పరిస్థితులు ఉండటంతో కార్యదర్శుల పరిస్థితి దయనీయంగా మారింది. రోజురోజుకు తాగునీటి సమస్య తీవ్రం అవుతోంది. దీన్ని పరిష్కరించేందుకు పంచాయతీల్లో డబ్బుల్లేక.. అప్పులు చేయలేక తాగునీరు సరఫరా చేసే పైపులైను మరమ్మతులు సైతం చేయకలేకపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వీటికి ఖర్చు

ట్రాక్టర్ కిస్తీలు, డీజిల్, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు

బ్లీచింగ్ పౌడర్‌పైపులైను, చేతిపంపుల మరమ్మతులు, ఇతర సామగ్రి

వీధి దీపాల ఏర్పాటు

నర్సరీల్లో షేడ్ నెట్, అందులో మొక్కలకు కలుపు నివారణ మందులకు.

ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి:

– యాదగిరి, డీపీవో, సూర్యాపేట

వేసవికాలం దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. బకాయి నిధుల విషయమై ప్రభుత్వానికి నివేదించాం. పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందొద్దు.

# లక్ష్యం.. టన్నుల్లో..!

ఆలేరు: యాదాద్రి భువనగిరి జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలో 2,75,315 ఎకరాల్లో వరి సాగు చేయగా.. 6.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వస్తుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రైతుల నుంచి నుంచి 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సేకరించనున్న ధాన్యంలో 3.5 లక్షల మెట్రిక్ టన్నులను సీఎంఆర్ నిమిత్తం 37 మిల్లులకు కేటాయించనున్నారు. మరో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. ఈ నెల మొదటి వారంలో కొన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**372 కొనుగోలు కేంద్రాలు...**

ధాన్యం సేకరణకు 372 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఐకేపీ 122 కేంద్రాలు, పీఏసీఎస్ 234, రైతు సహకార సంఘాల ఆధ్వర్యంలో 16 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ధాన్యం సేకరణకు 1.12 కోట్ల గన్నీ సంచులు అవసరమని గుర్తించారు. ఇందులో పాతవి 51.75 లక్షలు అందుబాటులో ఉండగా కొత్తగా 60.75 లక్షల బ్యాగులు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ నిర్ధారణ పరికరాలు, తూకం యంత్రాలు సమకూర్చుకుంటున్నారు. ఇటీవల కొత్తగా అయిదు ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను కొనుగోలు చేశారు. ఈ కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ వసతులు కల్పించనున్నారు.

**భూగర్భ జలం తగ్గడంతో..**ఈ సారి ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భ జలమట్టం పడిపోయింది. దీంతో చాలా ప్రాంతాలలో వరిచేలు ఎండు వారాయి. మార్చి నెలలో ఎండల తీవ్రత మరింత అధికం కావడంతో ఆలేరు, గుండాల, రాజపేట, తుర్కపల్లి, మోటకొండూరు మండలాల్లో వందలు, వేల ఎకరాల్లో వరి చేలు ఎండిపోయాయి. దీంతో ధాన్యం దిగుబడి విషయమై అధికారుల వేసిన ప్రాథమిక అంచనాకు కొంత మేర దిగుబడి తగ్గే ఆస్కారం ఉందని అధికారులు చెబుతున్నారు.

# శిఖం భూముల్లో చేపల కొలనులు

గజ్వేల్: చెరువు, కుంటల శిఖం భూముల్లో చేపల కొలనులు(ఫిష్‌పాండ్‌లు) ఏర్పాటు చేయిస్తూ.. మత్స్యకారులకు ప్రభుత్వం ఉపాధి బాటలు వేస్తోంది. జాతీయ ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో ఊరూరా చేపల కొలనులు నిర్మిస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు.



**కూలీలకు చేతినిండా పని**

చెరువులు, వాటి శిఖం భూముల పరిరక్షణతో పాటు మత్స్యకారులకు ఆదాయాన్ని సమకూర్చాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ఇందుకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో 13 కోట్ల పనిదినాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. భవిష్యత్తులో మరిన్ని పనులు చేపట్టనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. పనులు చేపట్టేందుకు ఉపాధి హామీ అధికారులు చెరువు, కుంటల వద్దకు వెళ్లి శిఖంలో అనువైన భూములు గుర్తిస్తారు. జిల్లా కలెక్టర్ ఆమోదం తరువాత పనులు చేపడుతారు. తద్వారా కూలీలకు చేతినిండా పని కల్పించడంతో పాటు మత్స్యకారులకు ఉపాధి లభించనుంది. ఒక్కో కొలను కింద 3,300 పనిదినాలు కల్పించి ఒక క్యూబిక్ మీటరుకు రూ.333 చొప్పున మొత్తం రూ.10 లక్షలు ఉపాధి కూలీలకు వేతనంగా ఇవ్వాలని నిర్ణయించారు.

# స్థిరాస్తి.. స్థిరంగా

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో స్థిరాస్తిరంగం పురోగతి స్థిరంగా కొనసాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాదిరే.. తర్వాతి ఏడాదిలోనూ నిర్మాణ అనుమతులు, వసూలైన రుసుము దాదాపు సమానంగా నమోదయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవడంతో.. 2024-25 ఆర్థిక సంవత్సరం గణాంకాలను వెల్లడిస్తూ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం బుధవారం ప్రకటన విడుదల చేసింది. చివరి మూడు నెలల్లో అనుమతుల జారీ ఊపందుకున్నట్లు తెలిపింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని అనుమతులను జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఆకాశహర్మ్యాలకు సంబంధించి ఇప్పటికే కొండాపూర్‌లో 50 అంతస్తుల భవనానికి అనుమతి మంజూరైందని, మరో ఐదు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు.

**బీపాస్ నుంచి బిల్డ్‌నౌ వైపు..**

నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను సులభతరం చేసేందుకు గత సర్కారు 2019లో టీజీబీపాస్ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అందులోని లోపాలను సవరిస్తూ.. బిల్డ్‌నౌ విధానాన్ని ప్రస్తుత సర్కారు



ఇటీవల అమల్లోకి తెచ్చింది. జీహెచ్ఎంసీలో నూతన విధానం ప్రయోగాత్మకంగా అమలవుతోంది. అనుమతుల జారీ వేగంగా జరుగుతోందని ప్రణాళిక విభాగం చెబుతోంది. బీపాస్ విధానాన్ని మరికొన్ని రోజులపాటు బిల్డ్‌నౌకు సమాంతరంగా కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

**పశ్చిమానిదే పైచేయి..**

నివాస, వాణిజ్య కేటగిరీలతోపాటు ఆస్పత్రులు, ఐటీ, ఇతరత్రా సంస్థల కేటగిరిలో జారీ అయ్యే అనుమతుల దృష్ట్యా నగరానికి పశ్చిమాన ఉన్న శేరిలింగంపల్లి జోన్ మొదటి స్థానంలో ఉందని, మియాపూర్ నుంచి నానక్‌రామ్‌గూడ వరకు ఎక్కువ సంఖ్యలో వాణిజ్య భవనాలు అనుమతులు పొందాయని అధికారులు చెబుతున్నారు. : 2022-23 సంవత్సరంలో స్థిరాస్తి రంగం గ్రేటర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొంది. అనుమతులు, రుసుము వసూళ్లలో చోటుచేసుకున్న తగ్గుదల.. తర్వాతి రెండేళ్లలో కొనసాగలేదని అధికారులు గుర్తుచేస్తున్నారు. జారీ అయిన నివాసయోగ్య పత్రాలను మినహాయిస్తే.. 2023-24తో పోలిస్తే 2024-25 సంవత్సరంలో 259 నిర్మాణ అనుమతులు అధికంగా జారీ అయ్యాయి.

# ఆహ్లాదం సరే.. అప్రమత్తత తప్పనిసరి!

మెదక్ : పర్యాటక ప్రాంతాలు, ప్రసిద్ధ దేవాలయాలు ఉండడంతో నిత్యం జిల్లాకు సందర్శకుల రాక అధికంగానే ఉంటుంది. జంటనగరాలకు సమీపంలోనే ఉండడంతో ద్విచక్ర వాహనాలు, కార్లలో యువత ఆయా ప్రాంతాలకు వస్తున్నారు. అటవీ ప్రాంతం, ఆహ్లాద వాతావరణాన్ని ఆస్వాదించేందుకు వచ్చే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. సందర్శక ప్రాంతాల్లో కొన్ని చోట్ల అతివలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకుంటేనే వీటికి అడ్డుకట్ట పడుతుంది. పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి శివారులో ఏడుపాయల వనదుర్గమాత ఆలయం, మెదక్‌లో ఖిల్లా, చర్చి, హవేలిఘనపూర్ మండలంలో పోచారం వన్యప్రాణి అభయారణ్యం, ప్రాజెక్టు, నర్సాపూర్‌లో అర్బన్‌పార్క్, రాయరావు చెరువు పర్యాటక ప్రాంతాలు. ఆయా ప్రాంతాలకు నిత్యం సందర్శకులు వస్తుంటారు.



**కానరాని పర్యవేక్షణ** నర్సాపూర్ అర్బన్ పార్క్‌లో సీసీ కెమెరాలు లేవు. ఎవరెవరు వచ్చి వెళుతున్నారనేది తెలియడం లేదు. పరిశీలకులు లేకపోవడంతో ఒకసారి లోపలికి రాగానే, వెళ్లేందుకు వివిధ మార్గాలు ఉండడంతో ఎటు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. నర్సాపూర్ - హైదరాబాద్ మార్గంలో అటవీ ప్రాంతంలో ఫెన్సింగ్ వేయగా, శివ్వంపేట మార్గంలో ఫెన్సింగ్ లేదు. యువ జంటలను స్థానికులు బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనలున్నాయి. జిల్లా కేంద్రంలోని ఖిల్లాపైన పోలీసుల పర్యవేక్షణ లేదు. పోచారం ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి ఉంటుంది. ప్రాజెక్ట్ వద్ద ఏకాంత ప్రదేశాలకు వెళ్తుంటారు. ఏడుపాయల ఆలయం వద్ద భక్తులు చెట్ల కింద, అటవీ ప్రాంతంలో విందులు చేసుకుంటారు. ఇక్కడ అదనపు సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. మరిన్ని సీసీ కెమెరాలు,గస్తీ ఏర్పాటు చేయాలి.

**జాగ్రత్తలు ఇలా** తెలిసిన వ్యక్తుల వల్లే మహిళలపై అఘాయిత్యాలు చోటు చేసుకుంటు న్నాయి. ఒంటరిగా, ప్రేమికులు, ఆడ,మగ స్నేహితులుగా కలిసి ఆయా ప్రాంతాలకు వెళ్తున్నారు. సరదా కోసం వెళ్లే వారు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలినమ్మకం ఉన్న వారితోనే ప్రయాణం చేయాలి. స్నేహం, ప్రేమ ముసుగులో ఉన్న వారు ఆహ్వానిస్తే తిరస్కరించాలి. ఎక్కడికి వెళ్లినా కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు సమాచారం ఇవ్వాలిఏ ప్రాంతానికి వెళ్లినా, జన సంచారం ఉన్న చోటనే ఉండాలి. నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లవద్దుఆయా ప్రాంతాలకు వెళితే చీకటి పడేంత వరకు ఉండొద్దు. సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవాలి పెప్పర్ స్ప్రే, లేదా కారం పొడి వెంట ఉంచుకోవాలి. ఆపదలో ఉంటే డయల్ 100 లేదా షీటీం 87126-57963, పోలీస్ కంట్రోల్ రూం 87126-57888 నంబర్లకు సమాచారం ఇవ్వాలి. **నిఘా పెడుతున్నాం...:** పర్యాటక ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిఘా కొనసాగిస్తున్నాం. ఆదివారాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఏడుపాయల, మిగతా ప్రదేశాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. మిగిలిన చోట్ల కూడా చర్యలు తీసుకుంటాం. ఉదయ్ కుమార్ రెడ్డి, ఎస్పీ

# ఆకతాయిల తిష్ఠ.. అప్రతిష్ఠ



హైదరాబాద్: నిత్యం వేలమంది నగరంలోని పర్యాటక ప్రదేశాలకు వస్తున్నా కీలకమైన అత్యధిక మంది సందర్శించే ప్రదేశాల్లో భద్రత నామమాత్రంగా ఉంటోంది. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక విధానం తీసుకువచ్చి ఉపాధి అవకాశాలను పెంపొందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా.. నగరంలో పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల భద్రత గాలిలో దీపంలా మారుతోంది. అత్యధికంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న వాటిలో గోల్కొండ ముందు వరుసలో ఉండగా తర్వాత స్థానాల్లో చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ సహా ఇతర ప్రదేశాలు ఉన్నాయి. ఇవి కాకుండా మక్కామసీదు, కుతుబ్ షాహీటూంబ్స్, పైగా టూంబ్స్, సాలార్‌జంగ్ మ్యూజియం, రేమండ్స్ సమాధి, హుస్సేన్‌సాగర్, శిల్పారామం ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. వీటిని సందర్శిస్తున్న వారిలో విదేశీయులూ ఉంటున్నారు. గతేడాది గోల్కొండ కోటను 15.27 లక్షలమంది, చార్మినార్‌ను 12.9లక్షల మంది సందర్శించారు.

**గోల్కొండలో ఆకతాయిల తిష్ఠ..**

గోల్కొండ కోటలో పర్యాటకుల భద్రత నామమాత్రంగా ఉంది. పూర్తిగా ప్రైవేటు సెక్యూరిటీ ఉండగా వీరు కూడా పరిమితంగా ఉన్నారు. కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పట్టుమని పదిమంది సిబ్బంది కూడా లేకపోవడం గమనార్హం. పర్యాటకులకు ఆకతాయిల వేధింపులు ఇక్కడ సాధారణంగా మారాయి. కొందరు నిత్యం ఇక్కడ తిష్ఠ వేసి పర్యాటకులను తప్పుదోవ పట్టించడమే కాకుండా అనుచిత వ్యాఖ్యలు చేస్తుండటంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన ద్వారం కాకుండా ఇతర ప్రదేశాల నుంచి కొందరు కోటలోకి ప్రవేశిస్తున్నారు. ప్రత్యేక సందర్భాల్లో మాత్రం స్థానిక పోలీసుల నిఘా ఉంటోంది. కోటకు వచ్చిన వారిలో ఎక్కువమంది కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను సందర్శిస్తుంటారు. ఇక్కడా సెక్యూరిటీ సిబ్బంది తక్కువగా ఉండటంతో ఏం జరిగినా గుర్తించే పరిస్థితిలేదు. పర్యాటకుల పర్సులు, ఫోన్లు, హ్యాండ్‌బ్యాగ్‌ల చోరీ నిత్యకృత్యంగా మారింది. విదేశీ టూరిస్ట్‌లు ఎక్కువగా సందర్శించే 'పైగా టూంబ్స్', రేమండ్స్ సమాధి వద్ద భద్రతా సిబ్బంది నామమాత్రమే.

**క్యాబ్‌లలో వచ్చేవారే లక్ష్యంగా..**

నగర పర్యాటకుల్లో అత్యధికంగా క్యాబ్‌ల్లో పర్యాటక ప్రదేశాలకు వెళుతున్నారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. కొత్తవారిని గుర్తించి తప్పుదోవ పట్టించడం లేదంటే అధికరుసుం వసూలు చేయడం, ఇతర ప్రదేశాలు చూపిస్తామని చెప్పి భారీ మొత్తంలో వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పర్యాటక ప్రదేశాల్లో ఉండే సిబ్బందిని సంప్రదించినా స్పందన అంతంతే ఉండటంతో ఇతరులపై ఆధారపడుతూ ఇబ్బందులు పడుతున్నారు.

# కానుక.. దేవుడికే ఎరుక!



హైదరాబాద్ : సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఆభరణాలు, వెండి మాయం.. అక్కడికి కూతవేటు దూరంలోనే ఉన్న కాశీవిశ్వనాథకం, సంతోషీమాత ఆలయంలో భద్రపరిచిన నగల లెక్కల్లో గోల్‌మాల్.. గణపతి దేవాలయంలో కొన్ని ఆభరణాలు కనిపించడం లేదంటూ వచ్చిన ఆరోపణలపై సుదీర్ఘ విచారణ చేపట్టిన దేవాదాయ శాఖ ఇప్పటికీ ఆ నివేదికలను బయటపెట్టలేదు. భక్తులు హుండీలో వేసే బంగారు, వెండి కానుకలకు సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.


**ఎక్కడెక్కడంటే..**

బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ గణపతి, ఉజ్జయిని మహాకాళి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ, కీసర రామలింగేశ్వర స్వామి, ఇతర అనేక ఆలయాలను రోజూ వేలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. బంగారం, వెండి ఆభరణాలను, నగదును హుండీలో వేస్తుంటారు. బల్కంపేట అమ్మవారి ఆలయంలో 12 కిలోలకుపైగా బంగారం, 560 కిలోలకు మించి వెండి (అమ్మవారి అలంకరణ ఆభరణాలు, మిశ్రమ బంగారంతో కలిపి) సమకూరింది. మహాగణపతి దేవాలయంలో సుమారు 11 కిలోల బంగారం, ఉజ్జయిని మహాకాళి గుడిలో 14.5 కిలోలకు మించి బంగారం, 800 కేజీల వెండి సేకరించారు. వీటితో పాటు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే ముఖ్యమైన దేవాలయాల్లో కలిపి ఏటా సుమారు రూ.30 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. చిరు కానుకల లెక్కలు వెల్లడించక పోవడంపై ఆలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**రసీదు తప్పనిసరి..**

10 గ్రాములు దాటే బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులకు రసీదు ఇవ్వాలి. చిన్నవి హుండీలో వేయాలి. ఇలా సేకరించిన బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను 3-6 నెలలకోసారి రాష్ట్ర దేవాదాయ శాఖ తరఫున జేవీవో (జ్యువెల్లరీ వెరిఫికేషన్ అధికారి) తనిఖీ చేయాలి. ఇన్వెంటరీ పుస్తకాన్ని పరిశీలించాలి. పొంతన లేకుండా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. దేవుళ్ల అలంకరణ కోసం పూజారులకు ఇచ్చే బంగారు, వెండి వస్తువుల వివరాలు ఆలయ అధికారిక పుస్తకంలో నమోదు చేయాలి. బంగారం, వెండి వస్తువులకు బీమా చేయించాలి. కానీ వారాంతపు రద్దీ ఉండే ఆలయాల్లో కొందరు ఈవోలు, బంగారు, వెండి వస్తువులకు రసీదులు ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసి లెక్కలు నిర్వహించాలని ఆదేశించారు. అయినా పరిస్థితిలో మార్పులేదు.

# సాగుకు, తాగుకు నీటి గండం!



కరీంనగర్ : ఎల్లంపల్లి జలాశయంలో రోజురోజుకు నీటి మట్టం తగ్గిపోతోంది. ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం రోజుకు 1,094 క్యూసెక్కుల నీటిని వివిధ అవసరాలకు విడుదల చేస్తున్నారు. దీంతోపాటు వరి పంటకు అవసరమైన నీటిని ఇక్కడి నుంచి నందిమేడారం, లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌లకు తరలిస్తే ఉన్న నీరు కాస్తా అడుగంటడం ఖాయం. కరీంనగర్ తలాపున ఉన్న ఎల్ఎండీలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో తాగునీరు అందించడం కష్టం కానుంది. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు ఇప్పటికీ నిత్యం 2,779 క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువల ద్వారా వదులుతున్నారు. నెలాఖరులోగా మరో రెండు తడులకు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వేసవిలో 3 లేదా 4 టీఎంసీల నిల్వకు పరిమితమయ్యే అవకాశముంది. మధ్య మానేరు జలాశయం కళ తప్పింది. దిగువ మానేరుతోపాటు మిషన్ భగీరథ తదితర అవసరాలకు రోజు 2,395 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ జలాశయం నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాజెక్టులకు ఈ నెలలో నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. పైన ఉన్న ప్రాజెక్టులు, కాళేశ్వరం జలాలు రాకపోవడం వల్ల జలాశయంలో నీటి నిల్వ క్రమంగా పడిపోతోంది. ఉమ్మడి జిల్లాలో సాగైన దాదాపు 12 లక్షల ఎకరాల పంటలకు సంబంధించి దాదాపుగా 25శాతం నీరు పై మూడు జలాశయాల నుంచి అందుతోంది. పంట కోతకొచ్చే దశలో కచ్చితంగా మరో రెండు తడులకు నీటిని ఇవ్వాలని అధికారులు భావించారు. దీంతో ఇప్పుడున్న నీటి నుంచి ఈ నెలాఖరులోగా దాదాపుగా సగం ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

వరి పంటను ఎక్కువగా సాగు చేయడంతోపాటు పలు గ్రామాల్లోని చెరువులకు, పొలాలకు ఈ ప్రాజెక్టుల నీరే ఆధారం. రోజులో 143 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాలకు ఒక్క ఎల్ఎండీ నుంచే వాడుతున్నారు. ఎల్లంపల్లి, మధ్య మానేరు కలిపితే మరో 210 క్యూసెక్కులు అవసరం. ప్రణాళిక ప్రకారంగా వినియోగిస్తేనే ప్రజల దాహార్తి తీరడానికి, పంట చేళ్లకు నీరందే పరిస్థితి ఉంది.

**వర్షాలు పడేదాకా..!**

ఇప్పుడున్న పరిస్థితుల్లో వేసవి గండం దాటినా వర్షాలు సమృద్ధిగా కురిసే వరకు ఈ జలాశయాల్లో నీరుండటం అవసరం. పంటలకే పూర్తిగా నీటిని విడుదల చేస్తే తాగునీటికి కటకట ఎదురవనుంది. కరీంనగర్‌లాంటి పట్టణానికి ఎల్ఎండీ నీరే ఆధారం. ప్రస్తుతం 5.8 టీఎంసీలుండగా ఇందులో నుంచి 2 టీఎంసీలను మాత్రమే వాడటానికి వీలుంటుంది. అంతకన్నా తక్కువగా 3 టీఎంసీల లోపు నిల్వ ఉంటే డెడ్ స్టోరేజ్ నుంచి తాగునీటిని పంపింగ్ చేయడం కుదరదు. ఇదే విధంగా ఎల్లంపల్లిలో మరో 4 టీఎంసీలు, మధ్యమానేరులో మరో 6 టీఎంసీలను మాత్రమే ఈ వేసవి నాటికి ప్రణాళిక ప్రకారం వాడితేనే ప్రయోజనం. లేదంటే నీటికి ఇబ్బందులు తప్పవు.

# సాఫీగా ముందుకు సాగొచ్చు

కేశవగిరి: చాంద్రాయణగుట్ట చౌరస్తా, ఫలక్‌నుమా మధ్య ఆర్వోబీ (నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జ్) పనులు తుదిదశకు చేరాయి. జీహెచ్ఎంసీ ప్రాజెక్టు డివిజన్ దక్షిణ మండలం-1 ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరగా పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కృష్ణా పైపులైన్లను దారి మళ్లించారు. పట్టాలపై వంతెన కోసం స్టీలు బ్రిడ్జిని రైల్వేశాఖ అధికారులు పూర్తిచేశారు. ఫలక్‌నుమా ఆర్వోబీ నిర్మాణానికి జీహెచ్ఎంసీ రూ.47.10 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే ఉన్న వంతెనను ఆధునికీకరించి మూడేళ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి పక్కనే మరొక 360 మీటర్ల పొడవున సమాంతర వంతెన, 7.5 మీటర్ల వెడల్పుతో ఆర్వోబీ నిర్మిస్తున్నారు. పట్టాలపై బ్రిడ్జి కోసం రైల్వే శాఖకు రూ.10.76 కోట్లు కేటాయించారు. గతనెల 4న స్టీల్ బ్రిడ్జి ఏర్పాటుచేయగా కాంక్రీట్ వేయాల్సి ఉంది.

నిర్మాణాల కూల్చివేత.. ఆర్వోబీకి రెండు వైపులా సమాంతరంగా 7.5 మీటర్ల వెడల్పుతో సర్వీసు రోడ్లను ఏర్పాటు చేయనున్నారు. అల్-జుబైల్ కాలనీలో పలుచోట్ల నిర్మాణాలను కూల్చివేశారు. చాంద్రాయణగుట్ట చౌరస్తా నుంచి రైల్వే బ్రిడ్జి వరకు, శ్మశానవాటిక, ధోబీఘాట్ నుంచి ఫారూఖ్‌నగర్ ఆర్టీసీ డిపో వరకు రోడ్డు, జీహెచ్ఎంసీ పనులు పూర్తయ్యాయి. ఆర్వోబీ పనులను నెలరోజుల్లో పూర్తిచేసేందుకు కసరత్తు జరుగుతోందని బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ తెలిపారు.

# పట్టణాల్లోని ఇళ్లకు కొలతలు

కరీంనగర్: జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు మున్సిపాలిటీల్లో ఉన్న ఇళ్లకు కొలతలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. రెండేళ్ల కిందట భువన్ యాప్‌తో సర్వే చేపట్టగా ఆ సమయంలో 75 శాతం ఇళ్లను లెక్కించారు. 2018 సంవత్సరంలో విలీనమైన గ్రామాలతోపాటు నగరంలో నూతన భవనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వీటికి సరైన విధంగా పన్ను మదింపు జరగకపోవడం, అదనపు అంతస్తులు నిర్మించుకోవడం, ఆస్తిపన్ను పరిధిలోకి రాకపోవడం, అక్రమ నిర్మాణాలు కట్టడం, ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు తీసుకోవడంతో కొలతల విషయంలో తేడాలు ఉంటున్నాయి. ఆస్తిపన్ను మదింపునగర, పురపాలికల్లో భువన్ యాప్ ద్వారా భవనాల చిత్రాలు, కొలతలను అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అంతర్జాలంలో నమోదు చేశారు. వీటన్నింటికి ఆస్తిపన్ను మదింపు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే ఆస్తిపన్ను సర్దుబాటు కావాల్సి ఉండగా పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన మొత్తంతో డిమాండ్ నోటిసులు వచ్చే అవకాశముంది.

అదనపు కట్టడాలకు నోటీసులు

ఆస్తిపన్ను మదింపులో తేడాలు ఉండటంతో ఒక్కో ఇంటికి సర్వే చేస్తూ



అదనపు కట్టడాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వార్డు అధికారులకు డివిజన్లు, వార్డులు అప్పగించి తక్కువ ఆస్తిపన్ను చెల్లిస్తున్న జాబితాను తీసుకొని మళ్లీ కొలతలు చేపడుతున్నారు. ప్రధానంగా అదనంగా అంతస్తులు నిర్మించుకోవడం, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని వదలడం లేదు. వాణిజ్య సంస్థ ఆస్తిపన్ను ఏవిధంగా వస్తుందో నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**పెరుగుతున్న పన్ను**

భువన్ యాప్‌తోపాటు అదనపు నిర్మాణాలకు కొలతలు ఇష్టానుసారంగా చేస్తుండటంతో అడ్డగోలుగా పన్నుల భారం పడుతుంది. దాంతో ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరికి అయితే ఎలాంటి కొలతలు చేపట్టకుండానే రివైజ్డ్ ఆస్తిపన్ను చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఓ దశలో నల్లా కనెక్షన్ కూడా తొలగించారు. వీటిపై అభ్యంతరాలు పరిష్కరించుకునే అవకాశాన్ని ఇవ్వకుండా దాటేశారని మండి పడ్డారు. ప్రస్తుతం ఆస్తిపన్ను అధికంగా వస్తుందనే ఫిర్యాదుల మేరకు తిరిగి కొలతలు చేపట్టి ఆస్తిపన్ను రాబట్టుకోవాలని నిర్ణయించారు.

# చల్లనివన్నీ.. మంచివి కాదండోయ్..!

నీలగిరి : ఎండలు మండుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందేం దుకు చల్లటి పానీయాలు తీసుకుంటే బాగుంటుందని అందరూ భావిస్తుంటారు. అయితే చల్లనివన్నీ మంచి పానీయాలా కాదా అని ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో సమృద్ధిగా నీరు తాగాల్సిన అవసరం ఉంది. ఎండ వేడికి తట్టుకోలేక పలువురు జ్యూస్ లు, ఐస్‌క్రీంలు, ఇతర పానీయాలు తీసుకుంటారు. వినియోగదారులను ఆకర్షించేందుకు నిర్వాహకులు వీటిలో రంగులు, ఇతర పదార్థాలను కలుపుతారు. వీటి వల్ల అనేక రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు చెబుతున్నారు.

**కల్తీకి అవకాశం ఉన్న పదార్థాలు**

జ్యూస్‌లు, మజ్జిగ, ఐస్‌క్రీంలు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లు కల్తీ జరిగేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. రంగులు, రుచి కోసం పలు రకాల రసాయనాలను వీటిలో కలుపుతారు. ఫుట్‌పాత్‌లపై తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకునే ముందు ఓ సారి ఆలోచించి తీసుకోవడం ఉత్తమం. జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు తయారు చేసేందుకు కలుషిత నీరు, పాలు..పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు కార్బైడ్‌లను వినియోగిస్తారు.

**కల్తీపై నిరంతర నిఘా**

-జ్యోతిర్మయి, జోనల్ అధికారి ఆహార కల్తీ నిరోధక శాఖ ఉమ్మడి నల్గొండ

జిల్లా ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న వ్యాపారులపై నిరంతర నిఘా పెట్టాం. ఉమ్మడి జిల్లాలో సంచార తనిఖీ వాహనం తిప్పుతున్నాం. వినియోగదారులు ఫిర్యాదులు చేసిన చోట, అనుమానం ఉన్న ఫుడ్ తయారీ కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

2024-25 నల్గొండ జిల్లాలో మొత్తం 42 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల అనారోగ్య కారకాలు ఉన్నట్లు గుర్తించారు. 33 చోట్ల నాణ్యత పాటించడంలేదని తేలింది. వీరికి రూ.3.47లక్షలు జరిమానా విధించారు.

వేసవిలో తీసుకోవాల్సిన పదార్థాలు

-కల్యాణి, డైటీషియన్

వేసవిలో ఆరోగ్యం కోసం తాజా పండ్లు, అధిక నీటిని అందించే కూరగాయలు తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగుతూ ఉండాలి. నీరు అధికంగా ఉండే సొరకాయ, బీరకాయ, దోసకాయ, టమాట, కీరదోస మొదలైనవి తీసుకోవాలి. సబ్జా గింజలు రోజుకు 15 గ్రాములు నానబెట్టి తీసుకుంటే శరీరం వేడి నుంచి ఉపశమనం పొందుతుంది. ఫ్రైలు, అధిక కొవ్వు పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు. షుగర్ వ్యాధిగ్రస్థులు పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి.


# గురుకులం.. పక్కా పర్యవేక్షణే బలం

సంగారెడ్డి : గురుకులాలు.. ఒకప్పుడు సీటు లభించాలంటే ప్రవేశ పరీక్షకు కష్టపడి చదవాలి. ఇక్కడ సీటు దక్కితే తమ పిల్లల భవిత బాగుంటుందని తల్లిదండ్రులు సంబర పడేవారు. రానురాను గురుకులాల్లో నాణ్యత తగ్గుతోంది. విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు.. భోజనం నాణ్యంగా లేకపోవడం వంటి కారణాలతో పిల్లలు వీటిలో చదివేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశాలు తీసుకుంటాయి. ఫలితాలు వచ్చిన తరువాత పిల్లలు చేరకపోవడంతో సెప్టెంబరు వరకు సైతం ప్రవేశాలు కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. **అద్దె భవనాల్లో ఇరుకుగా..** ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాల్లో బీసీ, మైనార్టీ గురుకులాలు 56 ఉన్నాయి. వీటిలో చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తరగతి గదిలోనే ఉదయం పాఠాలు వినడం.. రాత్రిపూట అదే గదిలో పడుకోవడం చేయాల్సి వస్తోంది. సొంత భవనాలు నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చినా అమలు కావడంలేదు. కొద్దిపాటి శౌచాలయలు విద్యార్థుల సంఖ్యకు సరిపోవడం లేదు. దుర్వాసన వ్యాపిస్తోంది. విద్యార్థులు అస్వస్థతకు గురై ఇబ్బంది పడుతున్నారు. వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

**ఆటపాటల ప్రోత్సాహం తక్కువే** సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ గురుకులాల్లో గతంలో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించే వారు. విద్యాభ్యాసంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఆటలు.. సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చేవారు. 5వ తరగతి నుంచే క్రీడలు నేర్పించేవారు. ఇక్కడ చదివిన పిల్లలు వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. ప్రత్యేకంగా కౌన్సెలర్లతో సైకాలజీ తరగతులు నిర్వహించేవారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండే వారు.. మార్కులు తదితర కారణాలతో అఘాయిత్యాలు చేసుకోకుండా మానసిక స్థైర్యం కల్పించే వారు. వేసవి శిబిరాలు అన్ని జిల్లాల్లో నెల రోజుల పాటు ఉండేది. మూడేళ్ల నుంచి అరకొరగా చేపడుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు వచ్చేందుకు నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు చెప్పించేవారు.

# సాఫ్ట్‌వేర్ పర్యాటకం

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే లక్ష్యంగా భాగ్యనగరం చుట్టూ పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. నగరంలో సుమారు పది లక్షల మందికిపైగా ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వారాంతపు పర్యాటకానికి కొత్త రూపు ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక శాఖ నిర్ణయించింది. వారాంతం, ఇతర సెలవు రోజుల్లో ఆహ్లాదకరంగా గడిపేందుకు వీలుగా పలు ప్రదేశాలను గుర్తిస్తున్నారు. నగరం చుట్టుపక్కల వంద కిలోమీటర్ల పరిధిలో ఒకట్రెండు రోజులు గడిపేలా వాటిని అభివృద్ధి చేయనున్నారు. అక్కడ నుంచే పని చేసేందుకు ఆసక్తి చూపే వర్క్‌ఫ్రం హోం ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని వసతులతోపాటుగా తగిన భద్రత,



వైఫై సౌకర్యం వంటివీ కల్పించనున్నారు. నగరానికి చేరువలో అనంతగిరి, భువనగిరి, కొలనుపాక, నల్లమల అటవీప్రాంతం తదితర పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు పర్యాటక శాఖ విధివిధానాలు రూపొందిస్తోంది. త్వరలో అందుబాటులోకి రానున్న రాష్ట్ర నూతన పర్యాటక విధానంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఎకో టూరిజం, ట్రెక్కింగ్, సైక్లింగ్ వంటి వాటికి అనువుగా వివిధ ప్రదేశాలను అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటకశాఖ ఉన్నతాధికారి తెలిపారు.

# గంగారంలో డబుల్ ఎలివేటెడ్ మెట్రో సాధ్యమేనా?

హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశలో డబుల్ ఎలివేటెడ్ మెట్రో మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో వచ్చే అవకాశం ఉంది. మదీనాగూడ తర్వాత గంగారం వద్ద 0.8 కి.మీల మార్గాన్ని ప్రతిపాదించారు. డిజైన్లను జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) సంస్థకు అధికారులు సమర్పించారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు..: మియాపూర్ స్టేషన్ నుంచి మొదలై పటాన్‌చెరు (కారిడార్-7)వరకు వెళుతుంది. ఈ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గంగారం వద్ద ఫ్లైవర్‌ను, ఇదే మార్గంలో మెట్రో విస్తరణను ప్రతిపాదించారు. గంగారం వద్ద డబుల్ ఎలివేటెడ్‌పై అధ్యయనం చేశారు. మొదటి అంతస్తులో



వాహనాలు.. ఆపై అంతస్తులో మెట్రో వెళతాయి. మెట్రో డిజైన్లకు అనుగుణంగా ఎన్‌హెచ్ సంస్థ ఫ్లైవర్ డిజైన్లలో మార్పులు చేయాల్సి ఉంటుంది. స్పందన లేదని.. మెట్రో అధికారులు అంటున్నారు.

పది స్టేషన్లు రానున్నాయి..


కారిడార్-7 పొడవు 13.4కి.మీ. ఉంటుంది. ఈ మార్గంలో మియాపూర్ ఎక్స్‌రోడ్, ఆల్విన్ చౌరస్తా, మదీనాగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్, జ్యోతినగర్, బీరంగూడ, ఆర్‌సీపురం, ఇక్రిశాట్, పటాన్‌చెరు స్టేషన్లు ప్రతిపాదించారు.

రద్దీకి పరిష్కారంగా...: ఈ మార్గంలో రద్దీ సమయంలో గంటలో ప్రయాణించే వాహనాలు పీక్ అవర్ పీక్ డైరెక్షన్ ట్రాఫిక్ (పీహెచ్‌పీడీటీ) 2028 నాటికి 10వేలకు, 2033కు 15వేలు, 2043 కు 22వేలు, 2053 నాటికి 30వేలకు చేరుతుందని అంచనా వేశా రు. ప్రయాణాలు సజావుగా సాగాలంటే మెట్రో వంటి ప్రజారవాణా అత్యంత ముఖ్యమని మెట్రోరైలు అధికారులు చెబుతున్నారు.

# బాటసింగారం మార్కెట్‌కు మామిడి కళ

హైదరాబాద్:: బాటసింగారం పండ్ల మార్కెట్‌కు మామిడి రావడం జోరందుకుంటోంది. ఈ ఏడాది మామిడి సీజన్‌లో లక్షన్నర టన్నుల కాయలు క్రయవిక్రయాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్టు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ.. బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. జనవరి నుంచి ఇప్పటివరకు మార్కెట్‌కు 7892క్వింటాళ్ల మామిడి విక్రయానికి వచ్చింది. క్వింటాల్‌ధర అత్యధికంగా రూ.16,650, అత్యల్పంగా రూ. 2750 పలికింది.

గతేడాది ఇలా..: గతేడాది మామిడి సీజన్‌లో జనవరి నుంచి జులై వరకు 11,39,865 క్వింటాళ్ల మామిడి వచ్చింది. దీని విలువ



రూ.321.84 కోట్లు. ఈ సీజన్ దృష్ట్యా మామిడి యార్డులో 17 తాగునీటి ప్లాంట్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు. హమాలీలు, కూలీలకు షవర్ ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లో 33 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసు అవుట్‌పోస్టు కోసం ఇప్పటికే అధికారులను కోరినట్లు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి వివరించారు. ఫైర్‌ఇంజిన్ మార్కెట్‌లో ఉంచాలని అగ్నిమాపకశాఖ అధికారులను కోరినట్లు తెలిపారు.

# సమయానికి రారు.. సేవలు బేజారు






హైదరాబాద్ : మార్చి నెల మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. వడగాల్పులు, ఎండవేడితో చాలామంది వడదెబ్బకు గురవుతుంటారు. ఈ క్రమంలో ప్రాథమిక వైద్య సేవలు చాలా కీలకం. గ్రేటర్ వ్యాప్తంగా 200 వరకు బస్తీ దవాఖానాలు, మరో 90పైనే అర్బన్‌హెల్త్ సెంటర్లు, శివార్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వేసవి నేపథ్యంలో ఔషధాలు సిద్ధం చేసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆయా వైద్యులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గ్రేటర్‌లోని పలు బస్తీ దవాఖానాలను, యూపీహెచ్‌సీలను బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ముఖ్యంగా 80 శాతం ఆసుపత్రుల్లో సకాలంలో వైద్యులు, సిబ్బంది హాజరు కావడం లేదు. ఉదయం 9 గంటలకే కేంద్రం తెరవాల్సి ఉండగా.. కొందరు 11గంటలు దాటినా పత్తా లేకుండా పోతున్నారు. కొందరు ఆలస్యంగా వచ్చి.. మధ్యాహ్నం 1 గంట తర్వాత వెళ్లిపోతున్నారు. ముమ్ముందు ఎండలు మరింత పెరగనున్న దృష్ట్యా ఈ కేంద్రాలపై పనితీరు పెరగాల్సిన అవసరం ఉందని రోగులు కోరుతున్నారు. ఇవిగో కొన్ని ఉదంతాలు...

చర్లపల్లి డివిజన్‌లోని పెద్దచర్లపల్లి బస్తీదవాఖానాలో ఉదయం 10 గంటలు దాటినా వైద్యుడి జాడ కన్పించలేదు.

ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ బస్తీ దవాఖానాలో మందుల సరఫరా అరకొరగా ఉంటోందని రోగులు వాపోయారు. కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని దవాఖానాకు 10.45 గంటలు దాటిన తర్వాత డాక్టర్ విధులకు హాజరయ్యారు.

లింగంపల్లిలోని బస్తీ దవాఖానాలో డాక్టర్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. వైద్యురాలిని నియమించినప్పటికీ ఆమె సెలవుపై వెళ్లిపోయారు. గోకుల్‌ప్లాట్స్‌లోని దవాఖానాలోనూ వైద్యులు లేరు.

ఖైరతాబాద్ మహాభారత్‌నగర్, కుమ్మరిబస్తీ, బీఎస్‌మక్త దవాఖానాల్లో మందుల కొరత ఉంది.

ముషీరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్ ఆరోగ్య కేంద్రంలో వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది.

కూకట్‌పల్లి, బాలానగర్ బస్తీ దవాఖానాల్లో మందుల కొరత ఉందని సిబ్బంది చెబుతున్నారు.

సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ వైద్యులు 11 గంటల తర్వాతే విధులకు హాజరవుతున్నారు.

# పైవంతెనలు.. అంతంతే పనులు



హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పైవంతెనల పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. పురోగతి నత్తనడకన ఉండటంతో వాహనదారులకు నిత్యం నరకం తప్పడం లేదు. అన్నీ రెండేళ్లలోనే అందుబాటులోకి రావాల్సి ఉండగా.. జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం కారణంగా ముందుకు సాగడం లేదు. కూడళ్లలో వాహనాల సాఫీగా వెళ్లేలా రోడ్లను అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2016లో రూ. 25వేల కోట్ల అంచనా వ్యయంతో ఎస్సార్డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం)ని ప్రారంభించింది. అందులో భాగంగా చేపట్టిన పైవంతెనలు, అండర్‌పాస్‌ల వంటి పనులు 35 పూర్తికాగా.. ఎనిమిది పురోగతిలో ఉన్నాయి.

**ఆరేళ్లయినా అవ్వలే..**

విషయం: గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు చేపట్టిన రెండో పైవంతెన నిర్మాణం ఆరేళ్లయినా పూర్తికాలేదు. 80 శాతం పనులు పూర్తయినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇంకా భూసేకరణ కాలేదు. రోడ్డు విస్తరణ పురోగతిలో ఉంది.

కారణం: భూసేకరణ, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

ప్రయోజనం: ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, బీహెచ్‌ఈఎల్ రోడ్డు మధ్య రాకపోకలు సాగించే లక్షలకుపైగా వాహనాలకు ప్రయోజనం.

**ఆరేళ్లయినా అవ్వలే..**

విషయం: గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు చేపట్టిన రెండో పైవంతెన నిర్మాణం ఆరేళ్లయినా పూర్తికాలేదు. 80 శాతం పనులు పూర్తయినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇంకా భూసేకరణ కాలేదు. రోడ్డు విస్తరణ పురోగతిలో ఉంది.

కారణం: భూసేకరణ, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

ప్రయోజనం: ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, బీహెచ్‌ఈఎల్ రోడ్డు మధ్య రాకపోకలు సాగించే లక్షలకుపైగా వాహనాలకు ప్రయోజనం.

శంకుస్థాపన: 2019

వ్యయం: రూ.313.52 కోట్లు

పూర్తి 80 శాతం

**ఆదిలోనే ఆగిపోయి..**

విషయం: తూర్పు నగరంలో ఉప్పల్, ఎల్బీనగర్ కూడళ్లు ప్రధానమైనవి. ఇప్పటికే ఎల్బీనగర్‌లో రెండు అండర్‌పాస్‌లు, రెండు పైవంతెనల నిర్మాణం 2022లో పూర్తయ్యాయి. ఉప్పల్ కూడలిలో నాగోల్ నుంచి హబ్సిగూడ దిశలో ఓ వంతెన, హబ్సిగూడ నుంచి నాగోల్ వైపు మరో వంతెన, రామంతాపూర్ వైపు, క్రికెట్ మైదానం వైపు రోడ్డుకు రెండు వేర్వేరు పైవంతెనలు నిర్మించాలని నాలుగేళ్ల కిందట ప్రారంభించిన పనులు ఆదిలోనే ఆగిపోయాయి.

కారణం: సర్వే ఇండియాకు చెందిన 8.04 ఎకరాలు, ప్రైవేటు వ్యక్తుల నుంచి 6.4 ఎకరాలు సేకరించాల్సి ఉంది. నిధులేక బల్దియా ప్రక్రియను చేపట్టడం లేదు.

ప్రయోజనం: వరంగల్ జాతీయ రహదారిపై నారపల్లి నుంచి ఉప్పల్ కూడలి వరకు చేపట్టిన పైవంతెనకు కొనసాగింపుగా జీహెచ్‌ఎంసీ కూడలిలో నాలుగు పైవంతెనలను నిర్మిస్తోంది. ఇవన్నీ అందుబాటులోకి వస్తే ఉప్పల్ కూడలి ట్రాఫిక్ సమస్యకు 100శాతం పరిష్కారం లభిస్తుంది. రాకపోకలు సాగించే లక్ష వాహనాలకు ప్రయోజనం.

శంకుస్థాపన: 2021

వ్యయం: రూ.311 కోట్లు

పూర్తి 8 శాతం

**నత్తనడకన పనులు**

విషయం: చంచల్‌గూడ జైలు నుంచి ఒవైసీ ఆసుపత్రి వరకు3.38 కి.మీ.ల పొడవున నిర్మిస్తున్న ఉక్కువంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. పిల్లర్ల గుంతలు, అసంపూర్తి పనులతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఐఎస్‌సదన్, చంచల్‌గూడ, కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

కారణం: భూసేకరణ, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

ప్రయోజనం: సాగర్ రోడ్డు, ఒవైసీ ఆసుపత్రి, నల్గొండ ఎక్స్‌రోడ్డు, పాతబస్తీలోని ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయి.

శంకుస్థాపన: 2021

వ్యయం: రూ.620 కోట్లు

పురోగతి: 48 శాతం

# నాలాల్లో చెత్త వేస్తే.. రూ.10వేలు

హైదరాబాద్: నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు, ప్రజల్లో పరిశుభ్రతపై బాధ్యతను పెంచేందుకు జీహెచ్‌ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. మొక్కుబడిగా మారిన జరిమానాల విధానాన్ని.. ఇకపై పక్కాగా అమలు చేయడంపై కమిషనర్ ఇలంబర్తి దృష్టిపెట్టారు. జరిమానాల విధానం పారదర్శకంగా అమల్యయేందుకు లోపాల్లేని మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నామని, తయారీ బాధ్యతలను టీసీఎస్‌కు అప్పగించామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**అధికారులకు శిక్షణ..**

యాప్ తయారీ నెలరోజుల్లో పూర్తవనుందని, అనంతరం దానిని ఉపయోగించే విధానంపై అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. పారిశుద్ధ్య విభాగానికి సంబంధించిన జరిమానాల విధింపును సహాయ వైద్యాధికారులు, నిర్మాణ వ్యర్థాలపై ఉండే జరిమానాలను టౌన్ ప్లానింగ్ అధికారులు విధించనున్నారు. అందుకోసం 19రకాల ఉల్లంఘనలు, వాటి జరిమానా విలువను అధికారులు లెక్క తేల్చారు. సర్కిళ్ల వారీగా అధికారులకు లాగిన్‌లు ఉంటాయి. జరిమానా విధించేటప్పుడు ఉల్లంఘన ఫొటో తీయాలి. అధికారి పేరు, జరిమానా మొత్తం, ఉల్లంఘనుల పేరు, ఫోన్ నెంబరు, చిరునామాతో డిజిటల్ రసీదు వస్తుంది.

**జరిమానాలు ఇలా..**

రోడ్లపై చెత్త వేస్తే: రూ.100


బహిరంగ మూత్ర విసర్జన: రూ.100

గోడలపై రాతలు: రూ.1000

కాలువల్లో చెత్త వేస్తే: రూ.1000

దుకాణదారులు రోడ్లపై చెత్త వేస్తే: రూ.1000-రూ.2,000

గోడలపై పోస్టర్లు: రూ.2వేలు



అనుమతిలేని బ్యానర్లు, కటౌట్లు: రూ.5వేలు

బస్తీలు, కాలనీరోడ్లపై, ఖాళీస్థలాల్లో నిర్మాణ వ్యర్థాల డంపింగ్, తరలింపు..: రూ.5వేలు

చెరువులు, రోడ్లు, నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే: రూ.5వేలు

బహిరంగంగా ప్లాస్టిక్‌ను కాలిస్తే: రూ.5వేలు

నాలాల్లో చెత్త వేస్తే: రూ.10వేలు

ప్లాస్టిక్ కవర్లు, సంచుల నిల్వ లేదా విక్రయం..: మొదటి తప్పునకు రూ.10వేలు, రెండో తప్పునకు రూ.25వేలు, మూడో తప్పునకు దుకాణం మూత

నిర్మాణ వ్యర్థాలను భారీగా అనుమతిలేని వాహనాలకు ఇచ్చేసంస్థకు: రూ.50వేలు

# తుది దశకు విజిలెన్స్ విచారణ

కరీంనగర్ : కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీలో అవినీతి, అక్రమాలు జరిగాయని విద్యార్థి, ప్రజా సంఘాలు ఆరోపణలు, నిరసనలు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 15 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. దీనిపై ప్రభుత్వం గత జులైలో రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీని విచారణకు ఆదేశించింది. అప్పటినుంచి 8 నెలలుగా ఒక్కో అంశంపై కూలంకుశంగా విచారణ చేపడుతూ వస్తున్నారు. విజిలెన్స్‌లో సిబ్బంది కొరత, ఫిర్యాదు అంశాలు ఎక్కువగా ఉండటంతో ఆలస్యమైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**అనర్హులను నియమించారని..**

గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీలో నియామకాలు చేపట్టారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. కనీస అర్హత లేనివారిని ఆచార్యులు, సహ ఆచార్యులుగా నియమించారని ఫిర్యాదులో తెలిపారు. రెగ్యులర్ కోర్సులుగా ఉన్న నాలుగు విభాగాలను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా చూపి యూజీసీ-12బీ గుర్తింపు కోసం తప్పుడు నివేదికను సమర్పించారని ఆరోపించారు. పరిపాలన భవనం మొదటి అంతస్తు నిర్మాణంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించక నిధులు దుర్వినియోగం చేశారని చెబుతున్నారు.

**ఉద్యోగం వదిలేయడంపై అనుమానాలు..**

2021-22, 2022-23లో జరిగిన ఆడిట్ నివేదికలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు తమ పిటిషన్‌లో కోరారు. జులైలో




విజిలెన్స్ విచారణ ప్రారంభం కాగానే అప్పటి ఫైనాన్స్ అధికారి సెలవుపై వెళ్లారు. అనంతరం ఉద్యోగం నుంచి తప్పుకొంటున్నట్లు వెల్లడించారు. ఎక్కడ తన మెడకు చుట్టుకుంటుందోనని ఆ అధికారి పక్కకు తప్పుకొన్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. విచారణ ప్రారంభించే కంటే 2 నెలలముందే అప్పటి ఉపకులపతి ఉద్యోగ విరమణ కావడంతో.. ఆరు నెలలుగా ఇన్‌ఛార్జి వీసీ పాలనలో కొనసాగింది. ఉపకులపతిగా ఉమేశ్‌కుమార్ అక్టోబరులో బాధ్యతలు చేపట్టారు. మరో 15 రోజుల్లో విచారణ నివేదికను విజిలెన్స్ ఉన్నత కార్యాలయానికి పంపి.. అనంతరం అటునుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు కరీంనగర్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అచ్చేశ్వర్‌రావు తెలిపారు.


**సిబ్బంది పీఎఫ్ డబ్బులపై..**పరీక్ష పేపర్ లీకేజీలు, టెండరు లేకుండానే పరీక్ష జవాబుపత్రాల స్కానింగ్ ప్రక్రియపై ఓ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని.. గత ఉపకులపతి రెసిడెన్స్ నిర్వహణలో ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. బోధనేతర సిబ్బంది పీఎఫ్ డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా.. ఫైనాన్స్ అధికారి, అప్పటి రిజిస్ట్రార్ వద్దనే అంటిపెట్టుకున్నట్లు తెలిపారు.

# సేకరిస్తారా.. మూసేస్తారా!

పెద్దపల్లి : సీజన్ చివరి దశకు రావడం, పత్తిలో నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయనే సాకుతో కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసేందుకు సీసీఐ చర్యలు చేపడుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే కేంద్రాలను ఎత్తివేయడంతో అక్కడి రైతులు మన జిల్లాకు వస్తున్నారు. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి వచ్చిన పత్తితో మిల్లులు నిండిపోయిందని, ఇక్కడి రైతులు అమ్ముకానికి ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మన జిల్లాలోనూ సీసీఐ కొనుగోళ్లు నిలిపివేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బుధవారం నుంచి సేకరణ ప్రక్రియ నుంచి సంస్థ తప్పుకొంటుందన్న వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లాలో సీసీఐ(భారత పత్తి సంస్థ) కొనుగోలు కేంద్రాలను ఎత్తివేయడంతో భీమారం మండలం అరెపల్లి గ్రామానికి చెందిన దుర్గం సాంబయ్య మంగళవారం 15 క్వింటాళ్ల పత్తిని పెద్దపల్లిలోని ఒక జిన్నింగ్ మిల్లుకు తీసుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎత్తివేయ డంతో ఇక్కడికి తీసుకురావాల్సి వచ్చిందని చెప్పారు. ఆయనొక్కడే కాదు.. ఆ జిల్లాకు చెందిన చాలా మంది రైతుల వాహనాలు మిల్లు వద్ద బారులు తీరాయి.

**ధరలపై డాలర్ ప్రభావం**

సాధారణంగా మార్చి నెలలో పత్తి ధరలు పెరుగుతాయి. ప్రభుత్వ మద్దతు ధర కంటే రెట్టింపు పలికిన సందర్భాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం పత్తి ధరలపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు(ముఖ్యంగా దిగుమతి చేసుకునే వస్తువులు) గత నెల రోజుల వ్యవధిలో బాగా పెరిగాయి. రూపాయి



మారకం విలువ పడిపోవడంతో పత్తి బేళ్ల ధర కూడా తగ్గిపోయింది. దీని ప్రభావం ఎగుమతులపై పడటంతో పాటు పత్తి ధరలను ప్రభావితం చేస్తోంది. ఈ పరిస్థితుల కారణంగానే గతానికి భిన్నంగా మార్చి నెలలో ధరలు తిరోగమనంలో ఉన్నాయి. ఇదే సమయంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఎత్తివేస్తారన్న ప్రచారంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ధాన్యం సీజన్‌లో చివరి గింజ వరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం పత్తి సేకరణలో ఇందుకు వ్యవహరించడం సరికాదని అభిప్రా యపడుతున్నారు.

**ఇళ్లలోనే 40 శాతం నిల్వలు**

ఇప్పటివరకు జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 3.13 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఇదే సమయంలో ప్రైవేటు కొనుగోలుదారులు 90 వేల క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో గతేడాది 52,578 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం కనీసం 7 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 4.03 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే రైతులు విక్రయించారు. ఇందులో ఇతర జిల్లాలకు చెందిన సరకు కూడా ఉంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం రైతుల వద్ద మరో 40 శాతం నిల్వలున్నాయి. ప్రైవేటులో ధరలు పెరుగుతాయన్న ఉద్దేశంతో రైతులు పత్తిని అమ్ముకుండా అట్టిపెట్టుకున్నారు.

చురకలు



# సిరులు నింపిన సీలేరు!

ఉండి : మార్చి 25న గరిష్ఠ స్థాయిలో 9,553 క్యూసెక్కుల జలాలు సీలేరు నుంచి గోదావరిలోకి చేరాయి. ఏప్రిల్ 1న 8,891 క్యూసెక్కులు ఇచ్చారు. సహజ ప్రవాహాలతో కలిపి 10,778 క్యూసెక్కుల జలాలు గోదావరిలోకి చేరుతున్నాయి. పశ్చిమడెల్టాకు గత నెల 16 నుంచి బుధవారం వరకు 5,500 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రబీ వరి పంటకు సీలేరు జలాలు జీవం పోశాయి. కీలక దశలో సీలేరు నుంచి నీటి విడుదల పెంచడంతో పాటు వారబందీ విధానంలో అన్ని ప్రాంతాలకు సర్దుబాటు చేయడంతో సత్ఫలితాలు వచ్చాయి. పశ్చిమ డెల్టాలో కొన్ని చోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఎగుమతి కోసం తాడేపల్లిగూడెం, పెంటపాడు తదితర మండలాల్లో పరిమిత విస్తీర్ణంలో సాగుచేసిన ఎస్ఎల్ 10, పీఆర్ 126 వరి రకాల దిగుబడి ఎకరాకు 60-65 బస్తాల మధ్య వస్తోంది. పంట గట్టెక్కిన చోట్ల ఎస్ఎల్ 10 రకాన్ని మరమరాల తయారీ కోసం వ్యాపారులు వెనువెంటనే కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో అన్ని మండలాల్లో వరి పంట గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సారిఎకరాకు సగటున 4,175 కిలోల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**అవసరాన్ని బట్టి పెంచుతూ..** గోదావరిలో నీటి లభ్యత తగ్గిపోతుండటంతో రబీ వరి సాగుకు సీలేరు జలాలే ఆధారమని డిసెంబరులోనే యంత్రాంగం గుర్తించింది. ఉన్న నీటినే పొదుపుగా వాడుకొనేలా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి వారబందీ (వంతులవారీ) విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఫిబ్రవరి 15 నాటికి సీలేరు నుంచి సహజంగా



వచ్చే 4,044 క్యూసెక్కులకు తోడు బైపాస్ విధానంలో మరో 3 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. తర్వాత నుంచి అవసరాన్ని నీటి విడుదలను పెంచుతూ వచ్చారు.

**క్షేత్ర పర్యవేక్షణతో..** పంట కీలక దశకు చేరిన సమయంలో పాలకోడేరు, ఆకివీడు, దెందులూరు, కాళ్ల, ఉండి, నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం తదితర మండలాల్లోని మెరక భూముల్లో సాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. నీటి వినియోగదారుల సంఘాలు, అధికారుల పర్యవేక్షణతో సమస్యను అధిగమించారు. ముందుగా నాట్లేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

**పశ్చిమలో సాగు వివరాలు**

వరి పంట విస్తీర్ణం: 2.20 లక్షల ఎకరాలు

రైతుల సంఖ్య : 1.08 లక్షలు

దిగుబడి అంచనా: 4,175 కిలోలు (ఎకరానికి)

ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం: 6 లక్షల టన్నులు

# 'అక్షరం' అడుగుతోంది నిధి

కర్నూలు : మన బడి నాడు-నేడు అంటూ గత వైకాపా ప్రభుత్వం అర్భాటం చేసింది.. ఉన్న గదులు పడగొట్టింది.. కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతామన్నారు.. తీరా నిధులివ్వకుండా కాలయాపన చేసింది.. అర్ధంతరంగా ఆగిపోయిన పనులు భావితరం చదువులకు ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం మౌలిక వసతుల కల్పనకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.67.84 లక్షలు కేటాయించారు.. మరిన్ని నిధులు కేటాయించి వేసవి సెలవుల్లో పనులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు.

**నాడు.. నేడు.. పూర్తి ఎప్పుడో**

ఉమ్మడి జిల్లాలో 80 శాతం పాఠశాలలను నాడు-నేడు కింద ఎంపిక చేసినట్లు గతంలో ప్రకటించారు. మొదటి విడత ఎంపిక చేసిన బడుల్లో 20 శాతం వరకు పనులు మిగిలిపోయాయి. రెండో విడత కింద అదనపు గదులు నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో గదికి రూ.12 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రెండో విడత 1,827



పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందుకు రూ.789.04 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. చాలా చోట్ల ఉన్నవి పడగొట్టారు. నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్లకు తలుపులు లేవు. నీటి సౌకర్యం లేకపోవడంతో భరించరాని దుర్వాసన వస్తోంది.

**పనులు కదలక..**

సంతోష్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు కింద ఎంపిక చేయడంతో ప్రహరీతోపాటు మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించారు. నిధులు రాకపోవడంతో గుత్తేదారుడు పనులు ఆపేశారు. కొద్దిపాటి నిధులు కేటాయిస్తే పనులు పూర్తై పిల్లల కష్టాలు తీరుతాయి.

**మౌలిక వసతుల కల్పన**

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాకు రూ.6.80 లక్షలు, నంద్యాలకు రూ.61.04 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలోని బసవపురం ఎంపీపీ పాఠశాల, మునగాలపాడు ఎంపీపీ ఉర్దూ పాఠశాలల్లో విద్యుదీకరణ పనులు చేపట్టేందుకు ఒక్కో బడికి రూ.1.50 లక్షలు కేటాయించారు. పాతబస్తీలోని ఖలీల్‌వాడలో ఎంసీయూపీ ఉర్దూ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.నంద్యాల జిల్లా పరిధిలో బోడెమ్మనూరు ఎంపీపీఎస్, బనగానపల్లి ఎంపీయూపీఎస్‌లో ప్రహరీల నిర్మాణానికి రూ.39.84 లక్షలు, బనగాన పల్లి ఎంపీయూపీఎస్, నంద్యాల వైఎస్ఆర్ నగర్‌లోని ఎంపీఎల్‌యూ పీఎస్‌లలో మరుగుదొడ్ల పూర్తికి రూ.11.40 లక్షలు, మద్దికుంటతం డాలోని ఎంపీపీఎస్‌లో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.3.80 లక్షలు, పిక్కిలపల్లితండా, ముసలాయి చెరువు, సీతమ్మతండా, మద్దికుంట తండా ఎంపీపీఎస్‌లలో విద్యుదీకరణ పనులకు రూ.6 లక్షలు కేటాయించారు.

# రైల్వే ప్రాజెక్టులకు ఊపిరి!



తిరుపతి : ఐదేళ్ల జగన్ పాలనలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రైల్వే ప్రాజెక్టులు పడకేశాయి. భూసేకరణ, లైన్ల నిర్మాణానికి వైకాపా ప్రభుత్వం ఏమాత్రం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించారు. పలు శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని గుర్తించి.. రైల్వే, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో కలిపి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఫలితంగానే ఒక్కో ప్రాజెక్టులో ఇప్పుడిప్పుడే కొంత కదలిక వస్తోంది. ఇదే ఉత్సాహంలో రెండు వరుసలు (డబ్లింగ్), నూతన రైల్వే లైన్ల నిర్మాణానికి కలెక్టర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎప్పటిలోపు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందిస్తారో సవివరంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్ వివరించారు. చిత్తూరు, తిరుపతి ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురుమూర్తి కూడా చొరవ తీసుకుంటే రైల్వేశాఖ పనుల్లో పురోగతి కనిపిస్తుంది.

**ఏడేళ్ల సమస్యకు ఆరు నెలల్లో పరిష్కారం**

రేణిగుంట రైల్వేస్టేషన్‌కు రైల్వే బైపాస్ మంజూరై ఏడేళ్లయినా రెండు ఎకరాల భూసేకరణలోనే చిక్కంతా వచ్చింది. 51 కుటుంబాలకు పరిహారం ఇచ్చినా ఖాళీ చేయలేదు. షికారీల సమస్య ఉంది. ఇందుకోసం కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.14 కోట్ల పరిహారం విడుదల చేయించి ఆరు నెలల్లో సమస్య పరిష్కరించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

**తిరుపతి- బెంగళూరు వయా కుప్పం మరో లైన్..**

తిరుపతి- బెంగళూరు వయా కాట్పాడి, కుప్పం వరకు ఒకే లైన్ ఉండటంతో రైళ్ల నిరీక్షణ సమయం పెరిగింది. దీన్ని డబ్లింగ్ చేయాలని చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. బంగారుపేట- జోలార్‌పేట వయా కుప్పం మీదుగా మూడు, నాలుగు లైన్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. తిరుపతి- కాట్పాడి మధ్య డబ్లింగ్‌కు ఆమోదం లభించిందని.. భూసేకరణ వేగంగా చేస్తామని పేర్కొన్నారు.

**90.38 ఎకరా**

గూడూరు- రేణిగుంట రైల్వేలైన్ రాజధాని అమరావతిని అనుసంధానం చేస్తుంది. సరకు రవాణా వేగానికి దోహదపడుతుంది. మూడో లైన్ నిర్మించాలని ఎప్పటినుంచో యత్నాలు జరుగుతున్నాయి. చివరికి ప్రధానమంత్రి గతిశక్తి కార్యక్రమంలో భాగంగా రూ.884 కోట్లతో 83.17 కి.మీ. మేర లైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిర్మాణానికి 90.38 ఎకరాలు అవసరమన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి జేసీ శుభం భన్సల్‌ను కాంపిటెంట్ అథారిటీగా నియమించారు. భూసేకరణ దిశగా ఇటీవల అడుగులు పడ్డాయి. త్వరలో సర్వే చేయనున్నారు. ఎవరెవరు భూములు కోల్పోతారు? పరిహారం ఎంత ఇస్తారు? అన్న వివరాలతో నోటిఫికేషన్ ఇస్తారు. ఆపై భూమిని రైల్వేశాఖకు అప్పగిస్తారు. పనులు మూడేళ్లలో చేయాలని రైల్వేశాఖ లక్ష్యం పెట్టుకుంది. ఏర్పేడు- పూడి మధ్య నూతన రైలుమార్గం రేణిగుంట రైల్వే జంక్షన్‌పై ఒత్తిడి తగ్గిస్తుంది. 25.36 కి.మీ. మేర సాగే ఈ మార్గంలోనూ సర్వే పనులు చురుగ్గా చేస్తున్నారు. లైన్ ఏయే ప్రాంతాల మీదుగా వెళుతుందనే అంశంపై సమాచారం సేకరిస్తున్నారు. త్వరలోనే పరిహారంపై ప్రకటన చేయనున్నారు. కీలకమైన నడికుడి- శ్రీకాళహస్తి మార్గంలో ఇప్పటికే భూసేకరణకు రూ.20 కోట్లు విడుదల చేశారు. మిగతా మొత్తమూ ఇస్తే ఈ పనులు కూడా వేగం పుంజుకుంటాయి.

# కైలాసగిరిపై 'నడక' యాతన..!



అనకాపల్లి : కైలాసగిరిపై పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొన్ని బ్యాటరీ కార్లు మూలకు చేరాయి. కొండ ప్రాంతం కావడం..ఎత్తు ఎక్కువగా ఉండడంతో నడిచేందుకు వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. గతంలో బ్యాటరీ కార్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. వారు పర్యాటకుల నుంచి అధికంగా రుసుము వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఈ ఏడాది జనవరిలో అనుమతులు రద్దు చేశారు. అంతకుముందున్న వాహనాలు మూలకు చేరి తుప్పుపట్టిపోయాయి.రెండు కి.మీ. మేర పర్యాటక ప్రాంతాలు: కైలాసగిరికి వచ్చే పర్యాటకు లు తమ వాహనాలను ప్రవేశ మార్గం వద్ద ఉంచి కొండపైకి నడిచివె ళ్లాలి. ప్రవేశమార్గం నుంచి తెలుగు మ్యూజియం సుమారు 2 కి.మీ. దూరం ఉంది. ఆ మార్గంలోని శివపార్వతులు, శంకునామ చక్రాల భవనం, మెహర్‌బాబా ఆశ్రమం, శాంతి ఆశ్రమం వంటి ఎత్తయిన ప్రదేశాలకు నడిచివెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారి కోసం గతంలో సర్క్యులర్ రైలు నిర్వాహకులు ఉచితంగా బ్యాటరీ కార్లను నడిపేవారు. తర్వాత గడువు పూర్తి కావడంతో నిలిపివేశారు.

**అందుబాటులో ఒకటే:** పర్యాటకుల వినతి మేరకు గత ఏడాది చివరలో ఇద్దరు గుత్తేదారులు చెరో రెండు బ్యాటరీ కార్లను నడిపేందుకు వీఎంఆర్‌డీఏ అనుమతులు ఇచ్చింది. ఒక్కోదానికి నెలకు రూ.10వేల చొప్పున చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. పర్యాటకులు ఒక్కొక్కరి నుంచి రూ.20 మాత్రమే రుసుము వసూలు చేయాలని నిబంధన విధించింది.

ఇద్దరిలో ఒక గుత్తేదారు మాత్రమే రెండు బ్యాటరీ కార్లను నడిపారు. తర్వాత అతను అదనపు రుసుములు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదులు రావడంతో తొలగించారు.ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ సొంతంగా ఒక బ్యాటరీ కారు నిర్వహిస్తోంది. ఇటీవల పర్యాటకుల తాకిడి పెరగడంతో ఒక్కదాంట్లో ఎక్కువ మందిని సర్దుబాటు చేయలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కారు నడిపే వ్యక్తి సెలవు పెడితే మూలన ఉంచాల్సిందే.**బహిరంగ వేలం ద్వారా..:** బ్యాటరీ కార్లు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికొచ్చింది. ఈ వేసవిలోనే వాటిని అందుబాటులోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నాం. పారదర్శకంగా బహిరంగ వేలం ద్వారా బ్యాటరీ కార్ల నిర్వహణను అప్పగిస్తాం. ఎం.వి.ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్

# భవితకు భరోసా!



పాడేరు: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం నిర్వహించే భవిత కేంద్రాలను వైకాపా హయాంలో నిర్లక్ష్యం చేశారు. పిల్లలకు అవసరమైన పరికరాల సరఫరా నుంచి వారికి అందజేయాల్సిన భత్యాల విషయంలోనూ జాప్యం చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. పిల్లలు, వారికి బోధించే సిబ్బందికి అలవెన్స్‌లను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తూ జీతాలు సకాలంలో అందిస్తూ భవితకు భరోసానిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో కొన్ని రకాల పరికరాలను ఈ కేంద్రాలకు అందజేశారు. వ్యక్తిగత ఉపకరణాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలో 67 భవిత కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో సుమారు 7 వేల మంది ప్రత్యేక అవసరాల చిన్నారులున్నారు. వీరికి అక్షరాలు నేర్పించడంతో పాటు ఫిజియోథెరపీ, ఇతర రకాల సేవలందించడం ద్వారా సాధారణ పిల్లల స్థితికి తీసుకువచ్చేందుకు ఈ కేంద్రాలు తోడ్పడుతుంటాయి. ఇక్కడకు వచ్చేవారంతా పేదింటి పిల్లలే. వీరిని ఆయా కేంద్రాలకు తీసుకువెళ్లడానికి తల్లిదండ్రులు, సంరక్షకులకు తలకుమించిన భారం అవుతోంది. దీంతో కొందరే పిల్లలను కేంద్రాలకు తీసుకెళ్తున్నారు. సకాలంలో ఆర్థిక సాయం అందిస్తే కేంద్రాలకు వచ్చేవారి సంఖ్య పెరగడానికి అవకాశం ఉందని కూటమి సర్కారు గుర్తించింది. కొన్ని రకాల భత్యాలు (అలవెన్స్‌లు) పెంచాలని నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన అలవెన్స్‌లు అందజేయనుంది. ఆడపిల్లల కు ఇదివరకు పది నెలలకు ఎస్కార్ట్ (తోడు) అలవెన్స్ కింద రూ.3 వేలు, రవాణా భత్యం కింద రూ.3 వేలు ఇచ్చేవారు.

విశాఖ జిల్లాలో 158 మంది పిల్లలకు సుమారు రూ. 9.68 లక్షల విలువైన పరికరాలను అందించబోతున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 308 మంది పిల్లలకు సుమారు రూ. 45 లక్షల విలువైన ఉపకరణాలు పంపిణీ చేయనున్నారు. వీటిని జిల్లాస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి అందజేస్తామని ఉమ్మడి జిల్లా సమగ్రశిక్షా అదనపు సమన్వయకర్తలు చంద్రశేఖరరావు, జయప్రకాశ్, స్వామినాయుడుకు తెలిపారు.అనకాపల్లి జిల్లాలోని 24 భవిత కేంద్రాలకు ఇటీవల జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ (ఎన్‌టీపీసీ) ద్వారా సీఎస్ఆర్ నిధులతో ఆట వస్తువులు, బోధన, ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. సుమారు రూ. 12.9 లక్షల విలువైన పరికరాలను సమకూర్చడంతో భవిత కేంద్రాల్లో కొత్తకళ కనిపిస్తోంది. విశాఖలోని 11 కేంద్రాలకు అదే తీరున పరికరాలను అందించేలా పలు కంపెనీలను అధికారులు సంప్రదిస్తున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల్లో కొంతమంది ఉపకరణాలు తోడు లేకుంటే నడిచే అవకాశం ఉండదు. అలాంటి వారికి బ్యాటరీతో నడిచే చక్రాల కుర్చీలు, చేతి కర్రలు, ఇతర పరికరాలు అందించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వంలో ఒక్క ఏడాదీ వీటిని అందించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏడాది గడవక ముందే వ్యక్తిగత ఉపకరణాలను తెచ్చింది.

# ధరలో 'మాధుర్యమేదీ'?

నూజివీడు : మధుర ఫల రాజుగా పేరొందిన మామిడికి గిట్టుబాటు ధరపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటల్లో ముందుగానే మామిడి కోతకొస్తోంది. రాత్రిళ్లు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పూతను నిలబెట్టుకునేందుకు రూ.లక్షల విలువైన మందులు పిచికారీ చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది దిగుబడులు తగ్గాయంటున్నారు. వ్యాపారులు సిండికేట్ అయి ధరలను తగ్గించడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారులు, మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇస్తున్న సలహాలు రైతులకు ఉపయోగపడటం లేదు.

**మార్కెటింగ్ సౌకర్యం లేనట్లే**

మామిడికి మార్కెటింగ్ సౌకర్యం కోసం నున్న మార్కెట్టును నూజివీడుకు తరలిస్తామని మంత్రి పార్థసారథి ప్రకటించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు చేసి ఉద్యానశాఖ కమిషనరేట్‌కు పంపారు.



**నాణ్యత ఉంటేనే ...**

నాణ్యత అధికంగా ఉంటేనే వ్యాపారులు ధర పెంచుతున్నారు. లేదంటే వారు చెప్పిన ధరకు కాయలు మార్కెట్‌లో వదిలి రావాల్సిందే. నూజివీడు రసాలు టన్ను రూ.10 వేల నుంచి రూ.12 వేలు, బంగినపల్లి రూ.30 వేల నుంచి 50 వేలు, తోతాపురి రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఇది ఏమాత్రం గిట్టుబాటు కాదని నూజివీడు రైతులు పేర్కొన్నారు. తేనె మంచు పురుగు, పిండినల్లి, పండు ఈగ, రకరకాల తెగుళ్లు బారిన పడి నష్టపోతున్నామని చెప్పారు. సూచనలు కోసం రైతులు నేరుగా సంప్రదించవచ్చని ఉద్యానాధికారిణి ఆర్.హేమ తెలిపారు. కాయ రక్షణకు వినియోగిస్తున్న కవర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లా పరిధిలో 75,564 ఎకరాల్లో మామిడి సాగవుతోంది.

ఈ ఏడాది సాగర్ జలాలు కనుచూపు మేరలో కనిపించకపోవడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతం. బోరు బావులు, ట్యాంకర్లలో నీటిని తీసుకుని వెళ్లి చెట్టుకు ఉన్న కొద్దిపాటి కాయలను రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

# అక్రమ తవ్వకం.. అవినీతి పెంపకం

నంద్యాల : చేపల చెరువులు వెల్లువలా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండానే వ్యవసాయ భూముల్లో ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. సమీపంలోని సాగునీటి కాల్వల నుంచి గుట్టుగా నీటిని తరలిస్తున్నారు.. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ తీసుకొని చౌర్యానికి పాల్పడుతున్నారు. కుళ్లిన మాంసం వ్యర్థాలను చేపలకు ఆహారంగా ఉపయోగించి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈ దందా రోజురోజుకు పెరిగిపోతున్నా.. మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

**వీరికి అనుమతులు అక్కర్లేదు**

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలం తంగడంచెలో 10 ఎకరాల వ్యవసాయ పొలంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆధ్వర్యంలో అక్రమ చేపల చెరువు సాగవుతోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో ఎలాంటి అనుమతి లేకుండానే రెండు చోట్ల చేపలు పెంచుతున్నారు.మంత్రాలయం మండలం రాంపురం, కగల్లు, శాతనూరు తదితర గ్రామాల్లో 10 అక్రమ చెరువులు ఉన్నాయి. కోసిగి మండలంలో మరో 10 చోట్ల అనుమతుల్లేకుండానే చెరువులు తవ్వి చేపలు పెంచుతున్నారు. ఒక్కోటి 10 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో తవ్విన వీటికి తుంగభద్ర నది నీటిని ఉపయోగిస్తున్నా అడిగేవారు లేరు.

**గడిగరేవుల.. ఆగడాలు చాలా**

గడివేముల మండలం గడిగరేవుల గ్రామంలో 30కి పైగా అక్రమ చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ రైతులు గోరుకల్లు జలాశయం నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం భూములను లీజు పద్ధతిలో అప్పగించారు. ఈ భూముల్లో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరిగాయి. ఒక్కో రైతు 3 నుంచి 10 ఎకరాల వరకు మట్టి తవ్వకాల కోసం తమ భూములను ఇచ్చారు. కోస్తా ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఈ భూములను లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చారు. ఇక్కడ కొన్ని చెరువులకు కుందూనది నుంచి నీటిని అక్రమంగా తోడుకుంటున్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తూ ప్రభుత్వానికి మోసం చేస్తున్నారు.

**మట్టి దోచి.. చెరువుగా మార్చి**

నంద్యాల మండలం అయ్యలూరుమెట్టలో రెండు ప్రాంతాల్లో అనుమతి లేని చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ గతంలో ఇటుకల బట్టీల కోసం వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో పొలాల్లో గుంతలు పడ్డాయి. వ్యవసాయానికి పనికిరాకుండా పోయిన ఆయా భూముల యజమానులతో ఒప్పందం చేసుకుని వ్యాపారులు చేపల చెరువులుగా మార్చేశారు. కొన్నేళ్లుగా చేపల పెంపకం సాగిస్తున్నారు. జిల్లా కేంద్రం చెంతనే అక్రమాలు సాగుతున్నా మత్స్యశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**కోళ్ల వ్యర్థాలే దాణా**

సాధారణంగా చేపలకు నాచు, ఉడికించిన మొక్కజొన్న, తవుడు లాంటి దాణాను ఆహారంగా ఇస్తుంటారు. కానీ క్యాట్ ఫిష్, ఫంగస్, తెల్లరకం చేపలు జంతు కళేబరాలు, కోళ్ల వ్యర్థాలు తింటాయి. మంచినీటిలో పెరిగే చేప నెలకు అర కిలో నుంచి కిలో వరకు పెరిగితే చికెన్ వ్యర్థాలు తినే చేపలు రెండు నుంచి ఐదు కిలోల వరకు పెరుగుతాయి. అంతేకాకుండా చేపల దాణాతో పోల్చితే చికెన్ వ్యర్థాలు తక్కువ ధరకు లభిస్తాయి. ఆయా చెరువుల్లో పెరిగిన చేపలను హైదరాబాద్, బెంగళూరు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. గడిగరేవుల, అయ్యలూరుమెట్ట ప్రాంతాల్లో అక్రమంగా చేపల చెరువులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. **ఎకరానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి**

ప్రస్తుతం నంద్యాలలో 700 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 300 ఎకరాల వరకు అక్రమ చేపల చెరువులు ఉన్నట్లు అంచనా. చేపల చెరువు సాగుకు అధికారికంగా అనుమతి తీసుకోవాలి. ఇందుకు ఎకరాకు రూ.వెయ్యి వరకు మత్స్యశాఖకు రుసుము చెల్లించాలి.

మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వారి ఆమోదం తర్వాత చెరువు నిర్మాణానికి తవ్వకాలు చేపట్టాలి. విస్తీర్ణాన్ని బట్టి రెవెన్యూ, భూగర్భజలశాఖ, జలవనరుల శాఖ అధికారులు కొలతలు వేస్తారు. ఆమేరకే తవ్వాలి. ఆ తర్వాత కాలుష్య నియంత్రణ మండలి ఎన్‌వోసీ జారీ చేస్తుంది. వాణిజ్య విభాగం కింద విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాలి.

# నాటి తప్పులు.. నేటి తిప్పలు!



ఉరవకొండ : పంచాయతీలోని 8వ రేషన్ దుకాణాన్ని వైకాపా నాయకుడు నిర్వహించేవాడు. గతేడాది ఆగస్టులో కొత్త డీలర్‌కు అప్పగించినప్పుడు 40 క్వింటాళ్ల బఫర్ స్టాక్ ఉన్నట్లు చూపారు. ఆ బియ్యాన్ని కొత్త డీలర్‌కు అప్పగించలేదు. ఇన్ని నెలలు మౌనంగా ఉన్న అధికారులు ఏప్రిల్‌కు సంబంధించి 13 కిలోలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో డీలర్ అధికారులతో గొడవ పడ్డారు. మార్చి 31న 23 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. దుకాణం పరిధిలో 242 కార్డుదారులకు 40 క్వింటాళ్లు అవసరం. అధికారులు కేటాయించిన బియ్యం సగం కార్డులకే సరిపోతాయని డీలర్ వాపోతున్నాడు.

చెన్నేకొత్తపల్లి పంచాయతీలోని 11వ దుకాణాన్ని గతేడాది ఆగస్టులో కొత్త డీలర్‌కు అప్పగించే సమయంలో 23 క్వింటాళ్ల బఫర్ స్టాక్ ఉన్నట్లు చూపించారు. ఆ సరకును అప్పగించలేదు. పాత డీలర్ నుంచి బియ్యం రికవరీ చేయకపోగా కొత్త డీలర్‌కు ఇవ్వాల్సిన దాంట్లో ప్రతినెలా కోత పెడుతున్నారు. దుకాణం పరిధిలో 310 కార్డులు ఉండగా 45 క్వింటాళ్లు అవసరం. ఏప్రిల్‌కు సంబంధించి 22 క్వింటాళ్లే ఇస్తామని చెప్పడంతో డీలర్ అంగీకరించ లేదు. ఫలితంగా బియ్యం పంపిణీ మొదలుకాలేదు.

పేదల బియ్యం పంపిణీలో అధికారులు కోత విధిస్తున్నారు. ఏప్రిల్‌కు సంబంధించి రేషన్ దుకాణాలకు అందించాల్సిన బియ్యంలో సగమే సరఫరా చేశారు. కొన్నింటికి అసలే ఇవ్వకపోవడంతో ఆయా ప్రాంతాల్లో పంపిణీ నిలిచిపోయింది. తక్కువ మొత్తం బియ్యం కేటాయించిన దుకాణాల్లో పంపిణీ తమ వల్ల కాదంటూ డీలర్లు చేతులెత్తేస్తున్నారు. బఫర్‌స్టాక్ బూచిగా చూపి కోత విధించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా హయాంలో అప్పటి డీలర్లు చేసిన తప్పులకు ఇప్పుడు తమను ఇబ్బంది పెట్టడం సరికాదంటున్నారు. క్షేత్రస్థాయిలో కొందరు సీఎస్‌డీటీలు గతంలో తాము చేసిన అక్రమాలను కప్పిపుచ్చుకోవడం కోసమే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిల్వల పేరుతో దోపిడీ**

వైకాపా ఐదేళ్ల పాలనలో పేదల బియ్యాన్ని పెద్దమొత్తంలో పక్కదారి పట్టించారు. అప్పటి డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వేలాది టన్నులు స్వాహా చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక గతేడాది ఆగస్టులో కొత్త డీలర్లను నియమించారు. నిబంధనల మేరకు పాత డీలరు తన వద్ద ఉన్న బఫర్ (నిల్వలు)ను కొత్త డీలర్‌కు అప్పగించాలి. ఉమ్మడి అనంత జిల్లాలో ఒక్కచోట కూడా అలా జరగలేదు. అధికారులు మాత్రం బఫర్ స్టాక్‌ను కొత్త డీలర్ల ఖాతాలోకి సాంకేతికంగా బదిలీ చేశారు. ఆ నిల్వలను మింగేసిన పాత డీలర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వచ్చారు. కనీసం జరిమానాలు విధించలేదు. పాత డీలర్లు కాజేసిన బియ్యం లెక్కలను సరిచేయడానికి ఇప్పుడు కొత్త డీలర్లకు ఇవ్వాల్సిన దాంట్లో కోత విధిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**చక్రం తిప్పుతున్న సీఎస్‌డీటీలు**

వైకాపా హయాంలో జరిగిన బియ్యం దందాలో చాలామంది సీఎస్‌డీటీలు భాగస్వాములే. అప్పట్లో డీలర్ల నుంచి నెలనెలా మాముళ్లు వసూలు చేసిన సీఎస్‌డీటీలు వారి అక్రమాలకు సహకారం అందించారు. కూటమి ప్రభుత్వంలో వారంతా వారి స్థానాల్లోనే కొనసాగుతున్నారు. వారంతా పాత వారిపై చర్యలు తీసుకోకుండా కొత్త డీలర్లకు రావాల్సిన దాంట్లో కోత విధిస్తున్నారు.

**అనంతపురం జిల్లాలో ఇలా..**

రేషన్ దుకాణాలు: 1645

నెలవారీ బియ్యం పంపిణీ: 8,800 క్వింటాళ్లు

## ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్

ధర్మవరం : చేనేత కేంద్రమైన ధర్మవరంలో మెగా క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కుదేలైన చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ధర్మవరంలో రూ.35 కోట్ల వ్యయంతో క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసింది. అందుకోసం ధర్మవరంలో ఇంటింటా సర్వే చేపట్టి చేనేత కార్మికులను గుర్తించింది. చేనేత మగ్గాలు నేస్తున్న 10,200 మంది ఉన్నట్లు చేనేత జౌళిశాఖ అధికారులు గుర్తించారు. క్లస్టర్ ఏర్పాటుకు ఐదెకరాల స్థలం అవసరం కానుండటంతో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో ఉన్న స్థలాన్ని చేనేతజౌళిశాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. స్థలం లీజుకు తీసుకుని ఆ స్థలంలో దాన్ని ఏర్పాటు చేయనున్నారు. స్థలం లీజుకు కేటాయించాలని ప్రభుత్వాన్ని అధికారులు కోరారు.

**నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ**

మెగా క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇప్పటికే పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్రంలోని పెద్దలతో మాట్లాడారు. మెగా క్లస్టర్ ఏర్పాటుకు డీపీఆర్‌ను పంపాలని కేంద్రం కోరడంతో అధికారులు ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం దాన్ని కేంద్రానికి పంపనున్నారు. ధర్మవరంలో మెగా క్లస్టర్ ఏర్పాటు అయితే రూ.5 కోట్లతో భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ



ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన కార్మికులకు చేనేత మగ్గం నేసేందుకు ఉపయోగించే లిఫ్టింగ్ మెషిన్, జాకార్డులు, పంచింగ్ మెషిన్లు 90 శాతం రాయితీతో ఇవ్వనున్నారు. లబ్ధిదారులు 10 శాతం వాటా చెల్లించాల్సి ఉంది. మెగా క్లస్టర్‌లో ఏర్పాటు చేసే మగ్గాలపై చేనేత కార్మికులు పట్టుచీరలు తయారు చేసుకుని విక్రయించవచ్చు. అక్కడే డిజైనింగ్, రంగుల అద్దకం చేసుకోవచ్చు.

**20 ఏళ్లుగా నోచుకోని ప్రయత్నాలు**

చేనేత పరిశ్రమకు సంబంధించిన అన్ని సౌకర్యాలను మెగా క్లస్టర్‌లో ఏర్పాటు చేయనున్నారు. ధర్మవరంలో 20 ఏళ్లుగా చేనేత మెగా క్లస్టర్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నా గతంలో ప్రతిపాదనలకు కూడా నోచుకోలేదు. చేనేత కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ధర్మవరంలో క్లస్టర్ ఏర్పాటుకు అడుగులు ముందుకు వేస్తోంది.

## వరిలో అధికమవుతున్న తెల్లకంకులు

కణేకల్లు : జిల్లాలో సాగులో ఉన్న వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించి, కంకులు తెల్లగా మారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, శింగనమల, కూడేరు, గార్లదిన్నె తదితర మండలాల్లో రైతులు వ్యవసాయ బోర్లు, చెరువుల కింద 50 వేల ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కంకిపోయి గింజలు పట్టే దశలో ఉంది. ఈ నెలాఖరుకు చేతికందనుంది. అయితే తెల్లకంకులుగా మారి తాలు గింజలు కావడంతో దిగుబడిపై ప్రభావం చూపనుంది. వాస్తవంగా ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. తాలు గింజల వల్ల ఎకరాకు 4 నుంచి 5 బస్తాల వరకు దిగుబడి తగ్గే



అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

**మందులు వాడినా ఫలితం శూన్యం**వరిలో తెల్లకంకులు రాకుండా నివారించేందుకు రైతులు మార్కెట్లో దొరికే క్రిమి సంహారక మందులన్నింటిని వినియోగించినా ఫలితం లేదు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏవో సాయికుమార్ వివరణ కోరగా వరి పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇస్తాం. కాండం తొలుచు పురుగు వల్ల తెల్లకంకిగా మారుతుంది. రైతులు కొరాజిన్ లేదా బోరాగాన్ వంటి మందులను తగిన మోతాదులో పిచికారీ చేయాలని చెప్పారు. **పెట్టుబడిపై ప్రభావం..- సంజీవరెడ్డి, లింగదహాళ్** వేల రూపాయలు పెట్టుబడి పెట్టి మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. ఓ వైపు విద్యుత్తు కోతలు, మరోవైపు పంటకు తెగుళ్ల ఆశించి తెల్లకంకులుగా మారుతున్నాయి. దిగుబడి తగ్గి పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

## విద్యార్థులూ.. కళాశాలలకు రండి!

అనకాపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఏడాది విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీతోపాటు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. తొలిసారిగా పరీక్షలు అయ్యాక ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఈనెల 23 వరకు వీటిని నిర్వహించనున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులతోపాటు ఈఏపీ సెట్ కోచింగ్ ఇస్తున్నారు. మరోవైపు పదో తరగతి పూర్తయిన విద్యార్థులను కళాశాలలకు రావాలని ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని 20 జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన వారు 26 వేల మంది ఉండగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 13 వేలే ఉన్నారు. విద్యార్థుల సంఖ్య సగానికి తగ్గిపోవడంతో వీరి సంఖ్య పెంచాలని ఆలోచనతో చర్యలు చేపట్టారు.కళాశాలలకు చేరుకున్న పుస్తకాలు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పాఠ్య, రాత పుస్తకాలు చేరుకున్నాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీటిని అందిస్తారు. ప్రత్యేక తరగతుల్లోనే వీటిని అందించేలా ఏర్పాట్లు చేశాం. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలు రావాల్సి ఉంది. ప్రత్యేక తరగతుల్లో మధ్యాహ్న భోజనం కల్పించాం. విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

సుజాత, ఇంటర్ బోర్డు జిల్లా అధికారిణి

# అన్నదాతల నిరీక్షణకు తెర




అనంతపురం : హంద్రీనీవా ప్రధాన కాలువకు భూమి ఇచ్చిన అన్నదాతల నిరీక్షణకు తెర పడింది. ఎన్నో ఏళ్లుగా భూపరిహారం కోసం ఎదురుచూస్తున్న వారికి తీపికబురు ఇది. వైకాపా ప్రభుత్వ హయాంలో నయాపైసా చెల్లించకుండా అన్యాయం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తొమ్మిది నెలల కాలంలోనే కర్షకులకు భూపరిహారం చెల్లించే ప్రక్రియ చేపట్టింది.

వారం రోజుల నుంచి విడతల వారీగా పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. హంద్రీనీవా ప్రధాన కాలువ, పేరూరు ఉప కాలువ (యూపీపీ), భైరవాని తిప్ప(బీటీపీ) ఉప కాలువ పరిధిలో అన్నదాతలకు భూసేకరణ (ఎల్‌ఏ) కింద తొలి విడత రూ. 45.27కోట్లు మంజూరైంది. ఉరవకొం డ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడు.. తదితర అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 638 మంది రైతుల ఖాతాల్లోకి జమ కానుంది. జీడిపల్లి జలాశయ భూపరిహారం, పునరావాసం కింద మరో రూ. 131. 4కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల ప్రత్యేక ఉత్తర్వు వెలువడిన సంగతి తెలిసిందే. ఇందులో రూ. 81.83 కోట్లు పునరావాసం, తక్కిన మొత్తం భూసేకరణకు కేటాయించారు. త్వరలోనే రైతులు, బాధిత ప్రజలకు అందిస్తారు.

**ప్రధాన కాలువకు..** ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల పరిధి బెళుగుప్ప, కణేకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల పరిధిలో 602 మంది రైతులకు భూ పరిహారం కింద రూ. 41.45కోట్లు వచ్చాయి. ఈ మొత్తం ఇప్పటికే ఖాతాలకు జమ చేస్తున్నారు. త్వరలోనే మిగతా రైతులకు పరిహారం మొత్తం మంజూరు కానుంది.

**పేరూరు, బీటీపీకి రూ.3.82 కోట్లు** పేరూరు అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు(యూపీపీ) కాలువ భూపరిహారం కింద 23 మంది రైతులకు రూ. 1.52 కోట్లు వచ్చాయి. రూ. 14 కోట్లకు ప్రతిపాదనలు పంపగా తొలి విడత కింద సదరు మొత్తం వచ్చింది. రాప్తాడు, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల పరిధి కనగానపల్లి, ఆత్మకూరు, రామగిరి, బెళుగుప్ప, కంబదూరు మండలాల్లో కొన్ని గ్రామాలు వస్తాయి. మరోవైపు బైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ) ఉప కాలువ పరిహారం కింద రూ. 1.52కోట్లు వచ్చాయి. మొత్తం 13 మంది రైతులకు చెల్లిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎక్కువ గ్రామాలు ఉన్నాయి. రూ. 5.14కోట్లకు ప్రతిపాదనలు పంపిస్తే... రూ. 1.52కోట్లు మంజూరైంది. మిగతా మొత్తం త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. యూపీపీ, బీటీపీకి చెందిన భూపరిహారం కోసం 2023లోనే ప్రతిపాదనలు పంపించినా అప్పటి ప్రభుత్వం పైసా కూడా మంజూరు చేయలేదు.

# పంటలపై కుమ్మరిస్తున్నారు..!



చిత్తూరు : జిల్లాలోని పొలాల్లో యూరియా విచక్షణారహితంగా కుమ్మరిస్తున్నారని గణాంకాలు నిర్ధారించాయి. 2023-24లో రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 82 శాతం అధికంగా ఉండగా.. ఇందులో జిల్లాలో వాడకం రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో సగటున ఎకరాకు 102 కిలోలు వాడుతుండగా.. ఎకరాకు 121 కిలోలు ఉండటం గమనార్హం. 2023-24లో పలు మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నా ఎరువుల వినియోగం తగ్గలేదు. జిల్లాలో యూరియా వాడకం రెండింతలు అధికంగా ఉంది. అధికారులు సిఫార్సు ప్రకారం సగటున నాలుగు శాతం వాడాల్సి ఉండగా రెండింతలు అధికంగా 11 శాతం వినియోగిస్తున్నట్లు గణాంకాలు నిర్ధారించాయి. ఈ లెక్కన ఎకరాకు 2-3 బస్తాలు వాడాల్సి ఉండగా.. 5-6 బస్తాలు వినియోగిస్తున్నారు. కొన్ని మండలాల్లో సిఫార్సు చేసిన మోతాదుతో పోల్చితే రెండు రెట్లు అధికంగా వినియోగిస్తున్నారు. రైతులు ఏ ఎరువు బస్తా కొన్నా దాంతోపాటే యూరియా కొని పొలంలో చల్లుతున్నారు. జిల్లాలో పశుగ్రాసం విస్తారంగా ఉన్నందున దానికి మోతాదుకు మించి కుమ్మరిస్తున్నారని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. యూరియాలో 10-20 శాతమే ఉపయోగపడుతుంది. మిగిలినది నీటిలో కరిగిపోవడం లేదా భూమిలోకి చేరుతుంది. భూమి తన స్వభావాన్ని కోల్పోతోంది.

ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా.. జిల్లాలో 45 వేల మంది రైతులు 50 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఆ విభాగ అధికారులు పేర్కొంటున్నారు. అయినా ఎరువుల వాడకం మాత్రం తగ్గడం లేదు.

2023-24లో జిల్లాలో ఎన్‌పీకే (నత్రజని, భాస్వరం, పొటాష్) ఎరువుల వినియోగం: 121 కిలోలు (ఎకరాకు)

ఎన్‌పీకే వినియోగమిలా..

సిఫార్సు: 4: 2: 1


రాష్ట్రంలో సగటు వాడకం: 6: 3: 1

జిల్లాలో వాడకం: 11: 3: 1

# రొయ్యకు మీసం మెలేసే రోజులు!

పాలకొల్లు: నరసాపురం మండలానికి చెందిన శ్రీనివాసు 1.5 ఎకరాల విస్తీర్ణంలో రొయ్యలు సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా రెండు టన్నుల సరకును ఇటీవల ఒకేసారి పట్టుబడి చేయాల్సి వచ్చింది. తెలిసిన సంస్థకు ఫోన్‌చేసి ఒకరికి విక్రయం చేశారు. మర్నాడు చెరువు దగ్గరకొచ్చాక ధరలు క్షీణించాయని.. కిలోకు రూ.10 తగ్గించక తప్పదని చెబుతూ కొనుగోలుదారు సరకు తీసుకెళ్లారు. దీంతో టన్నుకు రూ.10 వేల వరకు రైతు నష్టపోయారు. రొయ్యల సాగుదారులు తరచూ ధరల సమస్య ఎదుర్కొంటున్నారు. వేసవిలో పరిస్థితి దయనీయంగా ఉంటుంది. దీనికి చెక్ పెట్టేలా నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్) ద్వారా రొయ్యల కొనుగోళ్లకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**ఏమిటీ ఎన్‌సీఈఎల్..** ఎన్‌సీఈఎల్ కేంద్ర మంత్రివర్గ ఆమోదంతో



ఏర్పాటైన జాతీయ స్థాయి సహకార సంస్థ. గత రెండేళ్లలో 35 రకాల వస్తువులను 23 దేశాలకు ఎగుమతి చేసింది. రానున్న కాలంలో ఆక్వా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడానికి ఇతర సంస్థలతో కలిసి పనిచేయనుంది. దీని కార్యకలాపాలు ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రారంభించేందుకు రంగం సిద్ధమవ్వగా ఢిల్లీ నుంచి వచ్చిన సంస్థ ప్రతినిధులు జిల్లాలోని ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**ఇవీ ప్రయోజనాలు..**రోజువారీ మార్కెట్ ధరలను స్పష్టంగా సమాచారంలో పొందుపరుస్తారు. సరకు విక్రయించిన రోజు మార్కెట్ ధరను బట్టి రైతులు వాహనాల్లోకి ఎగుమతి చేయగానే దానికి సరిపడా మొత్తాన్ని వారి ఖాతాలకు జమచేస్తారు. పారదర్శక పద్ధతులు పాటిస్తారు. నాణ్యత ప్రమాణాలు పాటించడానికి ఇన్సులేటెడ్ బాక్సుల ద్వారా సరకు రవాణా చేస్తారు. ఆక్వా ఉత్పత్తులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ప్రాసెసింగ్ ప్లాంట్లు నెలకొల్పడానికి ఎన్‌సీఈఎల్ ప్రతిపాదనలు చేస్తోంది

సంఘం సభ్యత్వం ద్వారా.. రైతులు విక్రయించే సరకు ద్వారా సంస్థకు ఎంత లాభం వస్తుందో దానిలో 50శాతం లాభం కూడా తిరిగి వారికి జమవుతుందని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. సంఘంగా ఏర్పడితే సంస్థ వార్షికాదాయంలో 20 శాతం డివిడెండ్ సంఘానికి ఏటా జమవుతుందంటున్నారు. సభ్యత్వం పొందాలంటే రూ. 10,500 మూలధన పెట్టుబడిగా చెల్లించాల్సి ఉంది.

**ఉపాధి అవకాశాలు..** సంస్థ కార్యకలాపాల్లో స్వయం సహాయక సభ్యులను చేర్చాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. అదే జరిగితే ఆక్వా విక్రయాల్లో తూకాల దగ్గర, సరకు ఎగుమతుల్లోనూ డ్వాక్రా మహిళలకు ఉపాధి లభించనుంది. దీనిపై జిల్లా మత్స్యశాఖ ఏడీ ఎల్.ఎల్.ఎన్. రాజును సంప్రదించగా ఎన్‌సీఈఎల్ సంస్థ ప్రతినిధులు జిల్లాలో పర్యటిస్తున్నారన్నారు. కార్యకలాపాలు ప్రారంభమైతే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు.

# కొల్లేరు కమ్మేస్తూ.. మత్స్యకారులను కుంగదీస్తూ..

మండవల్లి : కొల్లేరులో ఎంతో గడ్డు పరిస్థితులను సైతం తమకు అనుగుణంగా మార్చుకుని మనుగడను సాధించే ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్, రాక్షస జాతి(సైల్విన్ క్యాట్‌ఫిష్) చేపలు నానాటికి పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కొల్లేరులో ఎక్కువగా లభ్యమయ్యే చేపల్లో మొదటి స్థానం రాక్షస జాతి, రెండో స్థానం క్యాట్‌ఫిష్‌ది. అతి తక్కువ నీరు, ఎక్కువ వ్యాధి నిరోధక శక్తి, భయంకరమైన మాంసాహారులుగా పేరొందిన ఈ రెండు జాతులు ఇతర చేపల్ని వేటాడి తినడం వల్ల కొల్లేరులో ఇతర జాతులకు మనుగడకు ముప్పు వాటిల్లుతుంది.

క్యాట్‌ఫిష్ సాగు వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పుతోపాటు మనుషుల్లో అనేక వ్యాధులు వస్తున్నాయని 1995 పర్యావరణ వేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 1997లో వీటి సాగుపై కేంద్రప్రభుత్వం నిషేధాన్ని విధించింది. అప్పటి నుంచి సాగు లేకపోయినా కొల్లేరులోని ఇతర మత్స్య జాతులను వేటాడుతూ తన ఉనికిని చాటుకుంటోంది. రాక్షస జాతి చేపలు ఆక్వేరియంలో నాచుని తగ్గించుకోవడానికి వృద్ధి చేశారు. పదేళ్లుగా వీటి సంతతి పంట కాలువలు, చేపల చెరువుల్లో,



ప్రస్తుతం పెద్దఎత్తున కొల్లేరులో దర్శనమిస్తున్నాయి.


**తీవ్రంగా నష్టపోతున్న మత్స్యకారులు..**

2006 కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఎక్కువ మంది మత్స్యకారులు కొల్లేరులో వేటను సాగిస్తూ జీవనాన్ని గడుపుతున్నారు. కానీ గత నాలుగేళ్లుగా క్యాట్‌ఫిష్ జాతి పెరిగి పోవడంతో ఇతర జాతులు లభ్యత క్రమంగా తగ్గుముఖం పట్టింది. అరుదైన జాతులు కనుమరుగవటం క్యాట్‌ఫిష్ స్థాయి పెరిగిపోవడంతో మత్స్యకారులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.అంతరించిపోయే దశలో నల్లజాతి చేపలు.. కొల్లేరులో 126 రకాల చేపలు పెరుగుతుంటాయి. కొన్నేళ్లుగా వేసవిలో కొల్లేరు తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు ఎదుర్కొంటోంది. దీంతో కొల్లేరులో ఏటా నల్లజాతి మత్స్య సంపద తరిగిపోతూ వస్తోంది. కానీ తీవ్ర నీటి ఎద్దడిని తట్టుకుని, బురదలో బతికే స్వభావం ఉన్న ఈ రెండు జాతులు మాత్రం పిల్లలను పెడుతూ దాన్ని వృద్ధి చెందుతున్నాయి.

**చాలా ప్రమాదకరం..** క్యాట్‌ఫిష్ జాతులు చాలా ప్రమాదకరమైనవిగా గుర్తించి ప్రభుత్వం దీన్ని నిషేధించింది. కొల్లేరులో పెరుగుతున్న సైల్విన్ క్యాట్‌ఫిష్, క్యాట్‌ఫిష్‌ను అడ్డుకోవడం సాధ్యమయ్యే పనికాదు. రసాయనాలను వినియోగిస్తే ఇతర జాతులకు ముప్పు. క్యాట్‌ఫిష్ జాతులు దొరికినప్పుడు వాటిని నాశనం చేసేలా మత్స్యకారులే చర్యలు తీసుకోవాలి.- రాజ్‌కుమార్ ఇన్‌చార్జి ఏడీ, మత్స్యశాఖ

## స్టాంపులా.. ఆన్‌లైన్ ఎర్రర్

తిరుపతి : ఆస్తుల క్రయవిక్రయాలకు వినియోగించే స్టాంపు పత్రాల అమ్మకాలకు 'ఆన్‌లైన్ ఎర్రర్' అడ్డుపెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగినన్ని అందుబాటులో ఉంచినా.. వాటి అమ్మక వివరాల నమోదు భారమని భావించి 'ఆన్‌లైన్ ఎర్రర్' అంటూ ప్రజలను పంపేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రజలు వెండర్లను ఆశ్రయించి వారికి అడిగినంత చెల్లిస్తున్నారు. తిరుపతి, తిరుపతి రూరల్ కార్యాలయాల్లో ఇదేతీరు కనిపిస్తోంది. వినియోగదారులకు అవసరమైన జుడీషియల్, నాన్ జుడీషియల్ స్టాంపు పేపర్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచి అమ్మకాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. అయితే వాటిని విక్రయించడానికి సిబ్బంది చొరవచూపడం లేదన్న విమర్శలున్నాయి. మంగళవారం అర్బన్




కార్యాలయానికి వచ్చిన వినియోగదారులను ఆన్‌లైన్ పనిచేయడం లేదని వెనక్కు పంపారు. రిజిస్ట్రేషన్ యథావిధిగా కొనసాగించారు. వెండర్లతో ఉన్న రహస్య ఒప్పందంతోనే ఇలా చేస్తున్నారనే విమర్శలున్నాయి. అటు మ్యానువల్ నకలు, ఈసీల కోసం రోజులతరబడి ఎదురుచూపులు తప్పడం లేదు.

**స్లాట్ బుకింగ్‌కు అవస్థలు** ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వేచిఉండాల్సిన అవసరం లేకుండా స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం ముందుగా ఆన్‌లైన్‌లో డేటా నమోదు చేసుకోవాల్సి ఉంది. దానికి సంబంధించిన సంపూర్ణ వివరాల కోసం కార్యాలయాల్లో సంప్రదిస్తే సహకరించడం లేదనే ఆరోపణలున్నాయి. చేసేదిలేక లేఖరులను ఆశ్రయించాల్సి వస్తోంది.

## అక్రమ వెంచర్లు.. అనుమతి లేని మిద్దెలు

కర్నూలు: ఐదేళ్లలో 'కుడా' పరిధిలో జరిగిన అక్రమాలపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లాలో వైకాపా నేతలు స్థిరాస్తి వెంచర్లలో వాటాలు పుచ్చుకొన్నారు. అక్రమ వెంచర్లను అడ్డుకోవడానికి కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)ని విస్తరించినట్లు చెప్పి ఎక్కడికక్కడ బేరం పెట్టారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) 2017లో ఏర్పడింది. మొదట 2,599 చదరపు కి.మీ.ల విస్తీర్ణంలో కర్నూలు నగరపాలకసంస్థతో పాటు నంద్యాల, డోన్, మున్సిపాలిటీలు, గూడూరు, బేతంచెర్ల నగర పంచాయతీల్లో 117 గ్రామాల పరిధిలో కుడా ఏర్పాటు చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత కుడా పరిధిని విస్తరించారు. 53 మండలాలను కలుపుకొని 15,306 చదరపు కి.మీల విస్తీర్ణంలో 896 గ్రామాలను కుడా పరిధిలోకి తీసుకొచ్చి అక్రమాలు విస్తరించారు. 278 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తేల్చిన అధికారులు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని నోటీసులు ఇస్తున్నారు.

**క్రయ విక్రయాల నిలిపివేత?**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనుమతి లేకుండా వెంచర్లు వేసిన రెండు వందల మందికి తాఖీదులు ఇచ్చారు.. అందులో ఏడుగురే స్పందించారు. తప్పును సరిచేసుకోవాలని సూచించినా పలువురు స్పందించక పోవడంతో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని 'కుడా' అధికారులు నిర్ణయించారు. అనధికార లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి, విద్యుత్తు, కుళాయి కనెక్షన్లకు అనుమతులు ఇవ్వకుండా నిలిపివేయాలని సంబంధితశాఖల ఉన్నతాధికారులకు సూచించారు. ఆయా లేఅవుట్లు ఉన్న సర్వే నంబర్లు గుర్తించి వాటిలో క్రయ విక్రయాలు జరగకుండా ఆపడానికి ఉన్న అన్ని అవకాశాలు పరిశీలిస్తున్నారు.

భారీ భవనాలు నిర్మించేశారు

కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, నంద్యాల, పాణ్యం పరిధిలో అనుమతుల్లేని వెంచర్లు అత్యధికంగా ఉన్నాయి. ఆత్మకూరు, నందికొట్కూరు, కోడుమూరు, బేతంచెర్ల, బనగానపల్లి, ఆదోని, వెల్దుర్తి, పత్తికొండ, ఎమ్మిగనూరు పరిధిలో వెంచర్లు ఇష్టానుసారంగా వేశారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.. హొటళ్లు, లాడ్జీలకు డిమాండ్ ఉండటంలో పలువురు ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు నిర్మించారు. ఇక్కడ ఇలాంటివి 50 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

కర్నూలులోని ఓ ప్రముఖ స్థిరాస్తి సంస్థ రూ.కోట్ల విలువైన హంద్రీ భూములను ఆక్రమించి వెంచర్లు వేసింది.గార్గేయపురం పరిధిలో వాగును ఆనుకొని ప్రముఖ స్థిరాస్తి సంస్థ విల్లాలు నిర్మించింది. 1.24 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు నిగ్గుతేల్చారు.

## టిడ్కో ఇల్లు.. కష్టాలకు చెల్లు

ఆదోని : పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు పూర్తి చేయడంపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. జూన్ నాటికి రెండు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని సంకల్పించింది. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చెల్లించాల్సిన బకాయిలపై వివరాలు ఆరా తీస్తోంది. మిగిలిన ఇళ్లకు వెచ్చించాల్సిన నిధులపై ప్రతిపాదనలు పంపాలని ఆయా అధికారులను ఆదేశించింది. బకాయిలు వెంటనే చెల్లించాలని నిర్ణయించింది. ఆరు పట్టణాలు.. 30,576 ఇళ్లుపట్టణాల్లో మధ్యతరగతి వాసుల సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో టిడ్కో సౌజన్యంతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. ఉమ్మడి జిల్లాలో ఆరు పురపాలిక సంఘాల పరిధిలో 30,576 గృహాల నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.1500-2000 కోట్లు. లబ్ధిదారుల వాటా కింద రూ.29.79 కోట్లు చెల్లించారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని పట్టించుకోలేదు. రూ.18.22 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు పూర్తి చేయడానికి మరో రూ.100 కోట్ల వరకు అవసరం అవుతాయి. కర్నూలు, నంద్యాల టిడ్కో గృహ సముదాయంలో మహిళా మార్టుల నిర్మాణానికి మరో రూ.కోటి నిధులు అవసరం.

## అటకెక్కిన ఆదేశాలు... విధుల్లోనే అక్రమార్కులు..!



విశాఖ : వైకాపా హయాంలో మహా విశాఖ నగర పాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికాభివృద్ధి)లో జరిగిన అక్రమాలపై ఆధారాలతో ఫిర్యాదులు అందడంతో.. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాటి కమిషనర్ ఆదేశించారు. తర్వాత కమిషనర్ బదిలీ కావడంతో దస్త్రం మూలకు చేరింది. గత ప్రభుత్వ పాలనలో కోట్ల రూపాయల నిధులు జేబులో వేసుకుని, నాటి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి ఉద్యోగాలు కాపాడుకున్న వారిపై... నేటి కూటమి ప్రభుత్వం విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నా, కనీసం పట్టించుకోక పోవడం గమనార్హం. అయితే అప్పట్లో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న వారంతా ప్రస్తుతం దర్జాగా కొలువుల్లో కొనసాగుతున్నారు.

**ఇవీ ఆరోపణలు:** కొవిడ్ సమయంలో మాస్కులు కుట్టించి, సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 లక్షలతో టెండర్లు పిలిచి, జీవీఎంసీ మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించింది. కేవలం 3 వేల మాస్కులు మాత్రమే కుట్టి, రూ.70 లక్షలకు పైగా నిధులు కాజేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

నాటి ఉత్తరాంధ్ర వైకాపా ఇన్‌ఛార్జి విజయసాయిరెడ్డికి సన్మానం, పిక్నిక్ నిర్వహణకు ఓ పొరుగు సేవల ఉద్యోగి 1100 మంది ఆర్పీల నుంచి రూ.3వేల చొప్పున రూ.33 లక్షలు వసూలు చేశారు. అనంతరం సాయిరెడ్డికి సన్మానం, పిక్నిక్ రద్దయ్యాయి. కాని ఆ నిధులు సంబంధిత ఉద్యోగి వద్దనే ఉన్నాయని పలువురు ఆర్పీలు చెబుతున్నారు.

జీవీఎంసీలో ఆర్పీలుగా చేరిన 200 మందికి 'ఆర్పీ లాగిన్' ఇవ్వడానికి ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు చొప్పున రూ.60 లక్షలు వరకు వసూలు చేసినట్లు ఓ పొరుగు సేవల ఉద్యోగిపై ఆరోపణలున్నాయి. ఆరిలోవ, గాజువాక, మల్కాపురానికి చెందిన ముగ్గురు ఆర్పీల ఖాతాల్లో రూ.10 లక్షలు చొప్పున జమ చేసినట్టు ఆధారాలు కూడా ఉన్నాయంటున్నారు. వీటితో పాటు ఇతర అక్రమాలపై తెదేపా కార్పొరేటర్ రాపర్తి కన్నా పూర్తి ఆధారాలతో కౌన్సిల్‌లోనే మేయర్ హరి వెంకట కుమారికి, నాటి కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

నామమాత్రమేనా..?: కొన్ని ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ అనంతరం మెప్మా పొరుగు సేవల ఉద్యోగి పాత్ర ఉన్నట్టు తేలడంతో సస్పెన్షన్ వేటు వేశారు. రూ.2 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. దీనిపై లోతైన విచారణ చేపట్టి, బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని అప్పటి యూసీడీ పథక సంచాలకులను కమిషనర్ ఆదేశించారు. కాని నేటికీ పూర్తిస్థాయిలో విచారణ జరగలేదు.

## తీరంలో ప్రగతి కెరటం



అచ్యుతాపురం : పారిశ్రామిక ప్రగతిని పట్టాలెక్కించడానికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులేస్తుంది. తీర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మార్గం సుగమం చేస్తూ ముందడుగు వేసింది. విశాఖ-చెన్నై కారిడార్‌లో పట్టాలెక్కించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. జగన్ సర్కార్ ఐదేళ్లు పట్టించుకోని విశాఖ-చెన్నై నడవాను (కారిడార్) కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. విశాఖ-చెన్నై పారిశ్రామిక నడవాను సాకారం చేయడానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంతోపాటు అసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తీసుకుంటోంది. దీనికి అవసరమైన వాటా నిధులు రూ. 837.71 కోట్లను ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల మీదుగా ఎక్స్‌ప్రెస్ వేతో పాటు పరిశ్రమలకు భూములను గుర్తించారు. మౌలిక వసతుల కల్పనతో పాటు తీరప్రాంతాన్ని ఆనుకొని వందలాది పరిశ్రమలు, విశాలమైన రోడ్ల దీని ద్వారా నిర్మించనున్నారు. ఫార్మా, నాన్ మెటాలిక్ మినరల్స్, రసాయన, పెట్రో కెమికల్స్, ఆహార ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల తీరప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు తీరాన్ని ఆనుకొని జీవించే మత్స్యకార యువతకు భారీగా పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**హైవేతో అనుసంధానం**

పారిశ్రామికీకరణకు విశాలమైన రోడ్లు, నీరు, విద్యుత్తు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. విశాఖ-కాకినాడ పరిధిలో 419 కిలోమీటర్ల మేర రోడ్లను వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దీనివల్ల విశాఖ-కాకినాడకు మధ్య ప్రయాణ సమయం 3 గంటల మేర తగ్గిపోనుంది. గతంలోనే తెదేపా పాలనలో ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించినా జగన్ సర్కార్ దీనిని పూర్తిగా పక్కనపెట్టింది. ఈ రోడ్డును 16వ నంబర్ జాతీయ రహదారితో అనుసంధానం చేయనున్నారు.

పరిశ్రమలకు వేదికగా నిలిచిన అచ్యుతాపురం మరింత అభివృద్ధి చెందనుంది. రోడ్ల విస్తరణ, పోర్టుల అనుసంధానం, తీరప్రాంతంలో భారీగా నిర్మించే పరిశ్రమల కారణంగా యువతకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. పరవాడ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఫార్మాసిటీ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ప్రత్యేక ఆర్థిక మండలి, నాన్ సెజ్, నక్కపల్లి సెజ్, బల్క్ డ్రగ్‌తో ఈ ప్రాంతాలు అభివృద్ధిలో పరుగులు తీయనున్నాయి.

**ఉపాధి అవకాశాలు మెరుగు**


విశాఖ-చెన్నై కారిడార్‌తో ఈ ప్రాంతంలో భారీగా పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండదు. మత్స్యకార యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి-సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తోంది. అవకాశాలను అందిపుచ్చుకొని నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా.
సుందరపు విజయ్‌కుమార్, ఎమ్మెల్యే, ఎలమంచిలి

**చంద్రబాబు ముందుచూపు**

పరిశ్రమల ఏర్పాటుతో వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతోంది. సెజ్ రాకముందు అచ్యుతాపురంలో రూ.లక్ష ఉండే ఎకరా భూమి కోట్లకు చేరింది. విశాఖ-చెన్నై కారిడార్ పూర్తిస్థాయిలో పట్టాలెక్కితే ఈ ప్రాంతం అభివృద్ధిలో మరింత దూసుకుపోతుంది. సీఎం చంద్రబాబు ముందుచూపునకు ఈ ప్రాజెక్టు సజీవ సాక్ష్యం.
ప్రగడ నాగేశ్వరరావు, ఛైర్మన్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్

## అదనపు వాడకమా.. క్రమబద్ధీకరించుకోండి!

అనకాపల్లి : పట్టణానికి చెందిన రామారావు చిరుద్యోగి. ఇతని ఇంటికి నెలకు రూ.700 విద్యుత్తు బిల్లు వస్తోంది. వేసవి కావడంతో ఇటీవల ఏసీ ఏర్పాటు చేసుకున్నారు. అదనపు లోడ్ వాడుతున్నారని డెవలప్‌మెంటు ఛార్జీలతోపాటు అపరాధ రుసుం విధించారు.ఏటా వేసవిలో అధిక శాతం వినియోగదారులు ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు. ఇటువంటి ఇబ్బందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. గృహ వినియోగదారులకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ అందిస్తోంది. ఈ నెల 1 నుంచి దరఖాస్తులు సీకరిస్తున్నారు.



గృహాలకు విద్యుత్తు కనెక్షన్ తీసుకునే సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఇతర గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంటు ఛార్జీలు వసూలు చేస్తారు. అధిక శాతం మంది దరఖాస్తులో రెండు, మూడు కిలోవాట్లకు అనుమతి తీసుకుంటారు. ఈలెక్క ప్రకారమే అధికారులు ఆప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తారు. తర్వాత గృహ యజమానులు ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటివి ఏర్పాటు చేసుకున్నా అందుకు అనుగుణంగా ఛార్జీలు చెల్లించరు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతో పాటు లోవోల్టేజ్ సమస్యలు వస్తున్నాయి.

**జూన్ వరకు దరఖాస్తుల స్వీకరణ**

గతంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సామర్థ్యాన్ని లెక్కించేవారు. ఎక్కువ లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే డెవలప్‌మెంట్ ఛార్జీతో పాటు జరిమానా వసూలు చేసేవారు. ఇప్పుడు వినియోగదారుడు స్వచ్ఛందంగా ముందుకు కొస్తే కేవలం రుసుంలో సగం రాయితీగా ఇస్తారు. ఈనెల 1 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జూన్ 30వ తేదీ వరకు గడువు ఉంది. ఆ తర్వాత సిబ్బంది తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

విద్యుత్తు బిల్లులపై ప్రస్తుతం ఎన్ని కిలోవాట్లకు డిపాజిట్ చెల్లించారో ఉంటుంది. ప్రస్తుతం ఇంటిలో వినియోగిస్తున్న వాటిని లెక్కించి అందుకు అనుగుణంగా డబ్బు చెల్లించాలి. ప్రతి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంటు ఛార్జీగా రూ.2,000 నిర్ణయించారు. జూన్ నెలాఖరులోపు అయితే దీనికి రూ.1,000 చెల్లించినా సరిపోతుంది. దరఖాస్తు ఫీజు రూ.50. మీసేవ, సచివాలయంతో పాటు అన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. జి.ప్రసాద్, ఎస్ఈ

## చెదిరిన కాల్వలకు.. చేవ చూపాలి

నంద్యాల : తుంగభద్ర, కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న నేల.. 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి కాల్వలు తవ్వారు.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వాటి నిర్వహణ 'నీరు'గారింది.. కాల్వకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగాయి.. లైనింగ్ చెదిరిపోయింది.. గుర్రపు డెక్క విస్తరించింది.. డిస్ట్రిబ్యూటరీల గేట్లు విరిగిపోయాయి.. ఫలితంగా చి'వరి'కి నీళ్లు అందక ఆయకట్టు 'కాడి'తప్పింది. ఏటా వేసవిలో నిర్వహణ పనులు చేపట్టాలి..గత ఐదేళ్లు ఏ ఒక్క పని చేపట్టలేదు.. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు విన్నవిస్తున్నారు. కాల్వల్లో నీటి ప్రవాహం తగ్గింది.. ఇప్పటి నుంచే దృష్టి సారిస్తే వరదల సమయానికి బాగు చేయడానికి వీలుంటుంది.. ఆ దిశగా అధికారులు యత్నించాల్సి ఉంది.

**నిర్వహణకు ప్రతిపాదనలు**



ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరుల పరిస్థితి, వాటి నిర్వహణ, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. ఈమేరకు అధికారులు ప్రాజెక్టుల వారీగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఉపాధిహామీ పథకం కింద వివిధ సాగునీటి ప్రాజెక్టుల కింద పంట కాల్వల్లో పూడికతీత, కంపచెట్లను తొలగించేందుకు కొత్తగా ప్రతిపాదనలు చేశారు. ఈ ఏడాది ప్రాజెక్టుల వారీగా పనులు చేసేందుకు ఇటీవల ఇరిగేషన్ అధికారుల నుంచి ఉపాధి అధికారులు నివేదిక కోరారు.

**రూపుకోల్పోయాయి**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బృందం కాల్వలను పరిశీలించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్సార్బీసీ, కేసీ, తెలుగుగంగ, తుంగభద్ర, ఎల్ఎల్సీ పరిధిలోని కాల్వలన్నీ రూపుకోల్పోయాయి. ప్రధాన, పంట కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూడిక, రాళ్లు నిండిపోయాయి. ముళ్లపొదలతో కట్టలు పటిష్ఠత కోల్పోతున్నాయి. పలుచోట్ల కాల్వల లైనింగ్ నామరూపాల్లేకుండా కొట్టుకుపోయింది. డిస్ట్రిబ్యూటరీల వద్ద గేట్లు శిథిలావస్థకు చేరాయి. తూములు శిథిలమయ్యాయి.

## అక్రమాల హాజరు

కర్నూలు : బీసీ సంక్షేమ వసతి గృహాలు అక్రమాలకు నిలయంగా మారాయి. సంక్షేమాధికారులు తప్పుడు లెక్కలు రాసి నిధులు భోంచేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం కొన్ని వసతి గృహాలను మూసేసింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ వసతి గృహాల సంఖ్య తగ్గిపోయింది. ప్రవేశం పొందే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. విద్యార్థుల డిమాండ్‌ను ఆసరా చేసుకొని సంక్షేమాధికారులు స్థాయికి మించి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఒక వసతి గృహంలో వంద మంది కన్నా ఎక్కువగా ఉండొద్దు.. కానీ చాలా చోట్ల 200 నుంచి 400 మంది వరకు ఉంటున్నారు. కర్నూలు, ఆదోని, డోన్, పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. స్థాయికి మించి ప్రవేశాలు కల్పించి సంక్షేమాధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు.


**బయోమెట్రిక్** వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు బయోమెట్రిక్ విధానంలో తీసుకోవాలి. బీసీ వసతి గృహాల్లో మాన్యువల్‌గా కూడా అవకాశం కల్పించారు.. దీన్ని ఆసరా చేసుకొని సంక్షేమాధికారులు తప్పుడు లెక్కలు రాస్తున్నారు.

ప్రతినెలా నాలుగు ఆదివారాలు, రెండో శనివారం సెలవు దినాలు ఉంటాయి. ఆయా రోజుల్లో తప్ప మిగిలిన అన్ని రోజుల్లో వంద శాతం హాజరు వేసి నిధులు మింగేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడిన సంక్షేమాధికారులు ఇద్దర్ని సస్పెండ్ చేశాం.. విచారణ చేసి నివేదికను డీఆర్వోకు సమర్పించినట్లు కర్నూలు బీసీ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు..

మెనూ బోర్డుకే పరిమితం

ప్రతి నెలా ప్రభుత్వం పోస్టు మెట్రిక్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,600, ప్రీమెట్రిక్ విద్యార్థులకు రూ.1,400 చొప్పున డైట్ ఛార్జీలు చెల్లిస్తోంది. ఏటా మెనూ కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోంది. కళాశాల వసతిగృహ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం,



రాత్రి మెనూ ప్రకారం భోజనం అందించాలి.

ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో ఆది, మంగళ, శుక్ర వారాల్లో చికెన్, వారానికి ఆరుగుడ్లు, ఆరు అరటి పండ్లు, సాయంకాలం రాగి జావ, స్నాక్స్ ఇవ్వాలి. ఎక్కడా మెనూ పాటించడం లేదు. సంక్షేమాధికారులు సంతకాలకు పరిమితం కాగా.. సిబ్బంది నడిపిస్తున్నారు.

**ఇక్కడ భారీగా తినేశారు**

పాణ్యంలో బాలికల కళాశాల వసతి గృహంలో గత నవంబరులో 473 మంది విద్యార్థినులు ఉండగా.. ఈ ఏడాది జనవరిలో 329 మందే ఉన్నారు. కానీ ప్రతినెలా 473 మంది ఉన్నట్లు లెక్కలు సమర్పించారు. ఆమేరకు ప్రభుత్వం విడుదల చేసిన (ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.1,600) మొత్తం సొమ్ము (రూ.2,30,400)ను సంక్షేమాధికారిణి మింగేశారు. 2022 మే నుంచి ఆమె ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు తనిఖీ చేయగా అక్రమాలు వెలుగులోకి రావడంతో ఆమెపై వేటు వేశారు.

పాణ్యం బాలుర కళాశాల వసతిగృహంలో గత డిసెంబరులో 347 మంది విద్యార్థులుంటే.. ప్రస్తుతం 325 మంది ఉన్నారు. కానీ 347 మంది ఉన్నట్లు ఇక్కడి సంక్షేమాధికారి లెక్కలు సమర్పించారు. ప్రభుత్వం విడుదల చేసిన (ఒక విద్యార్థికి నెలకు రూ.1600) రూ.32000 పక్కదారి పట్టించారు. ఉన్నతాధికారులు తనిఖీలు చేయగా అక్రమాలు వెలుగులోకి రావడంతో చర్యలు తీసుకున్నారు.

## ఎంచక్కా వెంచర్లు.. నిబంధనలు పాటించరు

గుత్తి : గుత్తి పురపాలికతోపాటు పరిసర గ్రామాల్లో భూదందా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలను పట్టించుకోకుండా స్థిరాస్తి వ్యాపారులు అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. ఎంచక్కా ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటు పంచాయతీ అధికారులు, అటు పురపాలిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా గుత్తిలో స్థిరాస్తి వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. 2011లో గుత్తి, చెట్నేపల్లి మేజర్ పంచాయతీలను కలిపి ప్రభుత్వం పురపాలికను చేసింది. పట్టణ పరిధిలో సుమారు 80 లేఅవుట్లకు అనుమతులు ఇవ్వకుండా పురపాలిక అధికారులు నిలిపివేశారు. అనుమతులు లేని లేఅవుట్లలో స్థలాలు ఎవరూ కొనుగోలు చేయరాదని హెచ్చరించారు. అయినా సరే అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

**స్థలాల కేటాయింపు ఏదీ**

స్థిరాస్తి వ్యాపారులు ఎకరాకు 10 సెంట్లు రిజర్వుడు స్థలాన్ని బడులు, గుడులు, సామాజిక భవనాల నిర్మాణాలకు కేటాయించాల్సి ఉంది. ఎకరాకు 10శాతం రిజర్వుడు స్థలాన్ని పురపాలిక, పంచాయతీల పేర్లతో రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వాలి. పల్లెల్లో అయితే చదరపు గజానికి రూ.3వేలు పంచాయతీలకు చెల్లించాలి. గ్రామాల్లో ఎక్కడా రిజర్వుడు స్థలాలు ఇవ్వడం లేదు. పైగా లేఅవుట్లలో రోడ్లు, డ్రైయిన్లు నిర్మాణానికి



వీలుగా స్థలాన్ని వదలాల్సి ఉంది. ఇవేవీ పాటించడం లేదు. గుత్తి పట్టణంలో అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఇప్పుడు బ్యాంకుల్లో గృహనిర్మాణాలకు రుణాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారు.

**ఎక్కడెక్కడంటే?**

గుత్తిలోని అనంతపురం రోడ్డు, కర్నూలు రోడ్డు పరిసరాల్లో వెంచర్లు వేశారు. పెద్దవడుగూరు మండలంలోని గుత్తి అనంతపురం, కాశేపల్లి గ్రామాలతోపాటు గుత్తి మండలంలోని కొత్తపేట, బాచుపల్లి, కరిడికొండ, బసినేపల్లి గ్రామాల్లో అక్రమలే అవుట్లు వెలిశాయి. రియల్టర్లు నిబంధలను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. వ్యాపారులకు అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. నోటీసులను అందుకుంటున్న వారు స్పందించడం లేదు.

**తగిన చర్యలు తీసుకుంటాం -శివాజీరెడ్డి, ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో, గుంతకల్లు**

గుత్తి గ్రామీణంలోని పలు చోట్ల స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు వేస్తూ పంచాయతీల అనుమతులు తీసుకోవడం లేదు. అక్రమంగా లేఅవుట్లను వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వాటిపై చర్యలు తీసుకుంటాం. తొలుత లేఅవుట్లను గుర్తిస్తాం.

## మార్కెటింగ్ శాఖ.. ఖాళీలమయం

చిత్తూరు : వైకాపా ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను గాలికొది లేసింది. పంట ఉత్పత్తుల నుంచి సెస్ వసూళ్లే తప్ప రైతుల సంక్షేమం, మార్కెటింగ్ శాఖ బలోపేతాన్ని పూర్తిగా విస్మరించింది. జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో 60 శాతం పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆ ప్రభావం రైతులపై పడుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై రైతులు, అధికారులు ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో పలమనేరు, పుంగనూరు, కుప్పం మార్కెట్ యార్డులు ఈ-నామ్ పరిధిలో ఉన్నాయి. మిగిలినవి సీజన్ మార్కెట్లు. ఇవి చెక్‌పోస్టుల ఆధారంగా కొనసాగుతున్నాయి.

**ఖాళీలు ఇలా..**

పుంగనూరు యార్డులో 18 పోస్టులకు ఏడుగురు, కుప్పంలో ఐదు పోస్టులకు ఒకరే ఉన్నారు. పలమనేరులో 19 పోస్టులకు 10 మంది,



ఎస్ఆర్‌పురంలో ఐదు పోస్టులకు ఐదు ఖాళీనే. నగరిలో 11 పోస్టులకు ఎనిమిది, రొంపిచెర్లలో ఎనిమిదింటికి ఆరు ఖాళీగా ఉన్నాయి. ఇక బంగారుపాళ్యంలో ఎనిమిది పోస్టులకు మూడు ఖాళీ. చిత్తూరులో 22 పోస్టులకు 15 ఖాళీగా ఉన్నాయి. రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డులు మినహా మిగిలిన యార్డులకు చెక్‌పోస్టులతో ఆదాయం సమకూరుతుంది. సిబ్బంది కొరతతో అక్రమ రవాణా, సెస్సు వసూళ్లపై అధికారులు దృష్టిసారించలేకపోతున్నారు.

**ఉన్నవారిపైనే భారం..**

ఉద్యోగుల కొరత కారణంగా ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఉద్యోగుల కొరతతో సెస్ వసూళ్లు, గోదాములు, దుకాణాల అద్దె వసూళ్లు, నిర్వహణ పనులన్నీ చూడాల్సి ఉంది. సిబ్బంది కొరతతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కరవైంది.

జిల్లాలోని మార్కెట్ యార్డులు: 10
ఏటా ఆదాయ లక్ష్యం: రూ.10.49 కోట్లు
ఇప్పటివరకు వసూలు: రూ.7.50 కోట్లు
మొత్తం పోస్టులు 112 విధుల్లో 38 ఖాళీలు 74

## హంద్రీ-నీవా.. చేరువే ఇక

పలమనేరు : కుప్పం బ్రాంచి కెనాల్ కోసం హంద్రీ-నీవా లైనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అప్పినపల్లె నుంచి పరమసముద్రం వరకు ఈ లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అధికారులు ప్రతి 16 కి.మీ దూరానికి ఒక బృందం చొప్పున పనులు నిర్వహిస్తున్నారు.

తెదేపా అధికారంలో ఉన్నప్పుడు హంద్రీ-నీవా నీటిని పెద్దపంజాణి మండలం మాదనపల్లె వరకు తెప్పించారు. గంగవరం మండలం పసుపత్తూరు బ్రాంచి కెనాల్ ద్వారా కుప్పానికి తరలించారు. అప్పట్లో పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల కాలువలకు నీరు రావడంతో రైతులు, గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. ఆ వెంటనే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీని ఊసే మరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కుప్పం వరకు కాలువలో లైనింగ్ పనులు చేపడుతోంది. మే నెలాఖరుకు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని.. అప్పినపల్లె-కుప్పం వరకు లైనింగ్ కోసం రూ.10 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డీఈ విజయభాస్కర్ తెలిపారు.

# ఆగ్రోస్‌కు పూర్వవైభవం



అనంతపురం : వైకాపా ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఏపీ ఆగ్రోస్)కు ఒక్కపైసా నిధులు, రాయితీ పరికరాలు ఇవ్వకుండా మూలన పడేశారు. రాయితీతో అందించే పరికరాలు, పనిముట్లు, యంత్రాలను గ్రూపులకు మంజూరు చేసి, రైతులకు ఇబ్బందులు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆగ్రోస్‌కు పునరుజ్జీవం పోసింది. వ్యవసాయ పరికరాలు, పనిముట్లను సరఫరా బాధ్యతలను ఆగ్రోస్‌కు అప్పగించింది. గ్రూపులకు స్వస్తి పలికింది. వ్యక్తిగత రాయితీ పరికరాలకు నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం ఉత్తర్వులు, మార్గదర్శకాలను జారీ చేసింది. 50 శాతం రాయితీతో అందించడంపై జిల్లా రైతాంగం నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.

**అర్హులైన రైతులు వీరే..**

ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులతోపాటు చిన్నసన్నకారు రైతులు అర్హులు. వీరంతా ఆ ఐదేళ్లలో ఈ-పంట నమోదు తప్పసరిగా చేసుకుని ఉండాలి. అటవీ భూములు (ఆర్‌వోఎఫ్ఆర్) కలిగిన రైతులు కూడా అర్హులు. ఒక రైతుకు ఒక పనిముట్టు మాత్రమే ఇస్తారు. ట్రాకర్ ఉంటేనే ట్రాకర్‌కు సంబధించిన పనిముట్లే ఇస్తారు. రైతు సేవా కేంద్రాల్లో ఎన్ఐసీ వెబ్‌సైట్లో వెబ్ అప్లికేషన్, మొబైల్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మండల వ్యవసాయాధికారి, డివిజన్ ఏడీఏ ఆప్రూవ్ చేస్తే ఆగ్రోస్ సంస్థ ఖాతాకు సొమ్ము నేరుగా జమ చేస్తారు.

**ఈ నెలాఖరులోపే ఖర్చు..**

మరో నెలలో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. రైతులకు రాయితీతో పరికరాలు, పనిముట్లు, యంత్రాలు అందించాలని ముందుగా నిర్ణయించింది. ఈనెలాఖరులోనే నిధులు ఖర్చు చేయాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 3,322 మంది రైతులకు రూ.7.75 కోట్లు నిధులు రాయితీ పరికరాలకు మంజూరు చేసింది. దాంట్లో మూడు రకాల పిచికారీ యంత్రాలు, ట్రాక్టర్ పరికరాలు, రొటావేటర్లు, పవర్ వీడర్లు, బ్రష్‌కట్టర్లు, పవర్ టిల్లర్లు మంజూరు చేసింది. గతంలో సొమ్ము మొత్తం చెల్లిస్తే రాయితీ తర్వాత ప్రభుత్వం రైతులకు ఖాతాలకు చేసేది. ఇప్పుడు అలా కాదు. రైతు వాటా చెల్లిస్తే చాలు పరికరాలు మంజూరు చేస్తారు.

**మేనేజర్ల నియామకం**

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆగ్రోస్ మేనేజర్లను నియమించారు. అనంతపురం డివిజన్ భూసార సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఏడీఏ ఓబుళపతిని అనంతపురం ఆగ్రోస్ జిల్లా మేనేజర్‌గాను. హిందూపురం డివిజన్‌లో భూసార సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఏడీఏ శ్రీనివాసులును శ్రీసత్యసాయి జిల్లా ఆగ్రోస్ మేనేజర్‌గా నియమించారు.

**26 లోపు ప్రక్రియ పూర్తి - ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారులు** పనిముట్లు, పరికరాలు సరఫరా బాధ్యతలు ఏపీ ఆగ్రోస్‌కు అప్పగించారు. 8 పరికరాలున్నాయి. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 5న మండలాల వారీగా క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తాం. ఈ ప్రక్రియంతా ఈనెల 26 లోపు పూర్తి చేయాలి.

# గ్రానైట్ పరిశ్రమ గట్టెక్కేనా..!




తాడిపత్రి : ఒకప్పుడు తాడిపత్రి గ్రానైట్‌కు విపణిలో మంచి గిరాకీ ఉండేది. ఇక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుండేవారు. వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగేది. గత వైకాపా ప్రభుత్వం విధానాలతో ఇప్పుడా పరిస్థితి లేదు. వందల పరిశ్రమలు మూతపడ్డాయి. వేలాదిమంది కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

తాడిపత్రి పరిసరాల్లోని చుక్కలూరు క్రాస్, సజ్జలదిన్నె పరిధిలో గతంలో 530 గ్రానైట్ పరిశ్రమలు ఉండేవి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలతో నిర్వహణ భారమై ప్రస్తుతం 120 పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి. అప్పట్లో నాలుగు దఫాలుగా విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో నెలకు ఒక్కో పరిశ్రమకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు బిల్లు వచ్చేది. రాయల్టీ వసూలు ప్రైవేట్ వారికి అప్పగించడంతో వృథాగా వెళ్లే గ్రానైట్ రాయికీ పన్ను వేస్తున్నారు. ఒక్కో లారీకి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు, ప్రభుత్వం 18 శాతం పన్ను వసూలు చేస్తోంది. గ్రానైట్ టైల్స్‌కు రాజస్థాన్‌లో 5శాతమే పన్ను ఉండటంతో అక్కడ తక్కువ ధరకే లభిస్తోంది. దీంతో ఇక్కడి గ్రానైట్‌కు డిమాండ్ తగ్గింది. ఈనేపథ్యంలో పరిశ్రమలు మూతపడుతున్నాయి. కొంతమంది పరిశ్రమను మూత వేసుకోలేక బాడుగకు ఇస్తున్నారు. మరికొందరు యంత్రాలను గుజిరీకి వేస్తున్నారు.

**మూతపడినా విద్యుత్తు భారమే...**

పరిశ్రమలు మూతపడినా.. వాటికి విద్యుత్తు ఛార్జీల రూపంలో ఒక్కో పరిశ్రమ నుంచి రూ.18వేలు వసూలు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయామని, కూటమి ప్రభుత్వమైనా ఆదుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**దిక్కుతోచని పరిస్థితులో కార్మికులు**

పరిశ్రమల్లో పని చేయడానికి స్థానికులే కాకుండా కదిరి, సమీప కర్నూలు, వైయస్ఆర్ జిల్లాల నుంచి కార్మికులు వచ్చేవారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని విభాగాల్లో వేలాది మంది పని చేసేవారు. అందులో చాలామంది రోడ్డున పడ్డారు. మరికొందరు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**పన్నులు తగ్గించాలి -మునిస్వామి, గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకులు**

గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలతో పరిశ్రమలు నష్టపోయాయి. నిర్వాహణ భారమవ్వడంతో అనేక మంది మూతవేసుకుంటున్నారు. వైకాపా ప్రభుత్వం అమలు చేసిన విధానాలను రద్దు చేయాలి. ప్రధానంగా పన్నుల భారం తగ్గించాలి.

**వారంలో నాలుగురోజులే పని -మల్లికార్జున, పుట్లూరు**

కొన్నేళ్లుగా గ్రానైట్ రాయిని పాలిషింగ్ పని చూస్తూ జీవనం గడిపా. గతంలో వారంలో ఆరు రోజుల పాటు పని ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. చాలా వరకు పరిశ్రమలు మూతపడ్డాయి. జీవనం భారంగా మారింది.

# పల్లెకు వెలుగు బాటలు

అనంతపురం : పల్లె పండుగ ద్వారా గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగింది. అడుగు తీసి అడుగు వేసే దుస్థితి నుంచి రయ్.. రయ్.. అంటూ దూసుకెళ్లేలా రోడ్లను తీర్చిదిద్దుతున్నారు. వాహనదారులకు వెతలతో పాటు ప్రయాణ సమయం తగ్గిపోయింది. రోజు వారీ పనులకు వెళ్లే కూలీల నుంచి సరకు రవాణా వరకు సాఫీగా ప్రయాణం సాగుతోంది. అన్నింటి ముఖచిత్రం మార్చేందుకు కూటమి ప్రభుత్వం వడిగా అడుగులు వేస్తోంది. మండలాల వారీగా కనీసం రూ.3 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధి నిధులు రూ.226 కోట్లతో 3,612 పనులు మొదలుపెట్టారు. గతేడాది అక్టోబరులో చేపట్టిన పనులు ఇప్పటికే 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. రహదారులు బాగుపడటంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




**చుట్టూ తిరిగి వెళ్లాల్సినవసరం లేదు**

గార్లదిన్నె మండలం ఎం.కొత్తపల్లి నుంచి అంకంపేట రోడ్డు వరకు మట్టి రోడ్డును కూటమి ప్రభుత్వం తారుతో తీర్చిదిద్దింది. మట్టి రోడ్డు కారణంగా స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇటీవల రూ.49.50 లక్షలతో తారు నిర్మించారు. వ్యయప్రయాసలు తగ్గడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నరకప్రాయం నుంచి తప్పించి..**

రాప్తాడు నియోజకవర్గం పరిధి ఆత్మకూరు మండలం తలుపూరు నుంచి కళ్యాణదుర్గం ప్రధాన రహదారి వరకు మట్టి రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత తారు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.కోటితో రహదారి నిర్మాణం పూర్తి చేశారు.

**మట్టి నుంచి విముక్తి**

కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాలతండా నుంచి ఆత్మకూరు వరకు 5 కిలోమీటర్ల ఉన్న మట్టి రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా సాగేది. గోతుల్లో వెళ్లలేక వాహనదారులు నానాతంటాలు పడేవారు. కూటమి ప్రభుత్వం రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మించడంతో స్థానికులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## అంగన్‌వాడీలకు తీపికబురు

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా పరిధిలో అంగన్‌వాడీలకు తీపికబురు ఇది. గత వైకాపా పాలనలో పగటి కలగా మిగిలిపోయిన ఈవెంట్ల (ప్రత్యేక కార్యక్రమాలు)కు సంబంధించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.3.08 కోట్లు మంజూరు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా ఎంపిక చేసిన ప్రాంతాల్లో లబ్ధిదారులకు సీమంతం, అన్నప్రాసన, పూర్వ విద్య సంసిద్ధత, ప్రజారోగ్య అవగాహన.. తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు అంగన్‌వాడీ సిబ్బందే తమ చేతి నుంచి ఖర్చు పెట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో 2022, సెప్టెంబరు నుంచి డబ్బులు ఇవ్వకుండా ఎగనామం పెట్టింది. అప్పట్లో 42 రోజులు నిరవధిక



సమ్మె చేసినా జగన్ సర్కారు స్పందించలేదు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం 12 మాసాలకు అనంత, శ్రీసత్యసాయి జిల్లాలకు నిధులు మంజూరు చేసింది. ప్రతి నెలా రెండు ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. ఒకోదానికి రూ.250 ప్రకారం నెలకు రూ.500 అంగన్‌వాడీ సిబ్బందికి చెల్లించాలి. ఈలెక్కన అనంత జిల్లాలో 2303, శ్రీసత్యసాయి జిల్లాలో 2824 కేంద్రాలు ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి దాకా ఒకేసారి నిధులు వచ్చాయి. అనంతకు రూ.1.38 కోట్లు, శ్రీసత్యసాయికి రూ.1.70 కోట్లు మంజూరు కావడంతో ఏపీ తెలుగునాడు అనుబంధం అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర కోశాధికారి వీణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జమున, రుక్మిణి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ఊరట 'మాటా' వింటారా...?

పుంగనూరు : టమాటా సీజన్‌కు వేసవి కాలం అనువు. ఏటా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో విడతల వారీగా టమాటా సాగుకు రైతన్నలు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. అధిక దిగుబడులపై దృష్టి సారించిన అన్నదాతలు ఆధునిక పద్ధతులు, నూతన వంగడాలపై మొగ్గు చూపుతున్నారు. దీని కోసం బోదెలపై మల్చింగ్ పేపరు పరచడం, టమాటా మొలకలు, ఊతంగా నాటే కర్రలు తదితరాల కోసం ఎకరాకు రూ.3లక్షల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. సాగులో చెట్లు ఏపుగా పెరగడానికి కర్రలు నాటడం తప్పనిసరి. వీటికి డిమాండు రావడంతో రైతులు ధరను బట్టి అడవి కర్రలు, నీలగిరి, వెదురు కర్రలు వాడుతున్నారు.

పుంగనూరు, పలమనేరు, కుప్పం, పూతలపట్టు తదితర నియోజకవర్గాల్లో ఈ సీజన్‌లో సుమారు 25వేల ఎకరాల్లో టమాటా సాగవుతోంది. ఇందుకు రైతులు సాగు పెట్టుబడులు సరాసరి రూ.750కోట్లు వెచ్చిస్తున్నారు. ధరలపై వాతావరణ ప్రభావం, నీటి కొరతతో పెట్టుబడులు చేతికి వచ్చే వరకు ప్రశ్నార్థకమే అని రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ సీజన్‌లో తడులు సక్రమంగా అందించే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**మూడు నెలలుగా ధరలేవీ..**

మూడు నెలలుగా టమాటాకు ధరలు లేవు. అయినా రైతులు టమాటా సాగు చేస్తున్నారు. సాగు ఖర్చులు పెరిగినా ధరలు వస్తే రెట్టింపు స్థాయిలో గిట్టుబాటు అవుతోందని రైతుల ఆశ. స్థానికంగా సాగుకు అవసరమైన పరికరాల ధరలు అధికంగా ఉండటంతో మొలకలు, మల్చింగ్ పేపరు, కర్రలు ఇతర వాటిని కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గత సీజన్‌లో 15 కిలోల టమాటా పెట్టె రూ.1200ల వరకు పలకడంతో రైతులు ఉత్సాహంగా సాగు చేస్తున్నారు.

**షరా మామూలయ్యాయి**

ప్రస్తుత పరిస్థితుల్లో టమాటా సాగు చేయాలంటే పెట్టుబడులు పెట్టాల్సిందే. నూతన వంగడాలు, ఆధునిక పద్ధతులు ఈ ప్రాంతంలో షరా మామూలయ్యాయి. టమాటా పంట జూదంలాంటిదని తెలిసినా సాగు చేస్తున్నా. రెండు ఎకరాలకు రూ.5లక్షలు వెచ్చిస్తున్నా. రామకృష్ణ, టమాటా రైతు, పుంగనూరు

## భూచోళ్లలో గుబులు

శ్రీకాళహస్తి: జగనన్న కాలనీల ఏర్పాటుకు వైకాపా హయాంలో కొనుగోలు చేసిన భూముల అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఏర్పేడు సమీపంలోని చిందేపల్లి, శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు జగనన్న లేఔట్లకు సంబంధించి భూముల కొనుగోళ్లపై సర్వత్రా విమర్శలొచ్చాయి. ఈ వ్యవహారం శాసనసభలో ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అక్రమాలపై నిశిత పరిశీలన చేస్తున్నట్లు స్పష్టం చేయడంతో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది.

ఊరందూరు జగనన్న కాలనీలో 6,231 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు కేటాయించింది 4,873 మందికి మాత్రమే. ఇళ్ల నిర్మాణాలకు దాదాపు 160 ఎకరాల కొనుగోలుకు రూ.250 కోట్లు వ్యయం చేసినట్లు సమాచారం. ఇక్కడి అవినీతి గుట్టు రట్టు చేసేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పరిశీలన చేసుకున్న లబ్ధిదారులు పది శాతంలోపు మాత్రమే ఉండటం అనుమానాలకు తావిస్తోంది.



రాజీవ్‌నగర్ వద్ద ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న డీకేటీ భూములు సేకరించి నగదు చెల్లింపుల్లో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయన్న విమర్శలున్నాయి. ఏర్పేడు మండలం చిందేపల్లి జగనన్న కాలనీలో 250 ఎకరాలు భూములు సేకరించారు. ఇక్కడ వైకాపా అనుకూలంగా ఉన్న వారికి ఓ రకమైన ధరలు, ఇతరులకు తక్కువ ధరల ప్రకారం చెల్లించారనే ఆరోపణలున్నాయి.

చెల్లింపుల్లోనూ విమర్శలే.. జగనన్న కాలనీలకు ప్రభుత్వ భూములతో పాటు చుట్టూ ఉన్న డీకేటీ భూములు, ఊరందూరు సమీపంలో ప్రైవేటు భూములు కొనుగోలు చేశారు. భూసేకరణకు సంబంధించి నిర్వాసితుల వ్యక్తిగత ఖాతాలకు పడిన నగదు 60 శాతం మేరకు మళ్లీ వాళ్ల అకౌంట్ల నుంచి మళ్లించినట్లు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దీనిపై విచారణ చేపడుతుండటంతో అక్రమార్కులు గుబులు చెందుతున్నారు.

చురకలు



## చీరలో అనసూయ గ్లామర్ మాయ.. స్టన్నింగ్ లుక్!

టీవీ యాంకర్‌గా కెరీర్ మొదలు పెట్టిన అనసూయ.. ఇప్పుడు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు పొందిన నటి. క్షణం, రంగస్థలం, 'పుష్ప' వంటి సినిమాల్లో విలక్షణమైన పాత్రలతో నటిగా మెప్పించింది. అలాగే జబర్దస్త్ షోతో స్టార్ యాంకర్‌గా దూసుకెళ్లిన ఆమె.. ఇప్పుడు కిరాక్ బాయ్స్ అండ్ ఖిలాడీ గర్ల్స్ సీజన్ 2తో మళ్లీ ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా అనసూయ తన ఇన్‌స్టాగ్రామ్‌లో చీర కట్టులో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. వయిలెట్ కలర్ చీరను ట్రెండీ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో కంబినేషన్ చేస్తూ, తనదైన శైలిలో కనిపించింది. ఎల్లప్పుడూ చీర యుగంలో.. అంటూ క్యాప్షన్ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సింపుల్ మేకప్, ముత్యాల చెవి కమ్మలు, క్యూట్ నవ్వుతో అనసూయ అందంగా మెరిసిపోయింది. ఇప్పుడు ట్రెడిషనల్ లుక్‌లోనూ గ్లామర్ చూపించడంలో అనసూయ ప్రత్యేకత కనబరుస్తోంది. ఇంతకు ముందు ఆమె వేసిన మోడ్రన్ అవుట్‌ఫిట్లు



వైరల్ అయ్యాయి. అలాగే ఈ చీర లుక్ కూడా సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఎన్ని డ్రెస్‌లైనా... చీరలోనే మీరు మరింత అందంగా కనిపిస్తారు.. అంటూ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఈ లుక్‌తో పాటు ఆమె ప్రొఫెషనల్‌గా కూడా బిజీగా ఉంది. వెబ్ సిరీస్‌లతో పాటు, సినిమాలో గెస్ట్ రోల్స్ చేస్తూ అభిమానుల మద్దతు కూడగడుతోంది. రజాకర్ సినిమాలో కూడా ఆమె పాత్ర ప్రత్యేకంగా నిలిచింది. టీవీలో కూడా యాంకరింగ్ కొనసాగిస్తూ, సోషల్ మీడియాలో గ్లామర్‌తోనూ ప్రెజన్స్ మెయింటెయిన్ చేస్తోంది. అనసూయ ఫొటోలు చూస్తే.. 'సారీ గాళ్' మూడ్‌లో ఆమె మాయ చేస్తోంది అని చెప్పాలి. సింపుల్ కానీ స్టైలిష్ లుక్, కాంపోజర్‌తో పాటు నాజూకు ఫోజులు.. అన్నీ కలిపి ఈ ఫోటోషూట్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లాయి. ఇకపోతే ఈ ఫోటోలకు ఇప్పటికే వేల సంఖ్యలో లైక్స్ వచ్చాయి. మరి భవిష్యత్తులో అమ్మడు చేసే పాత్రలు ఏ రేంజ్ లో క్లిక్ అవుతాయో చూడాలి.

## నా వ్యాఖ్యలను ఎవరూ తప్పుగా అనుకోవద్దు: అనసూయ

జబర్దస్త్ షో ద్వారా అనసూయ బాగా పాపులరైన విషయం తెలిసిందే. ఆ షోలో తన యాంకరింగ్ తో పాటూ అందాలతో కూడా ఆకట్టుకుంది అనసూయ. ఓ వైపు యాంకర్ గా చేస్తూనే సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన అనసూయ రామ్ చరణ్ నటించిన రంగస్థలంలో రంగమ్మత్తగా నటించి మంచి గుర్తింపు అందుకుంది. ఆ సినిమా తర్వాత అనసూయ యాంకరింగ్ మానేసి పూర్తిగా సినిమాల వైపు మళ్లింది. రీసెంట్ గా వచ్చి సెన్సేషనల్ హిట్ గా నిలిచిన పుష్ప2లో కూడా అనసూయ నటించిన విషయం తెలిసిందే. సినిమాల్లో నటిస్తూనే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ రెగ్యులర్ గా తన ఫోటోలను,



అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఉంటుంది అనసూయ. అప్పుడప్పుడు ఈమె వేసే ట్వీట్స్, అమ్మడు చేసే కామెంట్స్ వల్ల అనవసరమైన వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటుంది అనసూయ. తాజాగా అనసూయ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేసింది. నేను నాకు ఎదురైన అనుభవాన్ని, నేను చూసిన సంఘటనలను మాత్రమే షేర్ చేసుకున్నాను తప్పించి ఎవరినీ బ్లేమ్ చేయలేదని, కేవలం అందరికీ అవగాహన రావాలనే అలా మాట్లాడాన ని, నేను అనని వాటిని అన్నట్టు ఎవరూ ప్రొజెక్ట్ చేయొద్దని అనసూయ పోస్ట్ చేసింది. అంతేకాదు, ఎవరేమనుకున్నా అవేమీ తన క్యారెక్టర్ ను డిసైడ్ చేయలేవని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని, తనను అర్థం చేసుకునే వారికి మాత్రమే తన ప్రేమను అందిస్తానని అనసూయ ట్వీట్ లో పేర్కొంది. దీంతో అనసూయ ఈ ట్వీట్ ఎవరిని ఉద్దేశించి వేసిందనేది ఆసక్తికరంగా మారింది. అయితే రీసెంట్ గా అనసూయ ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూలో తన డ్రెస్సింగ్ గురించి, ఫ్యామిలీ గురించి, రిలేషన్‌షిప్ గురించి అనూ ఎన్నో చెప్పుకొచ్చింది. తన వ్యాఖ్యల వల్ల అందరూ అనసూయను నెట్టింట తెగ ట్రోల్ చేస్తున్నా రు. ఈ నేపథ్యంలోనే అనసూయ ఆ ట్వీట్ చేసిందని అర్థమవుతుంది. ప్రస్తుతం అనసూయ చేసిన ట్వీట్ నెట్టింట వైరల్ అవుతుంది. అయినా ఇలా వివాదాల్లో నిలవడం అనసూయకు కొత్తేమీ కాదు.




## ఇది కదా అసలు సిసలైన ఫైట్..!



సినిమాల రిలీజ్ కు ప్రతిసారి ఒక సీజన్ అనేది ఉంటుంది. సంక్రాంతి, దసరా, దీపావళి, క్రిస్ మస్ ఇలా ఫెస్టివల్ టార్గెట్ గా స్టార్ సినిమాలు రిలీజ్ ఉంటాయి. వాటితో పాటే సమ్మర్, పోస్ట్ సమ్మర్ లో కూడా కొన్ని సినిమాలు టార్గెట్ పెట్టుకున్నాయి. ఐతే ప్రతి ఏడాది ఇండిపెండెన్స్ డే కి కూడా కొంత ఇంట్రెస్టింగ్ ఫైట్ బాక్సాఫీస్ దగ్గర ఉంటుంది. ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాల మధ్య ఈ పోటీ ఉ ంటుంది. ఈసారి ఇండిపెండెన్స్ డే కి రెండు భారీ సినిమాలు తలపడుతున్నాయి. మొన్నటిదాక రిలీజ్ డేట్ లు కన్ఫర్మ్ చేయని ఈ సినిమాలు ఫైనల్ గా రణరంగానికి సిద్ధం అనేస్తున్నాయి. ఈ ఇయర్ ఆగష్టు 14న రిలీజ్ కు రెడీ అవుతున్నాయి రజినీకాంత్ కూలీ, ఇంకా హృతిక్ ఎన్ టీ ఆర్ నటిస్తున్న వార్ 2. ఈ రెండు సినిమాలు తెలుగు వెర్షన్ డబ్బింగ్ కే ప్రిఫరెన్స్ ఇస్తాయి. అయినా కూడా ఈ సినిమాలు తెలుగు బాక్సాఫీస్ దగ్గర కూడా గట్టి పోటీ పడనున్నాయి. లోకేష్ కనకరాజ్ డైరెక్షన్ లో సూపర్ స్టార్ రజినీ నటిస్తున్న కూలీ సినిమా భారీ అంచనాలతో వస్తుంది. ఈ సినిమా విషయంలో ఇప్పటికే ఫ్యాన్స్ ఎక్స్ పెక్టేషన్స్ తారాస్థాయిలో ఉన్నాయి. అంతేకాదు సినిమాలో మన కింగ్ నాగార్జునతో పాటు కన్నడ స్టార్ ఉపేంద్ర భాగం అవడం మరింత స్పెషల్ గా మారింది. లోకేష్ సినిమాలకు పాన్ ఇండియా ఆడియన్స్ ఇంట్రెస్ట్ చూపిస్తారు. సో రజినీ కూలీకి బజ్ ఒక రేంజ్ లో ఉందని చెప్పొచ్చు. ఇక మరోపక్క హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి చేస్తున్న వార్ 2 సినిమా కూడా భారీ అంచనాలతో వస్తుంది. ఈ సినిమాను అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ మూవీ కూడా ఆగష్టు 14న పాన్ ఇండియా రిలీజ్ అవుతుంది. హృతిక్ తో తారక్ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఈ ప్రాజెక్ట్ కు ప్రత్యేకత తెచ్చింది. ఎన్టీఆర్ ఉన్నాడు కాబట్టి ఈ సినిమాకు తెలుగులో సూపర్ డిమాండ్ ఉంటుంది. సో రజినీ కూలీ, ఎన్టీఆర్ వార్ 2 రెండు సినిమాల మధ్య పోటీ రసవత్తరంగా ఉ ండబోతుంది. ఈ సినిమాల్లో ఏది పై చేయి సాధిస్తుంది.. ఏ సినిమా విజయ ఢంకా మోగిస్తుంది అన్నది చూడాలి.

## ఇది ఎప్పటికీ అంతం కాని యుద్ధం: నిహారిక




ఫిట్‌నెస్ అనేది అందాన్ని కాపాడే మంత్రం మాత్రమే కాదు. బలం, పట్టుదలను నిరూపించుకునే సాధనం. జిమ్‌లో కసరత్తులు చేయడం అంత సులువైన పనేమీ కాదు. చాలా పట్టుదల ఉంటేనే సమయపాలనతో జిమ్ కి నిరంతరం హాజరు కాగలరు. అయితే నిహారిక కొణిదెల శ్రమ, కమిట్‌మెంట్ చూస్తున్నవారికి తన సమయపాలన అవగతమవుతుంది. నిహారిక జిమ్ లో కఠినంగా శ్రమించడానికి కారణం.. నటనా రంగంలోకి కంబ్యాక్ అవ్వడమే. తాను అనుకున్న శిఖరానికి చేరడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. నిహారిక తన తదుపరి చిత్రం %-%వాట్ ది ఫిష్%-% కోసం సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో అస్త్రా లక్ష్మి అనే పాత్రను పోషిస్తోంది. నిహారిక పాత్ర ఆద్యతం ఆసక్తికరంగా సాగుతుందని సమాచాం. నిహారిక ఇంతకుముందే "నేను, నా ఫిట్‌నెస్... ఎప్పటికీ అంతం కాని యుద్ధం! ఎల్లప్పుడూ నన్ను ముందుకు నడిపిస్తున్నందుకు ధన్యవాదాలు" అని క్యాప్షన్ ఇచ్చింది నిహారిక. ఇదే పోస్ట్ లో ఆంటోనీ అనే పేరును ప్రస్థావించింది. ఈ వీడియో వేగంగా అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వారు ఫిట్‌గా ఉండటానికి స్ఫూర్తి పొందుతున్నారు. జిమ్ లో నిహారిక నీలిరంగు బ్రాలెట్, షార్ట్ ధరించి, భారీ టీ-షర్ట్‌తో కనిపించింది. సూపర్ ఫిట్ అని నిరూపించుకోవడం ద్వారా కెరీర్ ని సరిదిద్దుకోవాలని తపించడం సరైనదే. అన్ని సవాళ్లను నెగ్గాలని మెగా ప్రిన్సెస్ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## సిల్వర్ ఫ్రాకులో జాన్వీ థై థండర్ షో


అందాలను బోల్డ్ గా ఎలివేట్ చేయడంలో జాన్వీ కపూర్ తర్వాతే. చిట్టి పొట్టి నిక్కర్లు.. బికినీలు.. మోనోకినీలు.. స్విమ్ సూట్లలో చెలరేగడంలో జాన్వీని కొట్టేవాళ్లే లేరు. బీచ్ బికినీ సెలబ్రేషన్స్ తో.. నిరంతరం ఈ బ్యూటీ యువతరంలో హాట్ టాపిక్. కొన్నేళ్లుగా తనదైన అందం, ఆకర్షణ, అద్భుత నట ప్రతిభతో అలరిస్తున్నా, ఫ్యాషన్ సెన్స్ పరంగా అసాధారణ ప్రయోగాలతో జాన్వీ యువతరం హృదయాలను కొల్లగొడుతోంది. సోషల్ మీడియాల్లో కపూర్ గాళ్ అన్ లిమిటెడ్ ట్రీట్ కి యూత్ ఫిదా అవుతోంది. ఇన్ స్టా వేదికగా జాన్వీ ఘాటైన



ఫోటోషూట్లతో చెలరేగుతోంది. తాజాగా జాన్వీ థై థండర్ షో హాట్ టాపిగ్గా మారింది. అద్భుతమైన సిల్వర్ లైనింగ్ ఫ్రాక్‌లో యువనటి థై అందాలను ప్రదర్శించిన తీరు మతులు చెడగొడుతోంది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ నుంచి కొన్ని ఫోటోలను యూత్ వైరల్ గా షేర్ చేస్తూ కామెంట్లు చేస్తున్నారు. వాట్సాపుల్లోను ఇవి వైరల్ గా మారుతున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే... జాన్వీ ప్రస్తుతం సౌత్ పై శ్రద్ధ పెడుతోంది. ఇక్కడ ఆరంగేట్రమే ఎన్టీఆర్ లాంటి అగ్ర హీరో సరసన దేవర లాంటి పాన్ ఇండియా హిట్ చిత్రంలో నటించిన జాన్వీ తదుపరి గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు దర్శకత్వంలోని 'పెద్ది'( ఆర్.సి 16)లో నటిస్తోంది. ఈ మూవీపైనా భారీ అంచనాలున్నాయి. అటు బాలీవుడ్ లోను జాన్వీ రెండు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. సన్నీ సంస్కారి కి తులి కుమారి, పరమ్ సుందరి అనే చిత్రాలలో నటిస్తోంది.

## అవకాశాల కోసం రెండేళ్ల పాటూ ఆఫీసుల చుట్టూ తిరిగా: నిధి అగర్వాల్

టాలీవుడ్ ఆడియన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న సినిమాలు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేస్తున్న హర్రర్ కామెడీ ది రాజా సాబ్. ఈ రెండు సినిమాల్లోనూ హీరోయిన్ గా నటించే అవకాశం అందుకుంది లక్కీ గర్ల్ నిధి అగర్వాల్. ఈ రెండు సినిమాలూ పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతున్నవే. అయితే నిధి అంత ఈజీగా హీరోయిన్ అయిపోలేదట. చిన్నప్పటి నుంచి తనకు సినిమాలంటే ఇష్టముండటంతో అప్పటినుంచే సినిమాలు ఎక్కువగా చూసేదట. దీపికా పదుకొణెను చూసి తాను కూడా సినిమాల్లో నటించాలనుకుందట నిధి. అయితే ఆ విషయాన్ని ఇంట్లో చెప్తే ముందు చదువుకో, తర్వాత సినిమాల గురించి ఆలోచించొచ్చాన్నారట. చదువు అయిపోయాక నిధిని తన తండ్రి బిజినెస్ లో భాగం చేయాలనుకున్నాడట. కానీ తనకు హీరోయిన్ అవాలని ఉండటంతో ఆ దిశగా తన తండ్రి ఆమెను ప్రోత్సహించినట్టు నిధి తెలిపింది. చదువయ్యాక ముంబై వెళ్లి సినీ అవకాశాల కోసం ట్రై చేసిన నిధి, ఫోటోలు పట్టుకుని ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగినట్టు వెల్లడించింది. ఛాన్సులు ఇవ్వకపోయినా కొంతమంది పదేపదే తనను



తిప్పించుకున్నారని నిధి ఈ సందర్భంగా చెప్పింది. రెండేళ్లు ఇబ్బందుల తర్వాత మూడొందల మందిని ఆడిషన్ చేసి చివరకు తనను మున్నా మైఖేల్ కోసం సెలెక్ట్ చేశారని, అలా హీరోయిన్ గా మొదటి ఛాన్స్ అందుకున్నానని, ఆ సినిమా చూసి సవ్యసాచిలో అవకాశమొచ్చి తర్వాత టాలీవుడ్ లో సెటిలైపోయినట్టు చెప్పుకొచ్చింది నిధి. కానీ ఉన్నట్టుండి నిధి నుంచి సినిమాలు తగ్గిపోయాయి. దానికి కారణం పవన్ తో చేస్తున్న హరిహర వీరమల్లుకు ఆమె అగ్రిమెంట్ చేయడమే. ఆ సినిమాలో నటించినంత కాలం మరే సినిమాకూ పని చేయకూడదని నిధి సైన్ చేసిందట. తర్వాత వీరమల్లు వాయిదా పడిన టైమ్ లో ప్రభాస్ సినిమా ఛాన్స్ వచ్చిందని, వీరమల్లు టీమ్ ను అడిగి రాజా సాబ్ సినిమాను ఓకే చేసినట్టు నిధి తెలిపింది. హరిహర వీరమల్లు సినిమా లో తాను వీరమల్లు ప్రేయసి పంచమి పాత్రలో కనిపించనున్నట్టు తెలిపిన నిధి, ఆ సినిమాలో యువరాణిగా కొన్ని యుద్ధాలు కూడా చేసినట్టు వెల్లడించింది. ఇక ప్రభాస్ తో నటిస్తున్న రాజా సాబ్ సినిమాలో తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, రాజా సాబ్ లో తన పాత్ర అందరూ తనని చూసే దృష్టిని మారుస్తుందని, హారర్ సినిమాలంటే భయపడే వాళ్లు రాజా సాబ్ ను తల్లిదండ్రులతో కలిసే చూడమని సలహా ఇచ్చింది నిధి. ఇక తనకు మణిరత్నం డైరెక్షన్ లో వచ్చిన సఖి సినిమా అంటే ఎంతో ఇష్టమని ఆ సినిమాను ఎన్ని సార్లు చూశానో లెక్క కూడా లేదని నిధి తెలిపింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536